JEE MAIN 2026
దేశం మొత్తం మీద వచ్చిన
100 పర్సంటైల్స్
26
అందులో
7 నారాయణవే

www.prajapaksham.in
PRAJAPAKSHAM

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం ★★

JEE MAIN 2026
దేశం మొత్తం మీద వచ్చిన
100 పర్సంటైల్స్
26
అందులో
7 నారాయణవే

సంపుటి 09, సంచిక: 142 | బుధవారం | 22-04-2026 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



# పేదల జేబు కత్తిరింపుకై ఐఎంఎఫ్ సలహాలు

ప్రపంచ దేశాల్లో సంపన్నులు – పేదల మధ్య అసమానతలు పెరిగిపోతుంటే, ప్రభుత్వాలు సంపద పన్ను ఎత్తివేస్తూ, కార్పొరేట్ పన్ను రేటు తగ్గిస్తూ కుబేరుల సంఖ్యను పెంచుతూ, చూడండి మా జిడిపి వృద్ధి, తలసరి ఆదాయం అని సంకలు చరుచుకుంటూ ఉంటే వారికి వంతపాడే 'అంతర్జాతీమ ద్రవ్యనిధి' భిన్నంగా ఆలోచిస్తుందా? భూగోళంలో ఏ దేశంలో లేదా ప్రాంతంలో ఆర్థిక సంక్షోభం తలెత్తుతుందా, బెయిలుఔట్ పథకాలతో ఆ దేశంలో శ్రమజీవుల ఆర్జనను మరింతగా దోచుకునే పొదుపు చర్యలను ప్రతిపాదించి సంపన్నులకు మేలు చేద్దామా అని ఆలోచించే ఐఎంఎఫ్ ఇటీవల భారతదేశానికి అధిక ఆదాయార్జన పరులకన్నా తక్కువ ఆదాయ కుటుంబాలపై మరిన్ని పన్నులు విధించాలంటూ అనేక తిరోగమన సిఫారసులు చేసింది. ప్రపంచ జనాభాలో అత్యంత ధనవంతులుగా ఉన్న 0.1శాతం మంది 'పన్నురహిత స్వర్గాలు'గా పిలవబడే దేశాల్లో దాచుకున్న అక్రమ (పన్ను చెల్లించని) సంపాదన ప్రపంచ మానవాళిలో సగంగా ఉన్న అత్యంత పేదల యావత్ సంపదను మించిపోగా, దాన్ని బయటకు తెచ్చి పేద ప్రజల ప్రయోజనం కోసం ఎలా వినియోగించాలో సలహాలిస్తే ఎవరైనా స్వాగతిస్తారు. పేద, వర్ధమాన దేవాలను దోపిడీ చేసి పశ్చిమ పెట్టుబడిదారుల బొక్కసాలు నింపటమే ప్రపంచ బ్యాంక్, ఐఎంఎఫ్ సంస్థాపిత ధ్యేయంగా ఉన్నందున అవి పశ్చిమ దేశాల ఉపాంగాలుగా అప్రతిష్ఠ మూటగట్టుకున్నాయి. అటువంటి సంస్థల నుంచి సామాన్యుల అభివృద్ధికి దోహదం చేసే సిఫారసులు ఆశించగలమా? ఏప్రిల్ 13–18 తేదీల్లో వాషింగ్టన్ డిసిలో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వసంతకాల సమావేశాలకు ముందు ఏప్రిల్ 2న ఆక్స్‌ఫాం విడుదల చేసిన రెండు నివేదికలు ఐఎంఎఫ్ సిఫారసులు విశ్లేషించాయి. ఇది ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుస్ (ఐసిఐజె) అధికారికంగా విడుదల చేసి, ప్రచురించిన 'పనామా పేపర్స్' (ఏప్రిల్ 3,2016) 10వ వార్షికోత్సవ సందర్భం కూడా. పన్ను ఎగవేతకు, ధనం అక్రమ చేరవేత (మనీలాండరింగ్)కు ఉపయోగించబడిన ఆఫ్‌షోర్ కంపెనీల గ్లోబల్ నెట్‌వర్క్‌ను ఆ పేపర్లు వెల్లడి చేశాయి. ఇప్పుడు, దశాబ్దం తర్వాత కూడా మహా కుబేరులు పన్నుల ఎగవేత, ఆస్తులు దాచుకోవటం కోసం ఆఫ్‌షోర్ వ్యవస్థలను ఉపయోగించటం కొనసాగిస్తూనే ఉన్నారని ఆక్స్‌ఫామ్ విశ్లేషణ వెల్లడించింది. అపరిమిత సంపదపై పన్ను విధింపు, పన్నురహిత స్వర్గాలను అంతం చేయటం కోసం సమన్వయీకృత అంతర్జాతీయ చర్యను అది వక్కాణించింది. 2024లో 3.35 ట్రిలియన్ డాలర్లు పన్ను చెల్లించని సంపదను పన్ను రహిత స్వర్గాలో, లెక్కకు చూపని ఖాతాల్లో దాచినట్టు అది అంచనా వేసింది. ఈ దాచిన సొమ్ము ప్రపంచంలో కనీస అభివృద్ధి చెందిన 44 దేశాల సమష్టి జిడిపికి రెండు రెట్లు పైగా ఉంటుంది. ప్రపంచంలో మహా సంపన్నులైన 0.1 శాతం మంది, విదేశా ల్లో దాచిన మొత్తం అక్రమార్జనలో దాదాపు 80 శాతం కలిగి ఉన్నారు. అది సుమారు 2.84 ట్రిలియన్ డాలర్లు. ఈ అతిచిన్న గ్రూపులో అత్యంత కుబేరులైన 0.01 శాతం మంది సంపద 1.77 ట్రిలియన్ డాలర్లు. ఇంత భారీగా సంపదను దొంగచాటుగా దాచిపెడుతున్నారంటే అది సమాజాలకు ఎనలేని చేటు చేస్తున్నది 'మన ఆసుపత్రులు, స్కూళ్లు నిధుల కోసం అలమటిస్తున్నాయి. పెరుగుతున్న అసమానతలతో మన సమాజం జీవచ్ఛవమవుతున్నది. కొద్దిమందిని కుబేరులను చేయటానికి సామాన్య ప్రజలు ఈ భారాన్ని మోయాల్సివస్తోంది. అన్నారు ఆక్స్‌ఫాం ఇంటర్నేషనల్‌కు చెందిన టాక్స్‌హెడ్ క్రిష్టియన్ హలూ. పన్ను చెల్లించని ఆఫ్‌షోర్ సంపద క్రమంగా తగ్గుతున్నప్పటికీ, అది ప్రపంచ జిడిపిలో దాదాపు 3.2 శాతంగా చాలా హెచ్చుగా ఉంది. ఆక్స్‌ఫాం రెండవ విశ్లేషణ 2022–2024 మధ్య 125 దేశాలకు ఐఎంఎఫ్ ఇచ్చిన పన్ను సలహాలు. అది చేసిన వెయ్యికిపైగా సిఫారసుల్లో 3శాతం మాత్రమే సంపదపై పన్ను, సంపద నుంచి ఆదాయంపై కేంద్రీకరించాయి. దాని పన్ను సలహాలు అధిక ఆదాయ దేశాలకు వృద్ధిక్రమానుగతంగా , తక్కువ మధ్యస్థాయి ఆదాయ దేశాలకు తిరోగమనంగా ఉంటాయి. భారత్‌కు అత్యధిక సంఖ్యలో తిరోగమన సిఫారసులు చేసింది. అవి సహజంగా అధిక ఆదాయార్జనపరుల కన్నా తక్కువ ఆదాయపరులపై భారం మోపేవిగా ఉంటాయి. అధికంగా వ్యాట్ లేదా వినిమయ పన్నులు, పన్ను మినహాయింపుల కోత, సమాన పంపిణీ కన్నా రెవెన్యూ కలెక్షన్‌కు ప్రాధాన్యత ఇవ్వటంగా ఉంటాయి. 'గత 25 సంవత్సరాల్లో అతి సంపన్నులైన 1శా తం, అతి పేదలుగా ఉన్న 50శాతం మధ్య అగాధం ఐఎంఎఫ్ సలహాలు పొందిన తక్కువ, మధ్య స్థాయి ఆదాయ దేశాల్లో రెట్టింపు అయింది' ఇదీ ఆక్స్‌ఫాం విశ్లేషణ. అందువల్ల ప్రభుత్వాలు వాస్తవాలు గ్రహించాలి. ప్రజల అభివృద్ధికై సంపన్నులపై అధిక పన్నులు విధించాలి. కానీ మోదీ ప్రభుత్వం తద్భిన్నంగా సంపదపన్ను రద్దు చేసింది, కార్పొరేట్ పన్నురేటు తగ్గించింది.



## బిజెపి తీవ్ర చర్యలకు పాల్పడొచ్చు

ఓటమి భయంతో బిజెపి తీవ్రమైన చర్యలకు కూడా పాల్పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఆ పార్టీ ఓటమి దిశగా పయనిస్తున్నప్పుడు, అది ఏదైనా చేయగలదు. ఇప్పుడు అది ఓటమి వైపు వెళ్తోంది, ఒక్కసారి అధికారం కోల్పోతే, మళ్ళీ ఎప్పటికీ తిరిగి రాకపోవచ్చు. ఆ భయమే వారిని ఎక్కువగా వేధిస్తోంది.

- సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్



## భూమికి ఊపిరాడటం లేదు

మానవ చరిత్రలో మనం అత్యంత సంపన్నమైన కాలంలో ఉన్నామని సంబరపడుతున్నాం. కానీ, అదే సమయంలో మనం అత్యంత ప్రమాదకరమైన శిథిలాల మీద నిలబడి ఉన్నామన్న నిజాన్ని విస్మరిస్తున్నాం. ఏప్రిల్ 22 ధరిత్రి దినోత్సవం. ఇది కేవలం పచ్చని చెట్ల ఫోటోలు షేర్ చేయడానికో, ఉపన్యాసాలు దంచడానికో పరిమితం కాకూడదు. పకృతిపై మనం సాగిస్తున్న 'నిశ్శబ్ద యుద్ధం' గురించి ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన సమయమిది. నిన్నటి వరకు మనం ప్రకృతిని 'వనరు'గా మాత్రమే చూశాం. కానీ నేడు అది 'బాధితురాలు'గా మారిపోయింది. అడవుల నరికివేత, అపరిమితమైన మైనింగ్, పారిశ్రామిక వ్యర్థాల విషకౌగిలిలో భూమి ఊపిరి సలపక విలవిలలాడుతోంది. సిమెంట్ అడవుల కోసం పచ్చని ప్రాణవాయువుని ఇచ్చే అడవులను బలిపీఠం ఎక్కిస్తున్నాం. కొండలను పిండి చేసి, భూమి గర్భాన్ని తోడేసి మనం నిర్మిస్తున్న భవంతులు.. ప్రకృతి ప్రళయాల ముందు పేకమేడలని ఉత్తరాఖండ్ నుండి నేటి అకాల వర్షాల వరకు నిరూపిస్తూనే ఉన్నాయి. ప్రస్తుత సమాజం 'వాడి పారేసే' సంస్కృతికి బానిస అయింది. మనం వాడి పారేస్తున్న ప్లాస్టిక్ భూమి పొరల్లోకి చొచ్చుకుపోయి, నేలతల్లి సారాన్ని హరిస్తోంది. సముద్ర గర్భంలో తిమింగలాల కడుపులో ప్లాస్టిక్ వ్యర్థాలు దొరుకుతున్నాయంటే, మన విధ్వంసం ఎంత లోతుగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్లాస్టిక్ రహిత భూమి వైపు అడుగులు వేయడం ఇప్పుడు మనకు ఇష్టం కాదు, అది మన మనుగడకు సంబంధించిన 'అవసరం' అనేది గుర్తించాలి. గ్లోబల్ వార్మింగ్ అనేది ఇప్పుడు కేవలం పుస్తకాల్లోని పదం కాదు. అడవుల్లో కార్చిచ్చు, ఎడారిలా మారుతున్న సాగు భూములు, కరిగిపోతున్న హిమానీనదాలు మన కళ్ల ముందే ఉన్నాయి. ఉష్ణోగ్రతలు ఒక్క డిగ్రీ పెరిగినా, కోట్లాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదం ఉంది. ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే, ఆ ప్రకృతి తిరగబడితే ఏ మానవ సాంకేతికత కూడా మనల్ని కాపాడలేదు అనేది సత్యం. అందుకే మనం భూమిని కాపాడటం అంటే భూమికి ఉపకారం చేయడం కాదు, మనల్ని మనం కాపాడుకోవడం. ప్రతి ఇంటిలో వాన నీటి సంరక్షణ, రసాయన ఎరువుల వాడకం తగ్గించడం, శిలాజ ఇంధనాల (పెట్రోల్, డీజిల్)పై ఆధారపడటం తగ్గించి సౌర శక్తి వైపు మళ్లడం వంటివి తక్షణమే జరగాలి. పర్యావరణ స్పృహ అనేది పాఠశాల సిలబస్‌లో మాత్రమే కాదు, ప్రతి వ్యక్తి జీవనశైలిలో భాగం కావాలి. భూమి మనకు సర్వస్వాన్ని ఇస్తోంది. ప్రతిగా మనం ఇస్తున్నది కాలుష్యాన్ని, విధ్వంసాన్ని మాత్రమే. మన ముందున్నది తక్కువ సమయం. ఈ ధరిత్రి దినోత్సవం రోజున ప్రకృతిని రక్షించుకుంటామని చేసే ప్రతిజ్ఞ, ఆచరణలోకి మారాలి. లేదంటే, రాబోయే తరాలకు మనం ఇచ్చే వారసత్వం.. ఎండిపోయిన నదులు, విషతుల్యమైన గాలి, నిస్సారమైన భూమి మాత్రమే అవుతుంది. ప్రకృతిని ప్రేమిద్దాం.. భూమిని రక్షించుకుందాం..!

– కస్తూరి
ప్రతినిధి – సహజ వనరుల పరిరక్షణ వేదిక

# మహిళలే బెంగాల్ ఎన్నికల 'కింగ్ మేకర్‌లు'!

గత దశాబ్ద కాలంగా పశ్చిమ బెంగాల్ మహిళా ఓటర్లు ఒక బలమైన శక్తిగా ఆవిర్భవించారు. వారి నిర్ణయాలే ప్రభుత్వాల భవిష్యత్తును ఎక్కువగా నిర్ధారిస్తున్నాయి. గత 15 ఏళ్లుగా రాష్ట్రంలో తన ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న తృణమూల్ కాంగ్రెస్, ఎన్నికల బరిలో అత్యధిక సంఖ్యలో మహిళా అభ్యర్థులను నిలబెట్టింది. గత శాసనసభలో టిఎంసి తరపున మొత్తం 41 మంది మహిళా శాసనసభ్యులు ప్రాతినిధ్యం వహించారు. ఫైర్ బ్రాండ్ మమతా బెనర్జీ నేతృత్వంలోని ఈ రాజకీయ పార్టీ దేశవ్యాప్తంగా ఉన్న ఇతర రాజకీయ పార్టీల కంటే ఎక్కువ మంది మహిళలను బరిలోకి దింపింది. ఇది శాసనసభ సంఖ్యాబలంలో 13.94 శాతం. ఇది రాష్ట్ర శాసనసభలలో జాతీయ సగటు అయిన 8 శాతం కంటే చాలా ఎక్కువ. టిఎంసి పుణ్యమా అని, మహిళా ఓటర్లు ఎన్నికల ప్రక్రియలో కేవలం సహాయక పాత్ర పోషించడం లేదు. రెండు విడతలుగా ఏప్రిల్ 23,29 తేదీలలో ఎన్నికలు జరగనున్న పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల సంఘం గణాంకాల ప్రకారం 3,76,00,611 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. రాబోయే ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులందరూ రాజకీయ పవనాలను తమకు అనుకూలం గా మార్చుకోవడానికి ఈ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటారు.

### టిఎంసికి అండగా 'లక్ష్మీర్ భండర్'

టిఎంసి ప్రభుత్వ ప్రతిష్టాత్మక సామాజిక సంక్షేమ పథకం 'లక్ష్మీర్ భండర్', రాజకీయ విధేయతలను, భౌతిక వాస్తవాలను మార్చివేసింది. 2021లో ప్రారంభించబడిన ఈ పథకంలో 2.2 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. దీనికి కేటాయించిన రూ.10 వేల కోట్లు ఎన్నికలలో టిఎంసికి గొప్ప రాజకీయ ప్రయోజనాలను చేకూర్చడమే కాకుండా, ప్రతిపక్షాల ప్రాబల్యం తగ్గడానికి కూడా దోహదపడింది. లక్ష్మీర్ భండర్ కేవలం ఒక ఆర్థిక జోక్యం మాత్రమే కాదు. ఇది ఒక సామాజిక–రాజకీయ పునర్వ్యవస్థీకరణ. ఈ పథకం లబ్ధిదారులు వారి లింగం కారణంగా లబ్ధి పొందేలా చేసింది. దీని ఫలితంగా, బ్యాలెట్ పత్రం మహిళా ఓటర్లకు ఆత్మస్థైర్యాన్ని చాటుకునే సాధనంగా మారింది. సంఖ్యలే వాస్తవాన్ని తెలియజేస్తున్నాయి. 2026 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో టిఎంసి 52 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దింపగా, వామపక్షాలు 34 మంది మహిళా అభ్యర్థులను నిలబెట్టాయి. కాగా, కాంగ్రెస్, బిజెపిల తరపున వరుసగా 35, 33 మంది మహిళా ప్రతినిధులు ఉన్నారు. పెద్ద సంఖ్యలో మహిళా ఓటర్ల పేర్లను తొలగించడంపై టిఎంసి గళం విప్పడంలో ఆశ్చర్యం లేదు. మహిళా ఓటర్ల పేర్లను తొలగించడం తమ పార్టీ ఓటు బ్యాంకుకు గండి కొట్టడానికేనని రాష్ట్ర టిఎంసి మహిళా విభాగం నేతృత్వం వహిస్తున్న చంద్రమా భట్టాచార్య అన్నారు. కానీ, రాష్ట్రంలో మహిళల కోసం ఉన్న సామాజిక సంక్షేమ పథకాలు టిఎంసికి అనుకూలంగా మహిళల ఓట్లు మారడానికి ప్రధాన కారణం కాదు. పశ్చిమ బెంగాల్ మహిళా ఓటర్లు తమ పరిణతి చెందిన రాజకీయ విచక్షణతో ఎప్పటినుంచో ప్రత్యేకంగా నిలుస్తున్నారు. వారి నిర్ణయాలు కుటుంబ చర్చలలో, సామాజిక మాధ్యమాలలో, చివరకు పోలింగ్ బూత్‌లలోనూ వ్యక్తమవుతాయి. ప్రభుత్వానికి, మహిళా పౌరులకు మధ్య మారుతున్న అవగాహనతో రూపుదిద్దుకున్న ఈ నిర్ణయాలు గాఢంగా రాజకీయమైనవి. కానీ మహిళా ఓటర్ల మద్దతును తేలికగా తీసుకోలేము. అది ఏకరీతిగా గానీ, ఊహించదగినదిగా గానీ ఉండదు. లక్ష్మీర్ భండర్, కన్యాశ్రీ, రూపశ్రీ వంటి మహిళా కేంద్రీకృత సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా ఉండటం మహిళలకు ఓట్లను హామీ ఇవ్వదు. అవి టిఎంసి రాజకీయ రంగంలో మహిళల ఉనికి గౌరవప్రదమైనదిగా ఉండేలా చూస్తాయి. మహిళా ఓటర్లలో అధిక వాటాను దక్కించుకోవడానికి, ఎన్నికల ప్రచారంలో ఒక సూక్ష్మమైన, ముఖ్యమైన మార్పు చోటుచేసుకుం



ది. కోల్‌కతాలోని మహిళా ఓటర్ల ప్రాధాన్యతలు గ్రామీణ ప్రాంతాల్లోని వారి ప్రాధాన్యతలకు భిన్నంగా ఉంటాయనే వాస్తవాన్ని ప్రచార నిర్వాహకులు విస్మరించకూడదు. ఈ వైవిధ్యం మహిళల సమస్యలపై మరింత సూక్ష్మమైన అవగాహనను కోరుతుంది. మహిళా ఓటర్ల సమూహం భిన్నమైనది, కాబట్టి అభ్యర్థి ఆయన /ఆమె ఎన్నికల నిర్వాహకులు తమ ప్రచారాన్ని ప్రారంభించే ముందు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి. మహిళా ఓటర్లు, లేదా మరింత స్పష్టంగా చెప్పాలంటే వారిలో చాలామంది 'నిశ్శబ్ద కింగ్ మేకర్‌లు'. కొద్దిమంది తప్ప, వారు రాజకీయ రంగంలోని అత్యంత శక్తివంతమైన వేదిక నుండి మాట్లాడరు. వారి గొంతు బహుశా అంతగా వినిపించకపోవచ్చు. కానీ వాస్తవం ఏమిటంటే, చాలా మంది మహిళా ఓటర్లు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీతోనే మమేకమవుతారు.

### వ్యూహం మార్చిన బిజెపి

ఇక పశ్చిమబెంగాల్‌లో అధికారం కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్న పార్టీ బిజెపి. దాని సైద్ధాంతిక మాతృ సంస్థ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పశ్చిమ బెంగాల్ శాసనసభ ఎన్నికలలో బిజెపికి సహాయపడటానికి గణనీయమైన పాత్ర పోషిస్తున్నప్పటికీ, అది పెద్దగా ప్రభావం చూపే సూచనలు లేవు. ఆ పార్టీ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్వస్థలమైనప్పటికీ పశ్చిమ బెంగాల్ శాసనసభలో ఆ పార్టీకి మెజారిటీ దక్కలేదు. 2021 అసెంబ్లీ ఎన్నికలలో కూడా తమ లక్ష్యాన్ని సాధించడానికి అది తీవ్రంగా ప్రయత్నించింది. కానీ 294 మంది సభ్యులున్న సభలో 77 సీట్లతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. అధికార తృణమూల్ కాంగ్రెస్ నుండి ఫిరాయించిన వారికి మితిమీరిన అవకాశాలు కల్పించడం, పశ్చిమ బెంగాల్‌లో శాసనసభ, లోక్‌సభ ఎన్నికలలోని సంక్లిష్టతలను గ్రహించడంలో విఫలమవడం వంటివి కీలక కారణాలుగా తరువాత గుర్తించారు. జరుగుతున్న వ్యవహారాల పట్ల భావజాల మాతృసంస్థ సంతోషంగా లేదు, అందుకే తన కార్యకర్తలు, అనుబంధ సంస్థల ద్వారా అందించే ఉత్సాహభరితమైన, వ్యూహాత్మక మద్దతు నుండి వెనుకాడింది. ఈసారి పరిస్థితి భిన్నంగా ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు మొదటి దశ కోసం మూడు వారాల క్రితమే ఓటర్లతో సంప్రదింపులు ప్రారంభించారు. ఏప్రిల్ 29న పోలింగ్ జరగనున్న రెండో దశ నియోజకవర్గాలకు వారం రోజుల క్రితమే తరలివెళ్లారు. ఈసారి అనుసరిస్తున్న వ్యూహం 2021 ఎన్నికల పోరులో బిజెపి అనుసరించిన వ్యూహానికి భిన్నంగా ఉంది. అప్పుడు ముస్లిం జనాభా అధికంగా ఉన్న ముర్షిదాబాద్ ,మాల్డా జిల్లాల్లో దాదాపు అరడజను మంది ముస్లిం అభ్యర్థులను నిలబెట్టింది. ఈ సారి ఏ ముస్లిం అభ్యర్థినీ బరిలోకి దించకూడదని ముందుగానే నిర్ణయించారు. అంతేకాకుండా, అప్పుడు దాదాపు 100 మంది ఫిరాయించిన వారికి టిక్కెట్లు ఇచ్చారు. ఈసారి నిజమైన బిజెపి కార్యకర్తలను బరిలోకి దించారు. అదే సమయంలో, పార్టీ కార్యకలాపాలకు అసంతృప్తితో దూరంగా ఉంటున్న సీనియర్లు తిరిగి ఎన్నికల పనిలో నిమగ్నమయ్యారు. వారిలో గణనీయమైన సంఖ్యలో బరిలో కూడా ఉన్నారు. మాజీ లోక్‌సభ సభ్యుడు, రాష్ట్ర అధ్యక్షుడు, నిర్మొహమాటంగా మాట్లాడే పార్టీ సీనియర్ దిలీప్ ఘోష్ ఇందుకు ఒక ఉదాహరణ. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత మిథున్ చక్రవర్తి క్రియాశీల ప్రచారకర్తగా ఉన్నారు. సరైన పరిశీలన తర్వాత, కేవలం కొద్దిమంది పార్టీ ఫిరాయించిన వారికి మాత్రమే అవకాశం కల్పించారు.బిజెపి ఈ సారి ఎన్నికల్లో ఘుస్‌పైటియా (చొరబాటుదారుల) అంశాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తోంది. అలాగే సర్ భారీగానే ప్రభావం చూపిస్తుంది. స్వదేశీ జాగరణ్ మంచ్ (ఆర్‌ఎస్‌ఎస్ అనుబంధ సంస్థ)తో సన్నిహిత సంబంధాలున్న వర్గాలతో జరిపిన సంభాషణల ప్రకారం, టిఎంసి, బిజెపిలు మధ్య హోరాహోరీ పోరు జరగబోతున్నట్లు తెలుస్తోంది. 2021లో సాధించిన 77 సీట్ల సంఖ్యను (ఫిరాయింపుల తర్వాత ప్రస్తుతం ఆ సంఖ్య సుమారు 65) బిజెపి మెరుగుపరుచుకుంటుందని వారు ధీమాగా ఉన్నట్లు కనిపిస్తోంది. ప్రజల కోసం పార్టీ సీనియర్ నాయకులు సీట్ల సంఖ్య 170కి చేరుకుంటుందని చెబుతుంటారు. కానీ, వారి అంతర్గత మదింపు, 'అంచనాలకు కొంత ఊతం ఇచ్చి చూస్తే', పార్టీకి సుమారు 130 సీట్లు వచ్చే అవకాశం ఉందని సూచిస్తోంది.

### వామపక్షాలు మెరుగవుతాయి

ఆసక్తికరంగా, ఒక్క సీటు కూడా గెలుచుకోలేని వామపక్షాలు, కాంగ్రెస్లకు ఈ ఎన్నికల్లో కొన్ని సీట్లు వస్తాయని వారు అంగీకరిస్తున్నారు. వారు కాంగ్రెస్ కంటే వామపక్షాల పట్ల ఎక్కువ విశ్వాసంతో కనిపించారు. ముర్షిదాబాద్ జిల్లాలోని బెర్హంపూర్ నుండి అధిర్ చౌదరి, మాల్డా జిల్లాలోని మాలతిపూర్ నుండి మౌసమ్ బెనజీర్ నూర్ పోటీ చేస్తున్నారని గుర్తు చేసినప్పుడు, వారి గెలుపు అవకాశాలు బలంగా ఉన్నాయని, ఆ రెండు జిల్లాల్లో మరికొన్ని విజయాలు సాధించడంలో వారు కీలక పాత్ర పోషించగలరని అంగీకరించారు. వామపక్షాలు కూడా కొంత మేరకు తమను తాము చక్కదిద్దుకోవడంలో విజయం సాధించాయని వారు గమనించారు. సిపిఐ(ఎం) గెలుపు అవకాశాలున్న పలువురు ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను బరిలోకి దింపింది.

– (ఐపిఎ సర్వీస్)

## తల్లిదండ్రుల పట్ల అనాదరణ

# చట్టం ఉన్నా.. మానవత్వం ఎక్కడ?

పిల్లలను కని, వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడానికి జీవితం మొత్తం సర్వ శక్తులు ధారపోసిన తల్లిదండ్రులు వారి చరమాంకంలో ఆ పిల్లల చేతుల్లోనే నిరాదర ణ, వేధింపులకు గురవుతున్నారంటే ఇది కేవలం ఒక సమ స్య కాదు – మానవత్వానికి ఒక భారీ ప్రశ్నార్థకం. ఉమ్మడి జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో నిత్యం జరుగుతున్న హృదయవిదారక ఘటనలు ఎవరి హృదయాన్నైనా కదిలిస్తాయి. కన్న కొడుకు తల్లిని చంపేసిన సంఘటనలు, ఆస్తుల కోసం ఇంటి నుంచి గెంటేసిన దారుణాలు, నిరాశతో సజీవ దహనం చేసుకున్న వృద్ధురాలు, బావుల్లో దూకిన తండ్రులు ఇవి వార్తలు కాదు, మన సమాజం ఎం త దిగజారిందో చెప్పే హృదయ వేదనలు. తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జగిత్యా ల జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ నేతృత్వంలో జరిపిన సర్వే ఈ వాస్తవాన్ని భయంకరంగా బయటపెట్టింది. వృద్ధులపై వేధింపుల్లో 35 శాతం ఆస్తుల కోసం, 30 శాతం పోషణ కోసం, 25 శాతం వైద్య చికిత్సల కోసం, 10 శా తం ఇతర కారణాల వల్ల జరుగుతున్నట్లు తేలింది. గత ఏ డాది ఒక్కటే జగిత్యాల జిల్లాలో 66 ఫిర్యాదులు, సిరిసిల్ల లో 36, కరీంనగర్‌లో 48, పెద్దపల్లిలో 32 ఫిర్యాదులు న మోదయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 94 కేసులు పరిష్కారమైనా, 88 కేసులు ఇంకా విచారణ దశలోనే ఉన్నా యి. 2007 వృద్ధుల సంక్షేమ చట్టం ఉన్నా, అమలు లోపా ల వల్ల వృద్ధులు ఇప్పటికీ ఆశ్రయం కోసం అసోసియేషన్ వైపు చూస్తున్నారు. హరి అశోక్ కుమార్ నేతృత్వంలో కౌన్సిలింగ్, ఆర్‌డిఒలకు ఫిర్యాదులు, పోలీసు సహాయం – ఇలా అన్ని విధాలా ప్రయత్నాలు జరుగుతున్నా, సమస్య ఆగడం లేదు. ఒక వృద్ధురాలు తన మంచాన్నే చితిగా భావించి సజీవ దహనం చేసుకోవడం, మరొకరు పెన్షన్ డబ్బు ఇవ్వడం లేదని కొడుకు చేతిలో చనిపోవడం – ఇలాంటి ఉదంతాలు మన మనసులను కలచివేస్తాయి. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేసిన చ ట్టం ఒక కాంతి కిరణంలా కనిపిస్తోంది. జనవరి 2026లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన వృద్ధుల డే కేర్ సెంటర్లతో పాటు, అసెంబ్లీలో ఆమోదం పొందిన 'తెలంగాణ ఉద్యోగుల తల్లిదండ్రుల పోషణ, జవాబు దారీతనం, పర్యవేక్షణ చట్టం2026' ఇప్పుడు చర్చనీయాంశం. ఈ చట్టం ప్రకారం.. ప్రభుత్వ ఉద్యోగు లు, పెన్షనర్లు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ రాజ్, ము న్సిపల్ ఉద్యోగులు తమ తల్లిదండ్రులను పట్టించుకోకపోతే వారి వేతనం నుంచి గరిష్ఠంగా రూ.10,000 వరకు కోత విధించి, నేరుగా తల్లితండ్రి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు.



**జిల్లా కలెక్టర్ లేదా మేజిస్ట్రేట్‌కు దరఖాస్తు చేస్తే 60 రోజుల్లో పరిష్కారం.**

వయోవృద్ధుల కమిషన్ ఏర్పాటు చేసి, హైకోర్టు మాజీ న్యాయమూర్తి స్థాయి అధికారిని కమిషనర్‌గా నియమించనున్నారు. ఇది కేవలం ఒక చట్టం కాదు – ప్రభుత్వం తన ఉద్యోగుల నుంచి కూడా కుటుంబ బాధ్యతలను గుర్తు చేసే ఒక ధైర్యవంతమైన అడుగు. అయితే హరి అశోక్ కుమార్ చెప్పినట్లు చట్టం చుట్టం కావాలి. కాగితం మీది మాటలు కాకుండా, రంగంలోకి దిగి అమలు చేయాలి. సెక్షన్ 21 (2) (5) ప్రకారం ఫిర్యాదులు వచ్చిన వెంటనే పోలీసులు చర్యలు తీసుకోవాలి. శిక్షలు, జరిమానాలు కఠినంగా ఉండాలి. తల్లిదండ్రులు మనకు జీవితం ఇచ్చారు. వారిని ఆదరించడం కేవలం చట్టపరమైన బాధ్యత కాదు – అది మన మానవత్వం. ప్రభుత్వం చట్టం తెచ్చింది. ఇక మనం ప్రతి ఒక్కరం హృదయం తెరిచి, నా తల్లితండ్రి ఎక్కడ? అని అడగాలి. అప్పుడే ఈ సమాజం నిజమైన మానవత్వాన్ని ప్రతిబింబిస్తుంది. చట్టం ఉన్నా వేధింపులు ఆగాలి. మనుషులు మనుషులుగా మారాలి.

– కాలగిరి శ్రీనివాస్ రెడ్డి
9010128884

## పత్తిపాక క్రషర్‌ను ఎందుకు

# మూసివేయకూడదు?

ప్రకృతి వనరులు మానవాళికి జీవనాధారాలు. కానీ, హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. అభివృద్ధి పేరిట గత దశాబ్దన్నర కిందట వెలసిన శ్రీ వెంకటేశ్వర స్టోన్ క్రషర్ యూనిట్ గ్రామంపై పగబట్టినట్లుగా పరిస్థితి మారింది. లాభార్జనే ధ్యేయంగా సాగుతున్న తవ్వకాలు, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న బ్లాస్టింగ్ పనులు పత్తిపాక ఉనికిని, అక్కడి పర్యావరణాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నది. దీనికి తోడు మరో గుట్టకు నూతనంగా మరో క్రషర్ పెట్టడానికి సన్నాహాలు చేయటం 'మూలిగే నక్కపై తాటికాయ పడటమే' అవుతోంది. గ్రామ శివారులో ఉన్న గుట్టలు ఒకప్పుడు ఆ ప్రాంతానికి రక్షణ కవచాలుగా ఉండేవి. కానీ, నేడు క్రషర్ల దౌర్జన్యం వల్ల ఈ గుట్టలు క్రమంగా కరిగిపోతున్నాయి. నిరంతరం జరుగుతున్న భారీ పేలుళ్ల కారణంగా గుట్టలు ధ్వంసమవుతున్నాయి. ఈ గుట్టల తొలగింపు వల్ల కేవలం ప్రకృతి అందం దెబ్బతినడమే కాకుండా, భూగర్భ జలమట్టం దారుణంగా పడిపోతోంది. ఇది భవిష్యత్తులో తీవ్ర నీటి ఎద్దడికి దారితీస్తుందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నప్పటి ఇక్కడ మాత్రం ఆ హెచ్చరికలు పట్టించుకునే నాథుడే లేడు.ఇక పత్తిపాక రైతాంగం నేడు ఆ క్రషర్ వల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. క్రషర్ యూనిట్, డాంబర్ ప్లాంట్ నుంచి వెలువడే విపరీతమైన దుమ్ము, సూక్ష్మ రసాయన కణాలు గాలిలో కలిసి పొరుగున ఉన్న పంట పొలాలపై పేరుకుపోతున్నాయి. దీనివల్ల మొక్కల ఆకులపై దుమ్ము చేరి కిరణజన్య సంయోగక్రియకు ఆటంకం కలుగుతోంది. పంటల పెరుగుదల ఆగిపోయి, దిగుబడి గణనీయంగా తగ్గుతోంది. నాణ్యత లేని దిగుబడి వల్ల మార్కెట్‌లో రైతులకు సరైన ధర లభించడం లేదు. రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని చెరువులు క్రషర్ వ్యర్థాలకు నిలయాలుగా మారుతున్నాయి. యూనిట్ల నుంచి వచ్చే మట్టి, రాతి పొడి వర్షపు నీటితో కలిసి చెరువు, కుంటలలో చేరుతుండటంతో నీరు విషతుల్యమవుతోంది. దీనివల్ల జల జీవవ్యవస్థ దెబ్బతిని, చేపలు తదితర జీవరాశులు మృత్యువాత పడుతున్నాయి. నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో సాగునీటి సరఫరాకు ఆటంకం ఏర్పడుతోంది. ఈ సమస్య కేవలం పత్తిపాకకే పరిమితం కాలేదు. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో స్టోన్ క్రషర్ల కారణంగా రోడ్లు ధ్వంసమవుతున్నాయి, ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలోనే గ్రామస్థులు, బాధితులు ఏకమై తమ గళాన్ని వినిపిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవకపోవటం సరైనది కాదు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న స్టోన్ క్రషర్లపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. గుట్టల మనుగడను కాపాడటానికి భారీ పేలుళ్లను నిలిపివేయాలి. కలుషితమైన చెరువులను ప్రక్షాళన చేసి, వ్యర్థాలు చేరకుండా రక్షణ చర్యలు చేపట్టాలి. ప్రతి యూనిట్‌లో దుమ్ము నివారణకు శాస్త్రీయ పరికరాలను ఏర్పాటు చేయాలి. పత్తిపాక ప్రజల అభిప్రాయాలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్టోన్ క్రషర్, డాంబర్ ప్లాంట్ ను ఎందుకు మూసివేయకూడదో అధికారులు సమాధానం చెప్పాలి. పత్తిపాక ప్రజల ఆవేదనను ఆలకించి, అక్కడి గుట్టలు, చెరువులను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. లేనిపక్షంలో భవిష్యత్ తరాలకు మనం కేవలం కాలుష్యాన్ని, ఎడారిని మాత్రమే మిగిల్చిన వారమవుతామనేది గుర్తించాలి.

లేఖ

– పల్లెబోయిన సుధాకర్
99492 79802




www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 142 | బుధవారం | 22-04-2026 | మహబూబ్‌నగర్ Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## బదిలీలపై నిషేధం ఎత్తివేత

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ బదిలీలపై ఉన్న నిషేధాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేసింది. మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నాటికి మూడేళ్లు ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. బదిలీల ప్రక్రియ పూర్తికాగానే జూన్ 1వ తేదీ నుంచి సాధారణ బదిలీలపై మళ్లీ నిషేధం అమలులోకి రానుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉద్యోగ సంఘాలతో చర్చించి, ఖాళీలు, కచ్చితంగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల వివరాలను వెల్లడించనున్నారు. మే 8 నుంచి 15 వరకు ఉద్యోగుల నుంచి ఆప్షన్‌లను స్వీకరిస్తారు. ఉద్యోగి గరిష్టంగా 5 ప్రాంతాలను ఆప్షన్లుగా ఎంచుకునే తరువాయి 6లో

# బస్సులు బంద్



**ఐఎఎస్ అధికారుల కమిటీతో ఆర్‌టిసి జెఎసి నేతల చర్చలు విఫలం**
**మంగళవారం అర్ధరాత్రి నుంచి సమ్మె**

- ప్రభుత్వానికి నాలుగువారాల గడువు ఇవ్వాలని కోరిన కమిటీ
- సమ్మె విరమించాలని విజ్ఞప్తి
- చర్చలు కొలిక్కిరాకపోవడంతో సమ్మెకు వెళ్లిన ఆర్‌టిసి సంఘాలు
- 32 డిమాండ్లు పరిష్కారమయ్యేవరకు సమ్మె చేస్తాం
- ఆర్‌టిసి జెఎసి చైర్మన్ వెంకన్న
- మా డిమాండ్లు కొత్తవేమీ కాదు.. గతంలో ఇచ్చినవే
- తప్పని పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నామని ప్రకటన

ప్రజాపక్షం/హైదరాబాద్



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్ ఆర్‌టిసి) ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతోనే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మెకి వెళ్తున్నట్లు ఆర్‌టిసి జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న స్పష్టం చేశారు. బుధవారం ఉదయం మొదటి డ్యూటీ నుంచే బస్సులు డిపోలకే పరిమితం అవుతాయని తెలిపారు. సమ్మెకు వెళ్తే ప్రజాగ్రహం చవిచూడాల్సి వస్తుందనే భయంతో హుటాహుటిన ఒక ఉన్నత స్థాయి అధికారుల కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ అది కేవలం కాలయాపన చేసే చర్యేనని జెఎసి నేతలు విమర్శించారు. సమస్యల పరిష్కారానికి కమిటీ 4 వారాల సమయం కోరింది. కానీ, జెఎసి నాయకులు అంగీకరించలేదు. ప్రభుత్వంతో చర్చలు విఫలమైనందున పక్కా హామీ లభించే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదని జెఎసి నేతలు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ సమ్మె నోటీసు ఇచ్చిన 41 రోజుల తర్వాత మాత్రమే ప్రభుత్వం చర్చలకు పిలిచిందని, తమ సమస్యలను ప్రభుత్వానికి వివరించినప్పటికీ, చర్చల ప్రక్రియలో పురోగతి లేకపోయిందని పేర్కొన్నారు. తమ డిమాండ్లు అన్నీ పాతవే అని స్పష్టం చేసిన కార్మికులు, ఐఎఎస్ అధికారుల కమిటీ వేసి చర్చలు జరపడం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మిక సంఘాల ఎన్నికలు నిర్వహించడం, బస్సులను పూర్తిగా ఆర్‌టిసి ద్వారానే నడపడం తమ ప్రధాన డిమాండ్లుగా తరువాయి 6లో



## బాణసంచా తయారీ యూనిట్‌లో పేలుడు

**13 మంది మృతి**

పలువురికి గాయాలు

కేరళలోని ముండతికోడ్ జిల్లాలో ఘటన

**త్రిస్సూర్ :** కేరళలో విషాధ ఘటన జరిగింది. ముండతిక్కోడ జిల్లాలోని బాణసంచా తయారీ యూనిట్‌లో మంగళవారం పేలుడు సంభవించింది. ఘటనలో 13 మంది మరణించగా, పలువురుకి కాలిన గాయాలైనట్లు అధికారులు తెలిపారు. పేలుడు జరిగిన సమయంలో షెడ్డులో సుమారు 40 మంది ఉన్నారని అనుమానిస్తున్నారు. వీరిలో చాలామంది గాయపడగా, పలువురి పరిస్థితి విషమంగా ఉందని వారు చెప్పారు. రాబోయే త్రిస్సూర్ పూరం సందర్భంగా ఆలయ దేవస్థానం తరఫున బాణసంచా తయారు చేస్తున్న షెడ్డులో ఈ ప్రమాదం తరువాయి 12లో



## లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్‌కు తెలంగాణ స్వర్గధామం

- పెట్టుబడులకు నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి
- ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధులకు మంత్రి శ్రీధర్ బాబు విజ్ఞప్తి

ప్రజాపక్షం/హైదరాబాద్


లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామమని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో రాష్ట్రంలో కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేసేలా నార్వే పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని కోరారు. సచివాలయంలో మంగళవారం ఆ దేశ రాయబారి మే ఎలిన్ స్టెనర్ నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. 'తెలంగాణ – నార్వే' దేశాల మధ్య ద్వైపాక్షిక సహకారాన్ని పెంపొందించేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై సమగ్రంగా చర్చించింది. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని ప్రోత్సహించేందుకు తీసుకుంటున్న చర్యలను, ఈజ్ ఆఫ్ డూయింగ్ పాలసీలను, పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, అవకాశాలను ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. క్లీన్ ఎనర్జీ, తరువాయి 6లో

## ప్రధాని మోదీపై హక్కుల ఉల్లంఘన నోటీసు



- లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు నోటీసు సమర్పించిన కాంగ్రెస్ ఎంపి కెసి వేణుగోపాల్
- ప్రధాని జాతినుద్దేశించి చేసిన ప్రసంగంలో ప్రతిపక్ష ఎంపిలపై నిందారోపణలు చేశారని ఆరోపణ

**న్యూఢిల్లీ :** చట్టసభలలో 2029 నుంచి మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన బిల్లులను సభ తిరస్కరించిన అనంతరం జాతినుద్దేశించి మోదీ ప్రసంగించడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. మోదీ తన ప్రసంగంలో ప్రతిపక్ష ఎంపిలపై నిందారోపణలు చేశారని మండిపడుతున్నారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకుడు కె.సి. వేణుగోపాల్ లోక్‌సభ స్పీకర్‌కు హక్కుల ఉల్లంఘన నోటీసును సమర్పించారు. సభ్యులు ఓటు వేసిన తీరు వెనుక దురుద్దేశాలు తరువాయి 12లో






# కనీస వేతనం రూ.26వేలకు పెంచాలి

**కనీస వేతన బోర్డు సభ్యుడు ఎం.డి.యూసుఫ్ డిమాండ్**

**కోఠిలోని డిఎంఇ, టివివిపి కార్యాలయాల ముట్టడి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెరుగుతున్న ధరలకు అనుగుణంగా సంఘటిత, అసంఘటిత రంగ కార్మికుల కనీస వేతనాలు పెంచాలని సిఫార్సు చేస్తూ ప్రభుత్వానికి కనీస వేతన బోర్డు తీర్మానం పంపి ఏడాది కావస్తున్నా కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమని, కనీస వేతన బోర్డు సభ్యులు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎం.డి.యూసుఫ్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు, జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్‌వైజర్లు కాంట్రాక్టు కార్మికులకు రూ.26వేల వేతనం పెంచాలని, ఏజెన్సీల విధానం రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించాలన్న తదితర డిమాండ్ల సాధనకు తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి)నేతృత్వంలో మంగళవారం కోఠిలోని డిఎంఇ,టివివిపి కార్యాలయాలను ముట్టడించారు. వేలాదిగా తరలివచ్చిన కార్మికులు మండుతున్న ఎండలను సైతం లెక్క చేయకుండ గంటల తరబడి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం యూనియన్ ప్రతనిధి బృందం డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్ టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్‌కుమార్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ పుష్క కాలంగా కనీస వేతనాల జీవోలు సవరణకు నోచుకోకపోవడంతోలక్షలాది మంది కార్మికులు తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

వేతనాలను పెంచాల్సిందిగా కనీస వేతన బోర్డు ప్రభుత్వానికి సిఫారసు చేయగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముగ్గురు మంత్రులతో ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీని ఇప్పటివరకు ఒకసారి కూడా సమావేశం కాకపోవడం శోచనీయని పేర్కొన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం. నరసింహ ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల కనీస వేతనం 26 వేలకు పెంచకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఏడాది కాలంగా గడువు ముగిసిన ఏజెనుసీలకే అధికారులు అనుమతులు ఇస్తూ జీవో నెంబర్ 60 ప్రకారమే కార్మికులకు వేతనాలు చెల్లిస్తున్నామని చెబుతున్నారని, ధ్వజమెత్తారు. అధికారుల లోపభూయిష్ట విధానాల కారణంగా గత 4 ఏళ్లుగా కార్మికుల కష్టమంతా కాంట్రాక్టర్ల జేబులోకి వెళుతుందని ఆవేదన వక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.లక్ష్మీబాయి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ హసీనాబేగం, రాష్ట్ర కార్యదర్శిలు వై.ఓమయ్య, పి.సురేష్, ఎ.పార్వతి, సిరా దేవేందర్, ఎస్.కిష్టమ్మ, ఎఐటియుసి నాయకులు రెహమాన్, శ్రీనివాసులు, బొడ్డుపల్లి కిషన్, మదన్ సింగ్, పి. వరలక్ష్మి , కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు

## సమాజంలోని మార్పులను శాస్త్రీయ దృక్పథంతో అర్థంచేసుకోవాలి

**సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి**

**గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభమైన సిపిఐ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం**




**ప్రజాపక్షం/హైదరాబాద్:** సమాజంలోని మార్పులను ఎప్పటికప్పుడు శాస్త్రీయ దృక్పథంతో అర్థం చేసుకోవాలని పార్టీ శ్రేణులకు సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి సూచించారు. హైదరాబాద్ బండ్లగూడలోని నవచేతన విజ్ఞాన సమితి గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటు చేసిన సిపిఐ ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ సిపిఐ కార్యకర్తలు ఉద్యమాలకే పరిమితం కాకుండా, పార్టీ సిద్ధాంతాల పట్ల అవగాహన మరింతగా పెంపొందించుకోవాలన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సామాన్యుడు బతకలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దేశంలో పెచ్చుమీరుతున్న మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా లౌకికవాదులందరూ ఐక్యం కావాలని పల్లా వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు కమ్యూనిస్టులే ముందు వరుసలో ఉంటారని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో తెలుసుకున్న విషయాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటాలు చేయాలని కార్యకర్తలకు సూచించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల తదితర అంశాలపై ప్రజలను చైతన్యపరచాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యవస్థలను తన గుప్పిట్లోకి తీసుకుని, విపక్షాలను అణచివేయడమే లక్ష్యంగా పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈడి, సిబిఐ వంటి సంస్థలను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకుంటున్నారని, దేశంలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ఇచ్చిన హామీని గాలికి వదిలేసి నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. దేశ ప్రజల మధ్య చిచ్చుపెట్టి, మతపరమైన విభజనతో పబ్బం గడుపుకోవాలని బిజెపి చూస్తోందని, ఇది దేశ సమగ్రతకు ప్రమాదకరమని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈ.టి.నర్సింహ, కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, శిక్షణ తరగతుల ప్రిన్సిపల్ ఎన్.మధుకర్, నవచేతన విజ్ఞాన సమితి కార్యదర్శి బి.ఎస్.ఆర్. మోహన్‌రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, నాయకులు సిహెచ్.రాజారెడ్డి, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం ముదురుతోంది

**ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయాల్లో మాటల యుద్ధం మరింత ముదురుతోంది. ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ బిఆర్ఎస్ నేతలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా మాజీ మంత్రి టి. హరీష్ రావుపై వ్యక్తిగతంగా, రాజకీయంగా దూకుడు వ్యాఖ్యలు చేశారు. గాంధీభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ హరీష్ రావు బండారం బయటపడుతుండటంతో కొత్త కథలు చెబుతున్నారన్నారు. కప్పిపుచ్చుకునేందుకు ఇప్పుడు కాళేశ్వరం అంశాన్ని లేవనెత్తుతున్నారు అని ఆరోపించారు. కోర్టు తీర్పు రాకముందే హడావుడి చేయడం వెనుక రాజకీయ ఉద్దేశాలున్నాయని అన్నారు.అలాగే మాజీ ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావుపై కూడా విమర్శలు చేస్తూ, ఒకవైపు డ్రామాలు చేస్తూ, మరోవైపు బిజెపి కథలు చెబుతున్నారు అని వ్యాఖ్యానించారు.

## ఉద్యోగులు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజలకు పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలను అందించడమే లక్ష్యంగా ఉద్యోగులంతా బాధ్యతగా తమ విధులు నిర్వర్తించాలని సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ దిశా నిర్దేశనం చేశారు. తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తీసుకు వచ్చేందుకు కృషి చేయాలన్నారు. మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా మంగళవారం సచివాలయంలో ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ తనలో శక్తి ఉన్నంత వరకు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం ఉద్యోగుల సంక్షేమ కోసం నిరంతరం పాటుపడతానన్నారు. అంబేద్కర్ సూచించిన విధంగా కేవలం చదువు ద్వారానే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేంత్‌రెడ్డి ముందుకెళ్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే లోయర్ ట్యాంక్ బ్ండ సమీపంలో అంబేద్కర్ నాలెడ్జి సెంటర్ అలాగే నింబోలి అడ్డలో ఒక లైబ్రరీ, హాస్టల్‌ను ఏర్పాటుకు బడ్జెట్‌లో ముఖ్యమంత్రి నిధులు కేటాయించారని గుర్తుచేశారు. మహనీయులు చూపిన మార్గంలో ఉద్యోగస్తులందరూ నడవాలని తద్వారా ఆయా వర్గాలకు మేలు కలిగే విధంగా ప్రభుత్వం నిర్దేశించిన పథకాలను క్షేత్రస్థాయిలో అందేలా కృషి చేయాలన్నారు. సచివాలయంలో పని చేస్తున్న 320 మంది ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగస్తులు వారి ఆలోచనలను ఆచరణలో పెట్టాలని. మహనీయులు సూచించిన మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రశాంత్ సలహాదారులు సైదా , ఉద్యోగుల సంఘల సహకార సంఘం అధ్యక్షుడు రెడ్ల రాజేశ్వర్, సునీత అడిషనల్ సెక్రటరీ, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**యువతకు నైపుణ్యాభివృద్ధి – ఉపాధి అవకాశాలపై విస్తృత అవగాహన కల్పించాలి**


రాష్ట్రంలోని యువతకు ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని, అందుకు ప్రతి అధికారి బాధ్యతయుతంగా పనిచేయాలని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. రాష్ట్ర యువత భవిష్యత్తు దృష్ట్యా, ముఖ్యంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువకులు, యువతులు ప్రభుత్వం అమలుచేస్తున్న నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, స్వయం ఉపాధి పథకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రజాపాలన— ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న సంక్షేమవారం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మంత్రి జిల్లా స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

### సాఫ్ట్‌వేర్ ఉద్యోగి కొంప ముంచిన గంజాయి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగం వచ్చిందని తల్లిదండ్రులు సంతోషపడ్డారు. ఆరు నెలల సావాసంతో వారు... వీరుగా మారుతారన్నట్లుగా స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా చేరిన సిహెచ్.శశిధర్ అనే యువకుడు గంజాయికి అలవాటు పడ్డాడు. వచ్చిన జీతమంతా గంజాయికే తగలేశాడు. చివరకు గంజాయికి బానిసయి స్టాఫ్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసుకున్నాడు. గంజాయిని కొనుగోలు చేయడానికి డబ్బులు లేకపోవడంతో తన ఇంటిమీద గంజాయి మొక్కలను పెంచుకుంటున్నాడు. ఈ సమాచారం అందుకున్న రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎటీమ్ సిఐ బాలరాజు సిబ్బంది కలిసి నాచారంలోని అతని ఇంటిపై దాడి చేసి 17 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి మొక్కల్లో కొన్ని పూతకు వచ్చాయి. మరికొన్ని మూడు మీటర్ల మేర పెరిగాయి. ఈ చెట్ల నుంచి 10 కిలోల మేర గంజాయి వచ్చే అవకాశముంటుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ బాలరాజ్ తెలిపారు. గంజాయి మొక్కలు పెంచుతున్న శశిధర్‌ను అరెస్టు చేసి ఘట్కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. ఇదే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎటీమ్ సిఐ బాలరాజు సిబ్బంది మేడపాటి నగర్‌లో బిటెక్ చదువుతున్న విద్యార్థులు గంజాయి అమ్మకాలు జరుపుతుండగా పట్టుకున్నారు. ఇద్దరి నుంచి 480 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో బండి అరుణ్ కుమార్, బి.ఆషిష్‌లను అరెస్టు చేసి ఘట్కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌ను అసిస్టెంట్ కమిషనర్ ఆర్.కిషన్, ఇఎస్ జీవన్ కిరణ్‌లు అభినందించారు.

## టివిజెఎ పనితీరు అభినందనీయం

**మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ వీడియో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (టివిజెఎ) చేస్తున్న కృషి అభినందనీయమని మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఇటీవల జరిగిన టివిజెఎ కార్యవర్గ ఎన్నికల్లో గెలుపొందిన నూతన ఆఫీస్ బేరర్‌లకు మంగళవారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఆయన గెలుపు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ న్యూస్ ఛానెల్స్‌లో పనిచేస్తున్న వందలాది వీడియో జర్నలిస్టులను ఏకం చేసి, అసోసియేషన్‌ను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తుండటం ప్రశంసనీయమన్నారు. వీడియో జర్నలిస్టుల సంక్షేమం కోసం తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మీడియా రంగంలో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు మీడియా అకాడమీ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు కె.విరాహత్ అలీ మాట్లాడుతూ 740మంది సభ్యులతో కొనసాగుతున్న టివిజెఎ తమ సంఘానికి అనుబంధంగా పనిచేయడం ఆనందదాయకమన్నారు. ఇంత పెద్ద సంఖ్యలో వీడియో జర్నలిస్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ అసోసియేషన్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే కమిటీల్లో టివిజెఎకు ప్రాతినిధ్యం కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఫ్రీలాన్స్ వీడియో జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయించేందుకు టియుడబ్ల్యూజె కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి మోహన్‌రాజ్ పిల్లయ్, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరి, టివిజెఎ మాజీ అధ్యక్షుడు వనం నాగరాజు, నూతన అధ్యక్షుడు హరీష్ నందూరి, ఉపాధ్యక్షుడు పి.ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి.ఎస్.సన్నీ, సహాయ కార్యదర్శి వి.జనార్దన్‌రెడ్డి, కోశాధికారి ఆర్.విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని కె.శ్రీనివాస్ రెడ్డి, కె.విరాహత్ అలీ సత్కరించారు.

## అనారోగ్యంతో మృతి చెందిన గల్ఫ్ కార్మికుడికి రూ.5లక్షల ఆర్థిక సాయం

**స్పెషల్ కేసుగా నిధులు మంజూరు చేసిన సిఎం రేవంత్ రెడ్డి**

**మృతుని భార్యకు చెక్కు అందజేసిన సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి**




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దుబాయిలో అనారోగ్యానికి గురై హైదరాబాద్‌లో మరణించిన ఆరెల్లి గంగారాజం కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. దుబాయిలో ఇటీవల అనారోగ్యంతో కోమాలోకి వెళ్లిన జగిత్యాల రూరల్ మండలం పొలాస గ్రామానికి చెందిన ఆరెల్లి గంగారాజం గల్ఫ్ కార్మికున్ని మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. పది రోజుల తర్వాత చివరకు జగిత్యాల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో గంగారాజం మృతి చెందారు. ఈ అంశాన్ని ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు. హైదరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం సిఎం ప్రజావాణి ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి మృతుడి భార్య ఆరెల్లి రాజవ్వకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డాక్టర్ బి.ఎం.వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, మెంబర్ సింగిరెడ్డి నరేష్ రెడ్డి, ప్రవాసీ ప్రజావాణి కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు. అయితే ఈ కేసులో మరణం భారత్‌లో చోటుచేసుకోవడంతో, 'మరణ స్థలం గల్ఫ్ దేశం అయి ఉండాలి' అనే సాంకేతిక నిబంధన కారణంగా ఆర్థిక సహాయం పొందడంలో ఆటంకం ఏర్పడగా స్పెషల్ కేసుగా సిఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సిఎం రేవంత్‌రెడ్డి ఆ కుటుంబాన్ని ఆదుకున్నారు. మానవతా దృక్పథంతో ప్రత్యేక కేసుగా పరిగణించి రూ.5 లక్షల గల్ఫ్ ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని మృతుడి భార్య రాజవ్వ, కుమారుడు జలంధర్ మార్చి 31న ప్రజాభవన్‌లో నిర్వహించిన సిఎం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమంలో సిఎం పేరుతో దరఖాస్తు సమర్పించగా, డాక్టర్ జి.చిన్నారెడ్డి దరఖాస్తుపై ఎండార్స్ చేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని స్టేట్ నోడల్ అధికారి దివ్యా దేవరాజన్ సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులుతో ఫోన్‌లో చర్చించి, ప్రభుత్వానికి డిఓ లేఖ రాశారు. గల్ఫ్ కార్మిక కుటుంబాలను మానవతా దృక్పథంతో ఆదుకుంటున్న సిఎం రేవంత్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, అధికార యంత్రాంగానికి పొలాస సర్పంచ్ మిల్కూరి శంకరయ్య, డిసిసి అధ్యక్షులు గాజెంగి నందయ్యలు కృతజ్ఞతలు తెలిపారు.

### తెలుగువారందరం ఐక్యంగా, పరస్పర సహకారంతో ముందుకు సాగుదాం

**ఎపి సిఎం చంద్రబాబుకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ**



**ప్రజాపక్షం/-హైదరాబాద్ :** రెండు రాష్ట్రాలుగా ఉన్నా తెలుగువారం అందరం ఐక్యంగా, సామరస్యంతో, పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో సాగటం నేటి తక్షణ అవసరమని, ఇందుకు మీ సంపూర్ణ సహకారం కావాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎపి సిఎం చంద్రబాబు నాయుడుని కోరారు. ఎపి సిఎంకి పొన్నం ప్రభాకర్ లేఖ రాశారు. ముందుగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ ఉద్యమం, రాష్ట్ర విభజన చరిత్రను గుర్తుచేశారు. 2014లో రాజ్యాంగబద్ధంగా జరిగిన విభజన తర్వాత రెండు రాష్ట్రాలు అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నాయని, ప్రస్తుతం విభజనపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం అనవసర ద్వేషాలు రగిలిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, జనసేన నాయకుల వ్యాఖ్యలు (ప్రత్యేకంగా తేజస్వి సూర్య, పవన్‌కల్యాణ్) తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలకు దారితీస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేసిన వ్యాఖ్యలు కూడా అపోహలు కలిగిస్తున్నాయని అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలను నియంత్రించేందుకు చంద్రబాబు జోక్యం చేసుకోవాలని, లోక్‌సభ రికార్డుల నుంచి తేజస్వి సూర్య వ్యాఖ్యలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు ఐక్యంగా, సహకారంతో అభివృద్ధి చెందడం అవసరమని, అందుకు సహకారం అందించాలని కోరారు. మీరు సహృదయంతో నా వినతిని అర్థం చేసుకుంటారని, దీనికి తగువిధంగా స్పందిస్తారని ఆశిస్తున్నాను అని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

### రాష్ట్రంలో మరో మూడు రోజులు వడగళ్ల వానలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఒకవైపు మండే ఎండలు, మరోవైపు అకాల వర్షాలతో భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజులు పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో ఈ అకాల వర్షాల ప్రభావం అధికంగా ఉండనుంది. ఆదిలాబాద్, కొమరం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వడగళ్ల వానలు పడే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్ నగరంలో కూడా సాయంత్రం లేదా రాత్రి సమయంలో వడగళ్ల వానలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. ఇక 21వ తేదీ మధ్యాహ్నం నుంచి 22వ తేదీ ఉదయం వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు చోటు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో గంటకు 40–50 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉండగా, కొన్ని ప్రాంతాల్లో వడగళ్ల వానలు కూడా పడవచ్చని హెచ్చరిక జారీ చేశామన్నారు. 22 నుంచి 24 తేదీల మధ్య కూడా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కొనసాగనున్నాయి. ఆదిలాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్–మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షపాతం ఉండే అవకాశముందన్నారు. 26వ తేదీ నుంచి రాష్ట్రంలో వాతావరణం క్రమంగా పొడి పరిస్థితులకు మారే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం అధికారుల అంచనగా ఉంది.

### విమర్శల కంటే సూచనలు చేస్తే బాగుండేది


**ఎమ్మెల్సీ బల్మూర్ వెకంట్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జగిత్యాల సభలో ప్రభుత్వం పై విమర్శలు చేయడం కంటే ప్రజా సమస్యలపై సూచనలు ఇస్తే బాగుండేదని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు. సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆయన మాట్లాడుతూ జీవన్ రెడ్డిని పార్టీలో చేర్చుకునేందుకు బిఆర్ఎస్ పెద్ద డ్రామా ఆడిందని ఆరోపించారు. కెసిఆర్ విమర్శలు ప్రజల్లో విలువ లేకుండా పోయిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అధికారం ఇవ్వడం వెనుక కెసిఆర్ పాలనపై వ్యతిరేకతే కారణమని పేర్కొన్నారు.

## రాహుల్ స్థానం కోసం రేవంత్ రెడ్డి తాపత్రయం

**దక్షిణాదికి అన్యాయమంటూ గగ్గోలు వెనుక అసలు కుట్ర ఇదే**

**రేవంత్ రెడ్డి, స్టాలిన్ లపై మండిపడ్డ కేంద్ర మంత్రి బండి సంజయ్**



**ప్రజాపక్షం/కరీంనగర్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్థానాన్ని ఆక్రమించాలని తాపత్రయపడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. అందులో భాగంగానే డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాదికి అన్యాయం జరుగుతోందని గగ్గోలు పెడుతున్నారని అన్నారు. జమిలి ఎన్నికలొస్తే తెలంగాణలోనూ బిజెపి విజయం తథ్యమని రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందన్నారు. కరీంనగర్‌లో మంగళవారం మీడియాతో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లుపై బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి, స్టాలిన్ లపై మండిపడ్డారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులను అడ్డుకుని ఏదో గొప్ప పని చేసినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రజలంతా రేవంత్‌ను చీదరించుకుంటున్నారనే సంగతి మర్చిపోయారు. కనీసం ఇంటెలిజెన్స్ నుండి సమాచారం తెప్పించుకుంటే బాగుండేదని. ఇవేవీ లేకుండా రాహుల్ గాంధీ స్థానంలో రేవంత్ రెడ్డి కూర్చోవాలని తాపత్రయపడుతున్నారని, ఎందుకంటే రాహుల్ గాంధీని ప్రజలు లీడర్‌గా అంగీకరించడంలేదని, ఆ స్థానంలోకి రావాలని తహతహలాడుతున్నారనీ అన్నారు. మహిళా బిల్లును అడ్డుకుని రేవంత్ రెడ్డి, స్టాలిన్ సహా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయన్నారు.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్.**
టెండర్ నోటీసు ('ఇ' ప్రాక్యూర్‌మెంట్ ద్వారా)
NIT No. 02/EE/CMC/CIR-48/2026-27, తేది: 20.04.2026
నెం. 02/EE/CMC/CIR-48/2026-27 (ఐటెం నెం. 01), తేది: 20.04.2026 ద్వారా, రూ. 3.20 లక్షల అంచనా వ్యయంతో కూడిన (01) పనికి సంబంధించి, 'ఇ'ప్రాక్యూర్‌మెంట్ విధానం ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. 'ఇ'ప్రాక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ వెబ్‌సైట్‌లో బిడ్ల విక్రయం 21.04.2026న మధ్యాహ్నం 2:00 గంటల నుండి ప్రారంభమవుతుంది; బిడ్లను సమర్పించడానికి చివరి తేదీ: 24.04.2026న మధ్యాహ్నం 2:00 గంటలు కాగా, బిడ్ల విక్రయం సమర్పణ గడువుకు ఒక గంట ముందు ముగుస్తుంది. తదుపరి వివరాలను https://tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, మియాపూర్ సర్కిల్-48, ఎస్ఎల్‌పి జోన్ : సీఎంసి.
DIPR R.O. No. : 1117-PP/CL/ADVT/2026-27, Date: 21-04-2026

**తెలంగాణ ప్రభుత్వం, మిషన్ భగీరథ శాఖ,**
సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, మిషన్ భగీరథ సర్కిల్, మహబూబ్‌నగర్.
'ఇ' ప్రాక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
క్ర.సం.1, టెండర్ నోటీసు నెం. మరియు తేది: No.T4/Tenders/01/2026-27, తేది: 20.04.2026, పని పేరు: నారాయణపేట జిల్లా, గుండ్‌మల్ మండలం, గుండ్‌మల్ పంపింగ్ మెయిన్ నుంచి తుపకొలను తండా వరకు పైపులైన్ పొడిగింపు, అంచనా విలువ: రూ.15.00లక్షలు, గ్రాంట్: KADA Funds, కాల్ నెం. 1వ పిలుపు, ఇ-ప్రాక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్‌లో టెండర్ డాక్యుమెంట్‌లు 23.04.2026 నుండి 07.05.2026న మ.3.00గం.ల వరకు అందుబాటులో ఉంటాయి. టెండర్ల స్వీకరణ: 07.05.2026న సా.5.00గం.ల వరకు, టెండర్ల ప్రారంభం: 08.05.2026న ఉ.11.00గం.లకు, మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంలో లభించును. దయచేసి ప్రకటన వివరాలు ఇ-మెయిల్ ఐడి: setdwsp1mbnr@gmail.comకి పంపండి.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, మిషన్ భగీరథ :: మహబూబ్‌నగర్
DIPR R.O. No. : 1135-PP/CL/ADVT/2026-27, Date: 21-04-2026

# ప్రధాని ఎన్నికల నియమావళి ‘ఉల్లంఘన’ ఫిర్యాదును పరిశీలిస్తాం

## ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సిపిఐ, సిపిఐ(ఎం) రాసిన లేఖలపై ‘ఇసి’ స్పందన

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి)ని ఉల్లంఘించిందని ప్రతిపక్షాలు చేసిన ఫిర్యాదును తాము పరిశీలిస్తామని ఎన్నికల సంఘం (ఇసి) వర్గాలు మంగళవారం వెల్లడించాయి.
శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ జాతిని ఉద్దేశించి చేసిన ఎన్నికల ప్రసంగం ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ వామ పక్ష పార్టీలు ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌కు ఇటీవల లేఖలు రాసిన విషయం తెలిసిందే. అసోం, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలలో ఇటీవలే పోలింగ్ జరగగా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో ఏప్రిల్ 23న (గురువారం) ఓటింగ్ జరుగనుంది. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29న చివరి దశ పోలింగ్ జరుగనున్నది. కాగా పశ్చిమబెంగాల్ రాష్ట్ర శాసనసభలో మొత్తం 294 స్థానాలు ఉన్నాయి.
ఏప్రిల్ 23న తొలిదశ, ఏప్రిల్ 29న చివరిదశ పోలింగ్ ముగియనుండగా, మే 4న కౌంటింగ్ జరుగనున్నది. ప్రధానమంత్రిపై ఫిర్యాదును ఎన్నికల సంఘం యొక్క మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసిసి) విభాగం పరిశీలిస్తుంది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో పాటు మార్చి 15న అమలులోకి వచ్చిన ఈ ఎన్నికల నియమావళి 5 అసెంబ్లీలకు మే 4న ఓట్ల లెక్కింపు జరిగే వరకూ అమలులో ఉంటుంది. రాబోయే రోజుల్లో ఎన్నికలు జరుగనున్న రాష్ట్రాలలో ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయడానికి ప్రభుత్వ ప్రసార సంస్థ ప్రయత్నిస్తోందని సిపిఐ రాజ్యసభసభ్యుడు పి.సందోష్ కుమార్, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.బేబి ఇటీవల ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు లేఖలు రాసిన నేపథ్యంలో ఎన్నికల సంఘం తాజాగా స్పందించింది. ఇదిలాఉంటే ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంసిసి ఉల్లంఘనపై 700మంది సామాజిక కార్యకర్తలు, పలువురు సాధారణ పౌరులు కూడా ఎన్నికల అధికార యంత్రాంగాన్ని ఆశ్రయించారు.

### మెడికల్ డివైసెస్ ఉత్పాదనకు

# అత్యాధునిక మౌలిక సదుపాయాలు

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అత్యాధునిక వైద్య పరికరాల తయారీకి తెలంగాణాలో ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. మెడికల్ డివైసెస్ పార్క్, జీనోమ్ వ్యాలీలో తక్షణం ఉత్పత్తి ప్రారంభించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ఉన్నాయని వెల్లడించారు. సచివాలయంలో మంగళవారం తనను కలిసిన నెదర్లాండ్స్ మెడిటెక్ పారిశ్రామికవేత్తలు, యూనివర్సిటీల పరిశోధకులతో ఆయన మాట్లాడారు. వైద్య సంబంధ పరిశోధనలు, కృత్రిమ మేథ అభివృద్ధి, పరికరాల ఉత్పత్తికి తెలంగాణా అత్యంత అనుకూలమని ఆయన వివరించారు. ఔషధాల ఉత్పత్తి, నూతన ఆవిష్కరణలు, వ్యాక్సిన్ల తయారీలో తమ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉందని పేర్కొన్నారు. కోవిడ్ మహమ్మారి వ్యాపించిన సమయంలో ఇక్కడి బయోటెక్ కంపెనీలు 120 దేశాలకు వ్యాక్సిన్లు సరఫరా చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆధునిక వైద్య పరికరాల ఉత్పత్తిలో తెలంగాణాను కేంద్ర స్థానం (హబ్) గా తీర్చిదిద్దేందుకు సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తమ ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐటి సలహాదారు ఐ.సాయికృష్ణ టిజిఐఐసి ఎండి శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, పరిశ్రమల శాఖ స్పెషల్ సెక్రటరీ రఘురామ శర్మ, తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్, వైస్ ప్రెసిడెంట్ వేణు తదితరులు పాల్గొన్నారు.



## సిఎం ఎ.రేవంత్ రెడ్డిని కలిసిన సురేష్ బత్తిని

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆదాయపు పన్ను శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్‌గా ఇటీవల నియమితులైన సురేష్ బత్తిని మంగళవారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని జూబ్లీ హిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం

### తెలంగాణ వ్యతిరేకి జీవన్‌రెడ్డితో


# రాజకీయ పునరేకీకరణ ఎలా సాధ్యం?

## కల్వకుంట్ల కవిత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వైఎస్ నాయకత్వం ఉంటే తమకు చాలని, తెలంగాణ రాష్ట్రం ఎందుకని ప్రశ్నించిన నాటి తెలంగాణ వ్యతిరేకి మాజీ మంత్రి జీవన్‌రెడ్డితో రాజకీయ పునరేకీకరణ ఎలా సాధ్యమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. గత ఎన్నికల్లో జరిగిన ఓటమి పట్ల బిఆర్‌ఎస్ ఇప్పటికీ ఆత్మవిమర్శ చేసుకోలేదని, ఇందుకు ప్రజలదే తప్పిదం అన్నట్టుగా చులకన చేసి మాట్లాడుతున్నారని కెసిఆర్‌ను ఉద్దేశించి కవిత వ్యాఖ్యానించారు. వెయ్యి ఏండ్లు అయినా ఇక బిఆర్‌ఎస్‌లో మార్పు ఉండబోదన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ జాగృతి కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ జగిత్యాలలో జరిగిన బిఆర్‌ఎస్ సభలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాడిన ఉద్యమకారుల గురించి ఒక్క మాట కూడా మాట్లాడలేదని, అలాగే కేంద్ర ప్రభుత్వాన్ని బిఆర్‌ఎస్ నాయకత్వం పల్లెత్తు మాట కూడా అనకపోవడంలో ఆంతర్యం ఏమిటని ఆమె ప్రశ్నించారు. జాతీయ పార్టీగా చెప్పుకుంటూ లోక్ సభలో మహిళా బిల్లు వీగిపోవడం, డీలిమిటేషన్ బిల్లు, జనగణనపై ఒక్క మాట కూడా మాట్లాడలేదని మండిపడ్డారు. బిఆర్‌ఎస్‌లో ఆడబిడ్డలకు ఎప్పుడూ గౌరవం ఉండబోదని, అందుకే మహిళా కోటా బిల్లు వీగిపోయినా ఒక్క మాట కూడా మాట్లాడలేదన్నారు. మేధావులు, విద్యావేత్తలు బిఆర్‌ఎస్ ఆలోచనా విధానం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవాలని కవిత సూచించారు. రాష్ట్రంలో అధికార, ప్రధాన ప్రతిపక్షాలు ఒకే రోజు భారీ బహిరంగ సభలు పెట్టి ‘తూ కిత్నా అంటే.. అంటే మైకిత్నా అంటూ’ బలప్రదర్శనకు దిగాయే తప్ప ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ సభలలో బిఆర్‌ఎస్ ఉత్తి కథలు చెబితే, కాంగ్రెస్ పార్టీ పిట్టకథలు చెప్పిందని ఎద్దేవా చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని కవిత ప్రకటించారు. జాగృతిలో చేరిన ‘ఫార్వర్డ్ బ్లాక్’ నాయకుడు ప్రసాద్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు, నేషనల్ కౌన్సిల్ మెంబర్ ఆర్‌విఆర్ ప్రసాద్ తన అనుచరులతో కలిసి కల్వకుంట్ల కవిత సమక్షంలో తెలంగాణ జాగృతిలో చేరారు.

## కెసిఆర్ ఎంతో హుందాగా రాష్ట్ర ప్రయోజనాలపైనే మాట్లాడారు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** జగిత్యాలలో కెసిఆర్ సభ జరుగుతుందని ముందే తెలిసినప్పటికీ ఆ సభకు పోటీగానే అదే జిల్లాలో, అదే సమయానికి సిఎం రేవంత్‌రెడ్డి మాట్లాడటం, ఆయన సంకుచిత మనస్తత్వానికి నిదర్శనమని బిఆర్‌ఎస్‌ఎల్‌పి ఉప నాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ పదేళ్ళు రాష్ట్రాన్ని పాలించిన ముఖ్యమంత్రిగా కెసిఆర్ ఎంతో హుందాగా మాట్లాడారని, రేవంత్‌రెడ్డి పేరు ఒక్కసారి కూడా తీయకుండా రాష్ట్ర ప్రయోజనాలపైనే మాట్లాడారని, కానీ సిఎం రేవంత్‌రెడ్డి మాత్రం రంకెలు వేయడం, ఏడవడం తప్ప ఇంకేమీ చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి తలకిందులు తపస్సు చేసినా మళ్లీ వచ్చేది బిఆర్‌ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. కెసిఆర్ ఆదేశాల మేరకే సీనియర్ న్యాయవాదులను కలిసేందుకే తాను, ఎంపి రవిచంద్ర, మాజీ ఎంపి వినోద్ కుమార్ ఢిల్లీకి వెళ్లినట్టు వివరించారు. కాళేశ్వరం కేసులో తీర్పు ఏవిధంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందని, అలాగే మే 6న హైకోర్టులో ఎంఎల్‌ఎల ఫిరాయింపుల కేసుల కోసం సీనియర్ లాయర్లను సంప్రదించేందుకు తాము ఢిల్లీకి వెళ్లామని హరీశ్‌రావు తెలిపారు.

## కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణం మరియు నిర్వహణలో జరిగిన అక్రమాలపై విచారణ కోసం ఏర్పాటు చేసిన జస్టిస్ పి.సి. ఘోష్ కమిషన్‌కు సంబంధించిన పిటిషన్‌లపై హైకోర్టు బుధవారం తుది తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ 2024 మార్చి 14న జారీ చేసిన జీవో 6ను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు, ఐఎఎస్ అధికారి స్మితా సభర్వాల్, మాజీ ఐఎఎస్ ఎస్.కె. జోషి వేర్వేరుగా కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులపై చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం సుదీర్ఘ వాదనలు విని మార్చి 12న తీర్పును రిజర్వ్ చేసింది. తొలుత ఈ నెల 8న తీర్పు ప్రకటిస్తామని తెలిపినా, తీర్పు సిద్ధం కాకపోవడంతో విచారణను ఈ నెల 22కు వాయిదా వేసిన విషయం తెలిసిందే.

## రోహిత్ రెడ్డి బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు 28కు వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొయినాబాద్‌లో నమోదైన డ్రగ్స్ కేసులో బిఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పును ఈనెల 28కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ కె.సుజన మంగళవారం ఆదేశాలను జారీ చేశారు. కేసు దర్యాప్తు పూర్తైందని, తన క్లయింట్ మార్చి 15 నుంచి జైలులో ఉన్నారని లాయర్ హైకోర్టుకు తెలిపారు. మొత్తం 11 మంది నిందితులు ఉన్నప్పటికీ ముగ్గురినే నిర్బంధించి, మిగిలిన వారిపై కేవలం నోటీసులతో సరిపెట్టారని చెప్పారు. ఈ కేసు రాజకీయ ఉద్దేశాలతో నమోదు చేశారని ఆరోపించారు. పోలీసుల వాంగ్మూలాలు ఒత్తిడితో తీసుకున్నవని పేర్కొన్నారు. ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు వాదిస్తూ నిందితుడు ఫాం హౌస్‌లలో డ్రగ్స్ పార్టీల నిర్వహణతో పాటు సరఫరాలో కూడా పాల్గొన్నాడని తెలిపారు. ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉన్నాయని కోర్టుకు వివరించారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును ఈనెల 28కు నిలిపివేశారు.

## ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై కేసుల వివరాలు ఇవ్వండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమ్మక్కసారాలమ్మ జాతర సమయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిపై పూర్తి వివరాలు సమర్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. హుజూరాబాద్, వీణవంక పోలీస్ స్టేషన్‌లలో నమోదైన కేసులను రద్దు చేయాలంటూ దాఖలైన పిటిషన్‌లపై జస్టిస్ కె. సుజన విచారణ జరిపారు. పిటిషనర్ తరపున న్యాయవాది టి.వి. రమణరావు వాదిస్తూ, జాతరకు కుటుంబ సభ్యులతో వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. ప్రభుత్వ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వరరావు స్పందిస్తూ ఈ కేసుల దర్యాప్తు సీఐడీకి అప్పగించబడిందని తెలిపారు. దర్యాప్తు ప్రస్తుత స్థితిని తెలియజేయడానికి కొంత సమయం కావాలని కోరగా, కోర్టు వారం రోజుల గడువు మంజూరు చేసి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

## 27న బిఆర్‌ఎస్ ప్రత్యేక సమావేశం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ రజతోత్సవ సంబురాల ముగింపును పురస్కరించుకుని, ఆ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ రావు అధ్యక్షతన ఈ నెల 27వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, సభ్యత్వాల పునరుద్ధరణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించనున్నారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ భవిష్యత్ కార్యాచరణపై ఈ సమావేశంలో స్పష్టత రానున్నట్టు బిఆర్‌ఎస్ తెలిపింది. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్‌ను ఎలా ముందుకు తీసుకెళ్లాలి, సభ్యత్వ నమోదు ప్రక్రియ వేగ వంతంపై కెసిఆర్ దిశా నిర్దేశం చేయనున్నారు. ఈ సమావేశానికి పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, బిఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో పాటు ఎంపిలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ మాజీ చైర్మన్లు హాజరుకానున్నారు.

# ‘టెస్కో’ ద్వారానే చేనేత వస్త్రాలు కొనాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గురుకుల విద్యా సంస్థలు సహా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ విభాగాలు చేనేత వస్త్రాల కొనుగోళ్లను తప్పనిసరిగా తెలంగాణ స్టేట్ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ (టెస్కో) ద్వారానే జరపాలని హైకోర్టు ఆదేశాలిచ్చింది. టెస్కో సరుకు అందించలేమని అధికారిక ధ్రువీకరణ ఇచ్చిన తర్వాత మాత్రమే ఇతర మార్గాల్లో కొనుగోలు చేయవచ్చని కోర్టు పేర్కొంది. ఈ ధ్రువీకరణ లేకుండా గురుకుల పాఠశాలల అవసరాల కోసం కార్పెట్‌లు, దుస్తులు, టవల్స్, బ్లాంకెట్‌లు కొనుగోలు చేయాలంటూ ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ ఈ నెల 2న విడుదల చేసిన ఈ టెండర్ ప్రకటనను కోర్టు చెల్లదని ప్రకటించింది. టెస్కోకు ఇప్పటికే ఇచ్చిన సరఫరా ఆర్డర్‌ను రద్దు చేయడం కూడా న్యాయసమ్మతం కాదని తేల్చింది. వరంగల్ జిల్లా కొత్వాడకు చెందిన వీరాంజనేయ హ్యాండ్లూమ్ వీవర్స్ మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ ప్రొడక్షన్ అండ్ సేల్స్ సొసైటీ దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ విచారణ జరిపి ఈ తీర్పు వెలువరించారు.
తెలంగాణలో చేనేత రంగం ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ రాష్ట్రంలో సుమారు 17 వేలకుపైగా హ్యాండ్‌లూమ్‌లు ఉండగా, దాదాపు 40 వేల కుటుంబాలు ఈ వృత్తిపై ఆధారపడుతున్నాయని కోర్టు గుర్తించింది. చేనేత రంగం సంక్షోభంతో ఆత్మహత్యల ఘటనలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం 2024లో జీవో 1ను ప్రవేశపెట్టిందని వివరించింది. జీవోలోని నిబంధనలను పక్కనబెట్టడం ద్వారా దాని ఉద్దేశ్యమే దెబ్బతింటుందని, అధికారులకు అలాంటి స్వేచ్ఛ లేదని కోర్టు వ్యాఖ్యానించింది. ప్రభుత్వ శాఖలు, సంస్థలు, ఆస్పత్రులు తమ చేనేత అవసరాలను టెస్కో లేదా అర్హత కలిగిన ఇతర సంఘాల నుంచే పొందాలని జీవోలో స్పష్టంగా ఉన్నదని పేర్కొంది. టెస్కో సరఫరా చేయలేమని తెలిపిన సందర్భంలోనే ఇతర సంస్థల నుంచి కొనుగోళ్లు జరగాలని తెలిపింది. జీవో 17 ద్వారా ఏర్పాటు చేసిన ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ జీవో 1ను అతిక్రమించలేదని, రెండింటినీ కలిపి అమలు చేయాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. టెస్కో నుంచి సరఫరా అసాధ్యమని లేఖ లేకుండానే జారీ చేసిన ఈటెండర్‌ను రద్దు చేస్తూ తీర్పు ఇచ్చింది. అయితే టెస్కో పరిధిలోకి రాని ఇతర వస్తువుల కొనుగోళ్లకు ఈ ఉత్తర్వులు అడ్డంకి కావని తెలిపింది.

## నారాయణ విద్యాసంస్థల ఘన విజయం

### జెఇఇ మెయిన్స్‌–2026లో టాప్ ర్యాంకుల జైత్రయాత్ర

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జెఇఇ మెయిన్స్‌–2026 ఫలితాల్లో నారాయణ విద్యాసంస్థలు మరోసారి అద్భుత ప్రతిభ కనబరిచాయి. దేశవ్యాప్తంగా టాప్ ర్యాంకులను సాధిస్తూ, విద్యా రంగంలో తమ ఆధిపత్యాన్ని మరోమారు నిరూపించుకున్నాయి.అధికారికంగా విడుదలైన వివరాల ప్రకారం, ఆలిండియా ఓపెన్ కేటగిరీలో 1, 6, 7, 9, 10 ర్యాంకులను నారాయణ విద్యార్థులు కైవసం చేసుకున్నారు. అలాగే ఒబిసి కేటగిరీలో 10, 14, 17, 19, 21, 23, 24, 25 ర్యాంకులను సాధించి తమ ప్రతిభను చాటారు. అంతేకాకుండా 100లోపు 27 ర్యాంకులు, 1000లోపు 174 ర్యాంకులు సాధించడం విశేషం. ఈ విజయంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు ఆనందంలో మునిగిపోయారు. సంస్థ చైర్మన్ మాట్లాడుతూ, క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధమైన శిక్షణ, నైపుణ్యమైన బోధన వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో థమ్మినా గిరీష్ (ఎఐఆర్ 10), సాయి రిత్విక్ రెడ్డి (ఎఐఆర్ 14), మాధవ్ విరాడ్య (ఎఐఆర్ 17), వి శరద్ మహేశ్వరి (ఎఐఆర్19), ఎన్ గారి మహిత్ (ఎఐఆర్ 21), శ్రేయాస్ మిశ్రా (ఎఐఆర్ 23), డి భావితేష్ రెడ్డి (ఎఐఆర్ 24), శ్రీకాంత్ అతలేయ్ (ఎఐఆర్ 25) వంటి వారు ప్రత్యేకంగా నిలిచారు.దేశ స్థాయిలో పోటీ తీవ్రంగా ఉన్నప్పటికీ, నారాయణ విద్యార్థులు చూపిన ఈ ప్రతిభ విద్యా ప్రమాణాలకు నిదర్శనమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మొత్తం మీద, జేఈఈ మెయిన్స్ 2026 ఫలితాలు నారాయణ విద్యాసంస్థలకు మరో మైలురాయిగా నిలిచాయి.

## ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలం

### ఉద్యోగులు విధులకు హాజరుకావాలి

### ఆర్‌టిసి ఎండి వై.నాగిరెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం అత్యంత సానుకూలంగా స్పందించిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి తెలిపారు. కార్మికుల డిమాండ్లపై సమగ్రంగా చర్చించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఐఎఎస్ అధికారులతో కూడిన ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసిందని, ఈ కమిటీ మంగళవారం కార్మిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై చర్చలు జరిపిందని ఆయన వివరించారు. కార్మికులు కోరుతున్న డిమాండ్లలో కొన్ని ఆర్థిక పరమైనవి, సంక్లిష్టమైన అంశాలు ఉన్నందున, వాటిని లోతుగా పరిశీలించి పరిష్కరించడానికి ప్రభుత్వానికి కనీసం నాలుగు వారాల సమయం పడుతుందని, ఈ మేరకు ప్రభుత్వం గడువు కోరినట్లు నాగిరెడ్డి పేర్కొన్నారు. సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. అయితే, కొన్ని సంఘాలు వాస్తవాలను విస్మరించి సమ్మెకు పిలుపునిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఆయన ఆక్షేపించారు. ఇటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా, సంస్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కార్మికులందరూ విధులకు హాజరై ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా ఆర్‌టిసిపైనే ఆధారపడి ప్రయాణించే దినసరి కూలీలు, చిరు ఉద్యోగులు, సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఉద్యోగిపై ఉందని, అందరూ బాధ్యతాయుతంగా విధుల్లో పాల్గొనాలని నాగిరెడ్డి కోరారు.

### జెఇఇ మెయిన్స్ పరీక్షలో..

# మెరుగైన ఫలితాలు సాధించిన బిసి ఇంటర్ విద్యార్థులు

## జెఇఇ అడ్వాన్స్‌కు అర్హత సాధించిన 69 మంది విద్యార్థులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జెఇఇ మెయిన్ ప్రవేశ పరీక్షలో 314 మంది బిసి గురుకుల ఇంటర్ విద్యార్థులు హాజరు కాగా వారిలో 9 మంది విద్యార్థులు 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించారని ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు తెలిపారు. మరో 34మంది విద్యార్థులు 80 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించడంతో పాటు జెఇఇ అడ్వాన్స్ కు మొత్తం 69 మంది విద్యార్థులు అర్హత సాధించారన్నారు.
బాలుర విభాగంలో గణేష్ (95.88), ఆర్. సామ్రాట్ (95.25), ఆర్.శ్రీచక్ర (93.26), ఎం. నరేందర్ (91.58), ఆర్.కౌశిక్ (91.25), బి.మల్లేష్( 90.62), ఎం. రుషిక్ వర్మ (90.34), బాలికల విభాగంలో ఎ.నిత్య (92.19), సిహెచ్.గాయత్రి (91.50) పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు. బిసి గురుకుల విద్యార్థులను ఉన్నత విద్యావంతులను చేయాలన్న లక్ష్యంతో కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌ల ద్వారా కోచింగ్ ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు అధిక సంఖ్యలో మెరుగైన ఫలితాలు సాధించారని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు. అత్యుత్తమ ప్రతిభను చూపిన విద్యార్థినీ, విద్యార్థులను, బోధనా సిబ్బందిని మంత్రితో పాటు బిసి సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బాలమాయ దేవి, ఎంజెపి సొసైటీ కార్యదర్శి బడుగు సైదులు అభినందించారు.

**జెఇఇ మెయిన్ పరీక్షలో.. మెరుగైన ఫలితాలు సాధించిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులు**

జెఇఇ మెయిన్–2026 తుది ఫలితాలలో తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థచే నడపబడుతున్న ప్రతిభా కేంద్రాలు (సిఒఇ)లో చదువుతున్న విద్యార్థులు అత్యంత ప్రతిభను కనబరిచి జాతీయస్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించారని గురుకుల సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ తెలిపారు. జెఇఇ మెయిన్ 2026 మొత్తంగా 441 మంది విద్యార్థులు మంచి పర్సంటైల్ సాధించి, జెఇఇ అడ్వాన్స్ 2026 పరీక్షకు అర్హత సాధించారని తెలిపారు. 35 మంది విద్యార్థులు 90 పర్సంటైల్ పైగా సాధించగా, 156 మంది విద్యార్థులు 80 పర్సంటైల్ పైగా, 339 మంది విద్యార్థులు 70 పర్సంటైల్ పైగా సాధించారన్నారు. సిఒఇ గౌలిదొడ్డికి చెందిన కె.కార్తీక్ ఎస్‌టి విభాగంలో 795, ఎస్. వైభవ్ ప్రసాద్ 919 ర్యాంకులు సాధించారని తెలిపారు. అదే కళాశాలకు చెందిన సిహెచ్. స్వరూప్ 98.92 పర్సంటైల్, ఓబిసి విభాగంలో 2036 ర్యాంకు, ఎస్.నిఖిల్ 97.72 పర్సంటైల్ సాధించి ఎస్‌సి విభాగంలో 1097 ర్యాంకు, సిఓఇ వర్ధన్నపేటకు చెందిన కె.అక్షయ్‌కుమార్ 97.44 పర్సంటైల్ పొంది, ఎస్‌సి విభాగంలో 1261 ర్యాంకును సాధించారని తెలిపారు. గౌలిదొడ్డి బాలికల కళాశాల చెందిన వై. శిరీష ఎస్‌టి విభాగంలో 2032 ర్యాంకును, కె.శ్రీ వర్ష ఎస్‌సి విభాగంలో 3221 ర్యాంకులు సాధించి తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ర్యాకులు సాధించిన విద్యార్థులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రత్యేకంగా అభినందిస్తూ, మే 17న జరగబోయే జెఇఇ అడ్వాన్స్ పరీక్ష యందు విశేష ప్రతిభ కనబరిచేలా కష్టపడి చదవాలని ఆకాంక్షించారు. విజయం సాధించిన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ప్రిన్సిపల్స్, సిబ్బందిని గురుకుల సంస్థ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ అభినందనలు తెలిపారు.

# తెలంగాణ పర్యాటక రంగానికి జాతీయ గుర్తింపు

## రాష్ట్రానికి ఇది గర్వకారణం : మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన ‘దివ్య భారత్’ పర్యాటక నివేదికలో తెలంగాణ రాష్ట్రానికి విశిష్ట గుర్తింపు లభించడంపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని వైవిధ్యభరితమైన పర్యాటక సామర్థ్యానికి ఈ నివేదిక అద్దంపడుతోందని, ఇది తెలంగాణకు గర్వకారణమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ పర్యాటక రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం చేస్తున్న కృషికి ఈ గుర్తింపు నిదర్శనమని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజధానిలోని హుస్సేన్ సాగర్, చారిత్రక గోల్కొండ కోట, భువనగిరి కోట వంటి కట్టడాలతో పాటు ఆధ్యాత్మికత ఉట్టిపడే యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం వంటి ప్రసిద్ధ క్షేత్రాలు నిత్యం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయని వివరించారు. కేవలం చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలే కాకుండా ప్రకృతి ఒడిలో విరాజిల్లే కుంటాల, బొగత జలపాతాలు, ఆసియాలోనే అతిపెద్ద గిరిజన పండుగగా పేరొందిన సమ్మక్కసారలమ్మ మేడారం జాతర వంటి సాంస్కృతిక వేడుకలు రాష్ట్ర పర్యాటక రంగానికి ప్రత్యేక గుర్తింపును తెచ్చాయని మంత్రి చెప్పారు. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పోచంపల్లి ఇక్కత్ వంటి సంప్రదాయ కళలు పర్యాటక రంగాన్ని మరింత సుసంపన్నం చేస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలోని సుసంపన్నమైన సంప్రదాయాలు, రుచికరమైన వంటకాలు, ప్రకృతి రమణీయమైన దృశ్యాలను తిలకించేందుకు దేశ విదేశీ పర్యాటకులు తరలిరావాలని మంత్రి పిలుపునిచ్చారు. పర్యాటక రంగంలో మౌలిక సదుపాయాల కల్పనను మరింత బలోపేతం చేయడంతో పాటు, తెలంగాణ పర్యాటక వైభవాన్ని అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని జూపల్లి కృష్ణారావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ప్రధానిపై ఖర్గే వ్యాఖ్యలు దిగజారుడుతనం

### కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఉగ్రవాదితో పోల్చుతూ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన వ్యాఖ్యలపై కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఓ జాతీయ పార్టీ అధ్యక్షుడిగా, సుదీర్ఘ అనుభవం ఉన్న నాయకుడు ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆయన అన్నారు. ప్రధానిపై పదే పదే విమర్శలు చేయడం కాంగ్రెస్ పార్టీలో నెలకొన్న నైరాశ్యాన్ని సూచిస్తోందని కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఉగ్రవాదాన్ని అణిచివేసేందుకు మోదీ శ్రమిస్తుంటే, గతంలో కాంగ్రెస్ నాయకులు ఉగ్రవాదులతో చర్చలు జరిపిన విషయాన్ని ఖర్గే గుర్తుంచుకోవాలని సూచించారు. మన్మోహన్‌సింగ్ హయాంలో వేర్పాటువాది యాసిన్ మాలిక్‌తో జరిపిన చర్చలను ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై విషం చిమ్మిన కాంగ్రెస్‌ను మహిళలు ద్వేషిస్తున్నారని, ఆ ఆక్రోశంతోనే ప్రధానిపై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని అన్నారు.

# బెదిరింపులకు లొంగిపోయేదిలేదు : కానెల్

ట్రంప్ ప్రతినిధివర్గంతో చర్చలు నిజమే

**హవానా :** ట్రంప్ ప్రతినిధి వర్గంతో రాజధాని హవానాలో ఇటీవల చర్చలు జరిగాయన్న వార్తలను క్యూబా ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ధృవీకరించింది. అదేసమయంలో ఒక ఇంటర్వ్యూలో, బెదిరింపులకు లొంగిపోయేదిలేదని కూడా క్యూబా అధ్యక్షుడు కానెల్ ప్రకటించారు. వెనిజులా అధ్యక్షుడు మదురో ఆయన సతీమణిని కిడ్నాప్‌చేసి అమెరికా తరలించిన తర్వాత క్యూబాపై కూడా ట్రంప్ తీవ్రమైన ఆంక్షలు అమలు చేయడం ప్రారంభించారు. క్యూబా గడచిన మూడు నెలలుగా తీవ్రమైన ఆర్థిక,చమురు సంక్షోభంలో కూరుకుపోయిన తరుణంలో సోషలిస్టు శిబిర మిత్రదేశాలు క్యూబాను ఆదుకోవడం ప్రారంభించాయి. ఈ పరిస్థితుల్లో క్యూబాతో చర్చల ప్రక్రియ కొనసాగుతోందని చాలా రోజులుగా ట్రంప్ ప్రకటనలు చేస్తున్నారు. క్యూబా కూడా ట్రంప్ ప్రతినిధివర్గంతో చర్చలు జరిగిన



విషయాన్ని ధృవీకరించింది. క్యూబా సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రత పరిమితులు, క్యూబా జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఈ చర్చలు జరిగాయని ప్రకటించింది. క్యూబా విదేశీ వ్యవహారాల మంత్రులు,అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. క్యూబాపై మూడునెలలుగా కొనసాగుతున్న ఆంక్షలు,దిగ్బంధం ముగించే విషయంపై ఈ చర్చలు జరిగాయి. క్యూబా అధ్యక్షుడు మిగ్యుల్ ఎం.డయాజ్ కానెల్ కూడా గతీవారం ఎన్‌బిసితో ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, విప్లవోద్యమంలో, విప్లవ ఆలోచనల్లో లొంగుబాటు మనస్తత్వం ఉందని స్పష్టం చేశారు. 150 సంవత్సరాల క్రితం మొదటిసారి క్యూబా విదేశీ వలస బానిసత్వం నుండి విముక్తి చెందిందని, ఆ తర్వాత 1959లో క్యూబా విప్లవం విజయవంతం కావడంతో అన్ని రకాల బానిసత్వాలను దేశం నిర్మూలించిందని చెప్పారు. క్యూబన్ ప్రజలు ఈ స్వేచ్ఛను,సార్వభౌమాధికారాన్ని వదులుకోవడానికి సిద్ధంగా లేరన్నారు. "మాది శాంతిదేశం, మేం యుద్ధాన్ని ప్రోత్సహించం, మేం ప్రజల ఐక్యతను, సహకారాన్ని పెంపొందిస్తాం, మేం కోరుకునే శాంతిని కాపాడుకోవడానికి మేం సిద్ధంగా ఉన్నాం, బెదిరింపులకు లొంగం, అప్రమత్తంగా ఉంటాం, ఓడిపోవడానికి సిద్ధంగా లేం" అని స్పష్టం చేశారు.

# రేపు వాషింగ్టన్‌లో లెబనాన్–ఇజ్రాయెల్ చర్చలు

**వాషింగ్టన్ :** ఇజ్రాయెల్–లెబనాన్ మధ్య వాషింగ్టన్‌లో గురువారం (ఏప్రిల్ 23) రెండో విడత చర్చలు జరుగుతాయి. ఈ చర్చలకు అమెరికా ప్రభుత్వం మధ్యవర్తిగా ఉండి ఆతిథ్యం ఇస్తున్నది.ఈనెల 16వ తేదీ నుండి లెబనాన్‌లో పది రోజుల కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. కానీ ఇజ్రాయెల్ మాత్రం పదే పదే ఈ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. తమ ఆత్మరక్షణార్థం ఇజ్రాయెల్ సైన్యం కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుందని ఐ.డి.ఎఫ్ ధీమాగా ప్రకటించింది. రెండో విడత గురువారం అమెరికాలో జరిగే చర్చల్లో ఇజ్రాయెల్‌తో శాంతి, యుద్ధ విరమణ తమకు ప్రధానాంశాలని లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్ ప్రకటించగా, ఇజ్రాయెల్ సైన్యం సరిహద్దుల్లో కొత్త భద్రతా మండలి ఎల్లోలైన్‌ను అమలులోకి తీసుకువచ్చింది. ఇరాన్ మద్దతు గల హెజ్బొల్లాను నిర్మూలించే లక్ష్యంగా గడచిన ఆరు వారాలుగా ఇజ్రాయెల్ సైనిక దళాలు లెబనాన్‌లో ప్రవేశించి నిర్మూలనా యుద్ధం చేస్తున్నాయి. తమను నిరాయుధుల్ని చేయడం, నిర్మూలించడం



అసాధ్యమని హెజ్బొల్లా మరోవైపు హెచ్చరిక చేసింది. గడచిన ఆదివారంనాడే ఇజ్రాయెల్‌కు దక్షిణ లెబనాన్‌కు మధ్య ఒక ఎల్లో లైన్ ఏర్పాటు చేసింది. దక్షిణ లెబనాన్‌లో పది కిలోమీటర్ల దూరం (6.2 మైళ్ళు) లోపలకు చొచ్చుకుపోయి అక్కడే ఒక భద్రతామండలి ప్రాంతాన్ని ఏర్పాటు చేసింది. ఇక తాము ఈ ఎల్లో లైన్ దగ్గరే ఉంటామని, ప్రజలు ఈ ప్రాంతంలో ఉన్న ఇళ్ళకు తిరిగి రావొద్దని ఇజ్రాయెల్ సైన్యం హెచ్చరిక జారీ చేసింది.

## యాపిల్ సిఇఓగా టెర్నెస్
# పదవి నుండి వైదొలగనున్న టిమ్ కుక్

**కుపెర్టినో :** యాపిల్ కంపెనీ సిఇఓ బాధ్యతల నుండి టిమ్ కుక్ వైదొలగనున్నారు. ఆయన స్థానంలో కొత్త సిఇఓగా జాన్ టెర్నెస్ బాధ్యతలు తీసుకుంటారు. ఈ మార్పులన్నీ ఈ ఏడాది సెప్టెంబరు ఒకటో తేదీ నుండి అమలులోకి వస్తాయి. ఆ తర్వాత టిమ్ కుక్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపడతారు. అప్పటివరకూ టిమ్‌కుక్ సిఇఓ బాధ్యతలలో కొనసాగుతారు. గడచిన 15 సంవత్సరాలుగా టిమ్ కుక్ యాపిల్‌కు విశిష్ట సేవలు అందిస్తూ వచ్చారు. ప్రస్తుతం టెర్నెస్ హార్డ్‌వేర్ ఇంజనీరుగా, యాపిల్ వైస్–ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. యాపిల్‌లో ఆయనకు 25 ఏళ్ళ అనుభవం ఉంది. 2001లో కంపెనీలో చేరిన యాపిల్ హార్డ్‌వేర్ ఇంజనీరింగ్ బాధ్యతలు చూస్తున్నారు. దీనివల్ల యాపిల్ మాక్ కంప్యూటర్స్ వంటి ఉత్పత్తుల అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మాక్ కంప్యూటర్స్ ఉత్పత్తులు భారీ మార్కెట్ షేర్ సంపాదించాయి. ఈ ఏడాదిలోనే యాపిల్ సంస్థ స్వర్ణోత్సవ వేడుకలు చేసుకుంటున్నది. దీర్ఘకాలిక వారసత్వ ప్రణాళికలో



భాగంగా ఈ కొత్త మార్పులు జరుగుతాయి. స్టీవ్ జాబ్స్‌తోపాటు మరో ఇద్దరు కలిసి 1976లో యాపిల్ కంప్యూటర్స్ కంపెనీని సిలికాన్ వ్యాలీలో స్థాపించారు. మొట్టమొదటిసారి మైక్రో కంప్యూటర్స్‌ను సామూహికంగా ఉత్పత్తిచేసిన కంపెనీ ఇదే. టిమ్ కుక్ 2011 నుండి యాపిల్ సిఇఓ బాధ్యతల్లో ఉన్నారు. ఇక అప్పటినుండి కంపెనీ ఆదాయాన్ని 348 బిలియన్ డాలర్ల నుండి 1.9 ట్రిలియన్ డాలర్లకు తీసుకువెళ్ళి రెట్టింపు చేశారు. గత ఏడాది 416 బిలియన్ డాలర్లతో ఆదాయంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద టెక్నాలజీ కంపెనీగా రికార్డులకు ఎక్కింది. ఒక ట్రిలియన్ డాలర్ల విలువైన యాపిల్ 2018లో మొదటిసారి మొదటి పబ్లిక్ కంపెనీగా మారింది. నాలుగు ట్రిలియన్ డాలర్లస్థాయికి చేరింది.

## మాండెల్సన్ వివాదంలో..
# స్టార్‌మర్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ

**లండన్ :** అమెరికాలో బ్రిటన్ రాయబారిగా పీటర్ మాండెల్సన్‌ను నియమించి ఆ తర్వాత పీకలోతు వివాదంలో కూరుకుపోయిన బ్రిటన్ ప్రధానమంత్రి, లేబర్‌పార్టీ నాయకుడు కీవ్ స్టార్‌మర్‌కు మంగళవారం మరో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. మాండెల్సన్‌ను రాయబారిగా నియమించాలని, అందునకు ఆమోదం తెలియజేయాలని తనపై తీవ్రమైన ఒత్తిడి చేశారని పదవి కోల్పోయిన విదేశీ కార్యాలయ అధిపతి సర్ ఓలీ రాబిన్స్ చెప్పారు. ఎంపీల ఎదుట ఆయన సాక్ష్యం చెబుతూ ఆయన పైవిధంగా స్పందించారు. మాండెల్సన్‌ను నియమించేముందుగా ఎలాంటి భద్రతాపరమైన తనిఖీలు,గత చరిత్రను తవ్వి చూడాల్సిన అవసరం లేదని తనపై ఒత్తిడి వచ్చిందని ఆయన సాక్ష్యం చెప్పడంతో స్టార్‌మర్ మరింత ఇరుకున పడ్డారు. మాండెల్సన్ వ్యక్తిత్వం గురించి తనకు ముందుగానే తెలిసి ఉంటే ఆ పదవిలో నియమించేవాడిని కాదని పదే పదే స్టార్‌మర్ చెబుతుంటే దేశంలో ప్రతిపక్షాలు, అధికార లేబర్‌పార్టీలోని కొందరు కూడా స్టార్‌మర్‌ను దోషిగా నిలబెడుతున్నాయి. ఆయన కావాలనే అబద్ధాలు చెబుతున్నారని, ఉద్దేశపూర్వకంగానే మాండెల్సన్‌ను ఆ పదవిలో నియమించారని ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఆయన ఎప్‌స్టీన్ ఫైల్స్ వల్ల మాండెల్సన్



ఉచ్చులో బిగుసుకుని పదవీ గండాన్ని ఎదుర్కొంటున్నారు. ఈ దశలో ఈ కేసునుండి బయటపడే మార్గం కోసం ఎదురుచూస్తున్న దశలో ఈ కొత్త సమస్య ఎదురైంది. మాండెల్సన్‌ను 2025 ఫిబ్రవరిలో అమెరికాలో దౌత్యవేత్తగా స్టార్‌మర్ నియమించారు. ఆయనపై ఎప్‌స్టీన్ ఫైల్స్ ఆరోపణలు రావడంతో సెప్టెంబరులో పదవి నుండి ఆయనను తొలగించారు. ఆ తర్వాత కొత్తగా లక్షలాది ఎప్‌స్టీప్ ఫైల్స్ పేజీలను ట్రంప్ విడుదల చేసిన తర్వాత మాండెల్సన్ పాత్ర మరింత స్పష్టంగా బయటకు రావడంతో ఆయన లేబర్‌పార్టీకి రాజీనామా చేశారు. కానీ ప్రతిపక్షాలు అప్పటినుండీ స్టార్‌మర్‌ను వెంటాడుతున్నాయి. ఆయన రాజీనామాకు డిమాండ్ చేస్తున్నాయి.
పతిపక్షం సునామీలా ఆయనను చుట్టుముట్టడంతో పదవిలో ఉండే రోజులను ఆయన లెక్కబెట్టుకునే వాతావరణం అలముకుంది.

## భారత్ విమానాలపై మరో నెల
# పాకిస్థాన్ గగనతల నిషేధాజ్ఞలు

**ఇస్లామాబాద్ :** ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానాలపై పాకిస్థాన్ అమలు చేస్తున్న గగనతల నిషేధాజ్ఞలను మరో నెలరోజులు పొడిగించింది. దీంతో భారతదేశం కూడా అదే తరహాలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలు ఉన్నాయి. ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానాలు పాకిస్థాన్ గగనతల మీద నుండి వెళ్ళకుండా గత ఏడాది ఏడాది ఏప్రిల్ 24 నుండి ఆ దేశం నిషేధాజ్ఞలు అమలు చేస్తోంది. తాజాగా ఈ నిషేధాజ్ఞలను మే 24వ తేదీ వరకూ పొడిగించినట్లు పాకిస్థాన్ ఎయిర్ పోర్టు అథారిటీ ఎయిర్‌మెన్‌కు ఒక నోటీసు ద్వారా తెలియజేసింది. "భారత్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అని వాణిజ్య,సైనిక విమానాలు,ఎయిర్‌క్రాఫ్టులపై మరో నెలరోజులు గగనతల నిషేధం అమలులో ఉంటుంది" అని పేర్కొంది. గతంలో విధించిన నిషేధం మరో ఇరవైనాలుగ్గంటల్లో ముగిసిపోతుందనగా ఈ నోటీసు వెలువడింది. పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడి చేసిన తర్వాత అందుకు పాకిస్థాన్ కారణమని భారత ప్రభుత్వం విమర్శించింది. దీంతో పాకిస్థాన్ ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు తన గగనతల సేవలను మూసివేసింది. భారత్ చేసిన ఆరోపణలపై బాహాటపద్ధతులలో విచారణకు కూడా ఆ దేశం అంగీకరించలేదు. దీంబతో భారతదేశం కూడా తన గగనతలాన్ని పాకిస్థాన్ విమానాలకు అవకాశం లేకుండా మూసివేసింది. పాకిస్థాన్ విధించిన నిషేధం వల్ల భారత్ వాణిజ్య రవాణాకు నష్టం కలిగింది.

# ఇరాన్‌కు చైనా క్షిపణి తయారీ రసాయనాలు!

అమెరికా ఆరోపణకు జియాకున్ ఖండన

**బీజింగ్ :** అమెరికా రెండు రోజుల క్రితం దిగ్బంధనం చేసిన ఇరాన్ కార్గో నౌక 'తౌస్కా' తో తమకు ఎలాంటి సంబంధం లేదని చైనా స్పష్టం చేసింది. అమెరికా దిగ్బంధనం చేసిన ఈ నౌకలో రసాయనిక పదార్థాలు ఉన్నాయి.ఈ రసాయనిక పదార్థాలను క్షిపణులను తయారు చేయడానికి ఉపయోగిస్తారు. గల్ఫ్ ఆఫ్ ఒమన్ జలాల్లో యుఎస్ఎస్ ట్రిపోలీ యుద్ధనౌకకు చెందిన ఉభయచర నైపుణ్య దళాలు హెలికాప్టర్‌ద్వారా వెళ్ళి ఈ నౌకను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నాయి. ఈ కారణంగానే ఇస్లామాబాద్‌లో రెండో విడత అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు జరగకుండా విఘాతం ఏర్పడింది. "నాకు తెలిసీ ఇది విదేశీ జెండాతో వెళుతున్న నౌక. ఎలాంటి మోసపూరితమైన సంబంధాలనైనా చైనా వ్యతిరేకిస్తుంది" అని చైనా విదేశీ వ్యవహారాలమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి గుయో జియాకున్ మంగళవారం ఐక్యరాజ్యసమితిలో అమెరికా దూత నిక్కీహేలీకి వివరణ ఇచ్చారు. ఎక్స్‌వేదికగా నిక్కీహేలీ ఒక పోస్టింగ్ పెడుతూ, తాము స్వాధీనం చేసుకున్న ఈ తౌస్కా నౌక చైనా నుండి ఇరాన్‌కు వెళుతోందని పేర్కొన్నారు. ఇందులో క్షిపణులు తయారు చేయడానికి అవసరమైన రసాయనిక పదార్థాలున్నాయని పేర్కొన్నారు. కానీ ఈ ఆరోపణలను జియాకున్ ఖండించారు. ఇరాన్ పాలకులకు యుద్ధంలో చైనా ప్రోత్సాహం ఇస్తోందనడాన్ని కూడా ఖండించారు.

## తమిళనాడు, బెంగాల్‌లో
# ఎన్నికల ప్రచారానికి తెర

పోలింగ్‌కు ఇసి ఏర్పాట్లు



**న్యూఢిల్లీ :** తమిళనాడు, బెంగాల్‌లో తొలి విడత అసెంబ్లీ ఎన్నికల ప్రచార గడువు ముగిసింది. రాజకీయ నేతల ప్రసంగాలు, భారీ బహిరంగ సభలు, రోడ్ షోలతో మారుమోగిన మైకులు మంగళవారం సాయంత్రం 5 గంటల తర్వాత మూగబోయాయి. చివరి రోజు అన్ని పార్టీలు ముమ్మర ప్రచారం నిర్వహించాయి. తమిళనాడులోని మొత్తం 234 స్థానాలకు, బెంగాల్‌లో తొలి విడతలో 152 సీట్లకు ఈ నెల 23న పోలింగ్ జరగనుంది. ఇందుకోసం ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోంది. తమిళనాడులోని 234 అసెంబ్లీ నియోజకవర్గాలకు జరుగుతున్న ఎన్నికల ప్రచార కోలాహలం ముగిసింది. ఈనెల 23న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. తమిళనాడులో సుమారు 5.67 కోట్ల మంది ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వయోవృద్ధులు, వికలాంగుల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఇప్పటికే ఇంటి నుంచే ఓటు వేసే సదుపాయాన్ని కల్పించింది. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు, వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేయనున్నారు.

**బెంగాల్ తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధం**

బెంగాల్ శాసనసభ ఎన్నికల తొలి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 152 అసెంబ్లీ నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగిన ఎన్నికల ప్రచారం ముగిసింది. 23న రాష్ట్రవ్యాప్తంగా ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కానుంది. మొత్తం 1,478 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 16 జిల్లాల్లో పోలింగ్ జరగనుంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.82 కోట్ల మంది ఓటర్లు ఉండగా మొదటి విడత ఎన్నికల్లో సుమారు 3.5 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 వేలకుపైగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. దాదాపు 10 వేల 361 పోలింగ్ కేంద్రాలను పూర్తిగా మహిళా సిబ్బందితోనే నిర్వహించనున్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం వీల్ చైర్లు, ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, నీడ వంటి వసతులను కల్పించారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు వేలాది పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. 142 అసెంబ్లీ స్థానాలకు రెండో విడత పోలింగ్ ఈ నెల 29న జరగనుంది. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి


# బెదిరింపుల మధ్య చర్చలు సాధ్యంకాదు: ఇరాన్

- చర్చలు తప్ప ఇరాన్‌కు మరోమార్గం లేదుఃట్రంప్
- మళ్ళీ దాడిచేస్తే సరికొత్త ఎత్తుగడలు: ఘాలిబాఫ్
- అనిశ్చితి మధ్య ఇస్లామాబాద్‌కు జె.డి.వాన్స్
- కాల్పుల ఒప్పంద ఉల్లంఘనపై పరస్పర విమర్శలు

టెహ్రాన్: అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం గడువు చివరి దశకు రావడంతో ఆ రెండు దేశాలు ట్రిగ్గర్ పైనే వేళ్ళు పెట్టి శత్రువు వైపే గురిచూస్తున్నాయి. ఐతే మాటలు భిన్నంగా ఉన్నాయి. "ఇంకా సమయం మిగిలే ఉందని, ఇరాన్ భవిష్యత్తును సంపద్వంతం చేసే గొప్ప ఒప్పందం కుదిరే అవకాశాలు ఉన్నాయని, చర్చలకు రావడం తప్ప ఇరాన్‌కు మరో మార్గం లేదని ట్రంప్ అన్నారు. ఇస్లామాబాద్‌కు బృందాన్ని పంపడం తప్ప తనకు వేరే దారి కనిపించలేదన్నారు. ఒప్పందం కుదరకపోతే దాడులు తప్పవని అన్నారు. చర్చల వేదికను ఒక లొంగుబాటు వేదికగా మార్చేసేందుకు అమెరికా ప్రయత్నం చేస్తోందని ఇరాన్ విమర్శించింది. మళ్ళీ దాడులు ప్రారంభిస్తే సరికొత్త ఎత్తుగడ వ్యూహాలతో యుద్ధభూమిలోకి దిగుతామని హెచ్చరించింది. ఈ ఉద్రిక్తతల మధ్య పాకిస్థాన్‌లో చర్చలకు భారీ ఏర్పాట్లు సిద్ధమయ్యాయి. ఐతే "మీరే కాల్పుల విరమణ ఉల్లంఘనకు పాల్పడ్డారు" అంటూ అమెరికా–ఇరాన్ పరస్పరం విమర్శలు చేసుకున్నాయి.ఇరాన్ పార్లమెంటు స్పీకర్, శాంతి చర్చల్లో ప్రధాన ప్రతినిధి మహ్మద్ బాఘెర్ ఘాలిబాఫ్ తెరమీదకు వచ్చి అమెరికాపై విమర్శలు గుప్పిస్తున్నారు. బెదిరింపులమధ్య చర్చలు జరపాలనుకుంటే సాధ్యపడదని, అందుకు ఇరాన్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని స్పష్టం చేశారు. పునరుద్ధరించిన తన యుద్ధోన్మాదాన్ని సమర్థించుకోవాలని ట్రంప్ ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అమెరికాతో పోరాటం తిరిగి ప్రారంభమైతే యుద్ధభూమిలో కొత్త ఎత్తుగడలను ఇరాన్ సిద్ధం చేస్తుందని అన్నారు. అణుశుద్ధి హక్కులను ఇరాన్ వదులుకోబోదన్నారు. అమెరికా–ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం బుధవారంనాటితో ముగుస్తుంది. ఈలోపే మరోసారి చర్చల ద్వారా కాల్పుల విరమణను పొడిగించాలని రెండు దేశాలు ప్రయత్నం చేసినప్పటికీ ట్రంప్ వైఖరివల్ల ఈ చర్చలను ఇరాన్ తిరస్కరించింది. పాకిస్థాన్ తన దౌత్యచర్యలను వదలకుండా కొనసాగిస్తుండగా చైనా ప్రభుత్వం పాకిస్థాన్‌కు పూర్తి మద్దతు తెలియజేస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మంగళవారం రాత్రి నాటికి భిన్న పరిణామాలు కొనసాగుతున్నాయి. జె.డి.వాన్స్ ఇస్లామాబాద్ పర్యటనను పాకిస్థాన్ ధృవీకరించడం, బుధవారంనాటితో కాల్పుల విరమణ గడువు ముగిసిపోవడం, ట్రంప్ ఏం చేస్తారో చూద్దామని గుండె ధైర్యం,ఆత్మవిశ్వాసంతో ఇరాన్ వేచిచూసే వైఖరి మధ్య ప్రపంచదేశాలన్నీ పశ్చిమాసియా పరిస్థితులను గమనిస్తున్నాయి. ఇద్దరు ప్రాంతీయ అధికారులు చెప్పిన సమాచారం ప్రకారం, రెండో విడత ఇస్లామాబాద్‌లో చర్చలకు అమెరికా–ఇరాన్ సానుకూల సంకేతాలు ఇచ్చాయి. ఐతే ఈ వార్తను ఉన్నతస్థాయీ సంప్రదింపుకర్తలెవరూ ధృవీకరించలేదని పి.టి.ఐ వార్తా సంస్థ ప్రకటించింది. ఐతే అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ నాయకత్వంలో ముగ్గురు ప్రతినిధుల బృందం ఇస్లామాబాద్‌కు చేరుకుంటుందని ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. కానీ ఇరాన్ మాత్రం తన పూర్వ వైఖరికే కట్టుబడి చర్చలను తిరస్కరించింది. ఏప్రిల్ ఎనిమిదో తేదీన రెండు దేశాలమధ్యా ప్రారంభమైన కాల్పుల విరమణ ఒప్పందం బుధవారంతో ముగుస్తుంది.ఇరాన్ ఓడరేవులపై అమెరికా దిగ్బంధనం విధించడం, లెబనాన్–ఇజ్రాయెల్ మధ్య పదిరోజుల కాల్పుల విరమణ ఒప్పందం ప్రారంభం కావడం, దాంతో ఇరాన్ గడచిన శుక్రవారం హోర్ముజ్ జలసంధిని తెరవడం,ట్రంప్ దుందుడుకు ప్రకటనవల్ల ఇరాన్ మళ్ళీ హోర్ముజ్ జలసంధిని మూసేయడం, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లో ఇరాన్ నౌకను అమెరికా దళాలు దిగ్బంధనం చేయడం, రెండో విడత చర్చలను ఇరాన్ తిరస్కరించడం వంటి అనేక పరిణామాలు ఈ 14 రోజుల వ్యవధిలో శరవేగంగా సంభవించాయి. అమెరికా కన్నుగప్పి ఇరాన్ సూపర్ ట్యాంకర్ ఒకటి ఇండోనేసియా నుండి తిరిగి సురక్షితంగా ఇరాన్ జలాల్లోకి ప్రవేశించడం ఇప్పుడు అమెరికా దళాలకు కలవరం కలిగిస్తోంది. ఈ నౌక గడచిన మార్చినెలలో ఇండోనేసియా వెళ్ళి చమురును అన్‌లోడ్ చేసి దిగ్బంధనం మధ్య సురక్షితంగా ఇరాన్ చేరింది.

**ఆ ఎనిమిదిమంది స్త్రీలనూ ఉరితీయవద్దు**

ఇదిలా ఉండగా, ఇరాన్ అనేకసార్లు కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిందని ట్రంప్ ట్రూత్ సోషల్ ద్వారా ఆరోపించారు. ఇరాన్‌తో



ఒక ఒప్పందం వీలైనంత త్వరగా జరుగుతుందని తాను ఆశాభావంతో ఉన్నానన్నారు. వారు త్వరగా ఒప్పందం చేసుకోకపోతే తీవ్ర పరిణామాలు సంభవిస్తాయన్నారు. ఎలాంటి ఒప్పందం జరిగినా జరగకపోయినా తాను ఎలాంటి ఒత్తిడులకు గురికావడంలేదని ఆయన స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి మూసివేసినా, తెరిచి ఉంచినా అమెరికాకు ఎలాంటి నష్టం ఉండదని మరోసారి అన్నారు. అదే విధంగా ఇరాన్ ఎనిమిదిమంది మహిళలను ఉరితీయడానికి సిద్ధపడిందని, కానీ వారిని ఉరితీయవద్దని సోషల్ మీడియా వేదికగా ఇరాన్‌కు ట్రంప్ విజ్ఞప్తి చేశారు. వారి ఫోటోలను కూడా ట్రంప్ విడుదల చేశారు. ఇజ్రాయెల్ అనుకూల అమెరికా కార్యకర్త ఐయాల్ యాకోబీ ఈ ఎనిమిదిమంది మహిళలను ఉరితీస్తున్న విషయాన్ని ప్రకటించారు. ఆమె పోస్టును ట్రంప్ తన సోషల్ మీడియాకు జత చేశారు. వారిని ఉరితీయకుండా వదిలిపెడితే తాను ఇరాన్ పాలకులను మెచ్చుకుంటానన్నారు.

# బస్సులు బంద్

(3వ పేజీ తరువాయి)

పేర్కొన్నారు. కార్మిక జెఎసి తమ డిమాండ్లను ప్రభుత్వం పూర్తిగా పరిగణలోకి తీసుకోలేదని విమర్శించింది. ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశంతో పాటు హైదరాబాద్ డిపోల్లోని ఉద్యోగులను జిల్లాలకు బదిలీ చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది సంస్థ ఉద్యోగులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌టిసిని నిర్వీర్యం చేసి ప్రైవేటీకరణకు దారి తీసే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని ఆరోపించారు. కార్మికులను భయభ్రాంతులకు గురిచేసే పరిస్థితులు సృష్టిస్తున్నారని పేర్కొంటూ, ఉద్యోగ భద్రతపై స్పష్టత అవసరమని జెఎసి డిమాండ్ చేసింది. గతంలో ఏర్పాటైన కమిటీలను ప్రభుత్వం కాలయాపన కోసం మాత్రమే ఉపయోగించిందని జెఎసి విమర్శించింది. మెట్రో రైల్ వ్యవస్థను ప్రభుత్వం తక్షణమే విలీనం చేసినప్పటికీ ఆర్‌టిసి విషయంలో అదే విధానం ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించింది. ఈ సమ్మెకు అన్ని సంఘాలు మద్దతు తెలిపినట్లు జెఎసి పేర్కొంది. సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేసిన నేతలు, కార్మికులు ఎవరి ఒత్తిడులకు తలొగ్గవద్దని, సమ్మెలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు..**

ఏప్రిల్ 22 బుధవారం ఉదయం నుంచి ఆర్‌టిసి సమ్మె ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా బస్సులు నిలిచిపోనున్నాయి. ఫలితంగా ప్రతిరోజూ ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించే దాదాపు 65 లక్షల మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. ముఖ్యంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో సామాన్య ప్రజలు, విద్యార్థులు ప్రైవేట్ వాహనాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడనుంది.

**ఆర్‌టిసి డిపోల్లో ప్రైవేట్ డ్రైవర్లు, సర్వీసులు..**

తెలంగాణ ఆర్‌టిసి సమ్మె నేపథ్యంలో ప్రజా రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతున్నందున రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జిహెచ్‌ఎంసి పరిధిలో బస్సు సర్వీసులకు ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ వాహనాలను వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ఆర్‌టిసి డిపోల్లో ప్రైవేట్ డ్రైవర్లు, ప్రైవేట్ వాహనాలను వినియోగించి ప్రజా రవాణా సేవలను కొనసాగించాలని నిర్ణయించింది. సమ్మె కారణంగా ప్రయాణికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తగ్గించేందుకు తాత్కాలిక ఏర్పాటుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. నగరంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా రవాణా అంతరాయం లేకుండా సేవలు కొనసాగించేందుకు చర్యలు చేపడుతున్నారు.

# తెలంగాణ స్వర్గధామం

(3వ పేజీ తరువాయి)

సుస్థిర మౌలిక సదుపాయాల కల్పన, ఎలక్ట్రిక్ మొబిలిటీ, ఆఫ్‌షోర్ విండ క్లైమేట్ ఇన్నోవేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థలలో 'నార్వే' గ్లోబల్ లీడర్ గా కొనసాగుతోందని కొనియాడారు. ఏఐ, క్లైమేట్ టెక్, హెల్త్ టెక్, డీప్ టెక్, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ పబ్లిక్ సర్వీసెస్, గ్రీన్ హైడ్రోజన్, బ్యాటరీ టెక్నాలజీ, ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్లీన్ ఎనర్జీ, ఇండస్ట్రియల్ డీ కార్బనైజేషన్, గ్రీన్ మ్యాన్యుఫ్యాక్చరింగ్, డిజిటల్ హెల్త్, బయోటెక్, మెడికల్ డివైజెస్ తదితర అంశాల్లో కలిసే పని చేసేందుకు గల అవకాశాలపై 'కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్'ను సిద్ధం చేసుకుని ముందుకెళ్తామన్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా 'తెలంగాణ – నార్వే వర్కింగ్ గ్రూప్'ను ఏర్పాటు చేద్దామని మంత్రి శ్రీధర్ బాబు ప్రతిపాదించారు. 'తెలంగాణ లాంటి ప్రగతిశీల రాష్ట్రాలతో కలిసి పనిచేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. రాబోయే రోజుల్లో ద్వైపాక్షిక సంబంధాలు మరింత మెరుగుపడేలా అడుగు ముందుకేస్తాం. వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం' అని నార్వే రాయబారి మే ఎలిన్ స్టెనర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నార్వే ఇన్నోవేషన్ హెడ బ్యోర్న్ ఐవర్సన్, ఫస్ట్ సెక్రటరీ సిల్జే క్రిస్టీన్ ఆండర్సన్, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ సిరి వెసెత్ మెలింగ్ తదితరులు పాల్గొన్నారు.

**అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్'లో పెట్టుబడుల్ని ప్రోత్సహించండి**

అడ్వాన్స్‌డ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ రంగంలో పరిశ్రమల ఏర్పాటుకు దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ అత్యంత అనుకూలమని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఈ రంగంలో పెట్టుబడులు పెట్టేలా ఇటలీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలని ఆ దేశ ప్రతినిధులను ఆయన కోరారు. ఇటలీ దేశ రాయబారి 'ఆంటోనియో బార్టోలి' నేతృత్వంలోని ప్రతినిధుల బృందం మంగళవారం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబుతో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. ఈ సందర్భంగా.... ఏయే రంగాల్లో 'తెలంగాణ ఇటలీ' కలిసి పని చేసేందుకు అవకాశాలున్నాయనే అంశంపై సుదీర్ఘంగా చర్చించారు.

# నిషేధం ఎత్తివేత

(3వ పేజీ తరువాయి)

అవకాశాలను కల్పించనున్నారు. మే 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తులను పరిశీలించి, 25 నుంచి 31 వరకు ఉత్తర్వులు జారీ చేయనున్నారు. అనంతరం మూడు రోజుల్లో ఉద్యోగి రిలీవ్ అయినట్టుగానే పరిగణిస్తారు. ఆ తర్వాత జూన్ 1 నుంచి ఉద్యోగుల సాధారణ బదిలీలపై మళ్లీ నిషేధం అమలులోకి వస్తుందని ఆర్థిక శాఖ ఉత్తర్వులలో స్పష్టం చేసింది. జనగణన విధుల్లో ఉన్న వారికి బదిలీల మార్గదర్శకాలు వర్తించబోవని ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా బదిలీల ప్రక్రియ చేపడతారు. అవసరమైతే హార్డ్‌షిప్ పోస్టులకు లాటరీ విధానం అమలు చేయనున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణలో రాష్ట్రపతి ఉత్తర్వులకు లోబడి బదిలీల ప్రక్రియను చేపట్టనున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోనున్నట్లు కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. వెబ్ కౌన్సిలింగ్ ద్వారా ఉద్యోగుల ఆప్షన్లను స్వీకరించి, బదిలీలు చేయనున్నారు.

**మార్గదర్శకాలు ఇవే**

ప్రస్తుతం అప్రాధాన్యత పోస్టుల్లో ఉన్న ఉద్యోగులను, ప్రాధాన్యత స్థానంలోకి బదిలీ చేయాలని, మారుమూల ప్రాంతాల్లో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న వారికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలని మార్గదర్శకాల్లో పొందుపర్చారు. భార్యాభర్తల కేటగిరీలో మూడేళ్ల నిబంధన వర్తించబోదని స్పష్టం చేశారు. విద్యాశాఖ, పోలీస్, వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రిజిస్ట్రేషన్లు, రవాణా, అటవీ శాఖ విడివిడిగా ప్రత్యేక మార్గదర్శకాలను విడుదల చేస్తాయి. గతేడాది డిసెంబర్ 31 నాటికి ఒకే చోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని ఆర్థిక శాఖ నిర్ణయించింది. వచ్చే ఏడాది మే 31వ తేదీ లోపు ఉద్యోగ విరమణ చేసే వారు స్వచ్ఛందంగా కోరుకుంటే తప్ప బదిలీలు ఉండబోవు. ఒకే కేడర్‌లో 40 శాతానికి మించి ఉద్యోగులను బదిలీ చేయకూడదని నిబంధన విధించారు. బదిలీలలో పలు కేటగిరీలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆ మార్గదర్శకాల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది. భార్యాభర్తలు, వితంతువు, వచ్చే ఏడాది మే 31 పదవీ విరమణ పొందేవారు, 70శాతానికి మించి వైకల్యం ఉన్నవారు, మానసిక వ్యాధులతో బాధపడుతున్న పిల్లలు ఉన్నవారు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, మూత్రపిండాలు, కాలేయ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, ఎముకల టీబీ ఉన్న ఉద్యోగులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు.

## రాజకీయ పార్టీలను, ప్రజలను మోదీ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు!

**ప్రభుత్వ యంత్రాంగాన్ని, కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు : ఖర్గే**



**చెన్నై :** ప్రధాని మోదీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని, కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాజకీయ పార్టీలను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. చెన్నైలో ఎఐసిసి ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కెసి వేణుగోపాల్‌తో కలిసి మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ బిజెపితో ఎఐఎడిఎంకె పొత్తును విమర్శించారు. ఈ సందర్భంగా మోదీ 'ఉగ్రవాది' అని అభివర్ణించారు. ఎందురు అలా అన్నారని ఖర్గేను విలేకరులు ప్రశ్నించగా, ప్రధానమంత్రి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడం తన ఉద్దేశమని కాంగ్రెస్ అధినేత పేర్కొన్నారు. 'ఆయన ప్రజలను, రాజకీయ పార్టీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఆయనను నేను ఎప్పుడూ (అక్షరాలా) ఉగ్రవాది అని అనలేదు. ఇలా భయభ్రాంతులకు గురిచేయడం అంటే... ఆయన తన అధికారాన్ని, ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష పార్టీలను దూషిస్తూ, వారిని బలహీనపరుస్తున్నారు' అని ఖర్గే అన్నారు. ఎన్నికల సంఘం బిజెపి కార్యాలయానికి అనుబంధంగా మారిందని కాంగ్రెస్ అధినేత ఆరోపించారు. ఎన్నికల ప్రచారపు చివరి దశలో ప్రధానమంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఖర్గే ఆరోపించారు. రాజకీయ కార్యకర్తలను భయపెట్టే సాధనాలుగా సిబిఐ, ఇడి, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర సంస్థలను మోహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. లోక్‌సభను విస్తరించడం ద్వారా మహిళా రిజర్వేషన్‌కు వీలు కల్పిస్తూ, నియోజకవర్గాల పునర్విభజనను దానికి ముడిపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుపై కూడా ఖర్గే కేంద్రాన్ని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రతిపక్షాలు ఓడించాయని చెబుతూ ప్రధానమంత్రి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాస్తవానికి అది 2023లోనే ఏకగ్రీవ మద్దతుతో ఆమోదం పొందిందని ఆయన గుర్తు చేశారు. 'ఆయన నిజంగా దానిని అమలు చేయాలనుకుంటే, ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించవచ్చు. ఆయన ఎందుకు అలా చేయడం లేదు? అని ఖర్గే ప్రశ్నించారు. జనాభా నియంత్రణలో విజయం సాధించినందుకు, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలోని ప్రగతిశీల రాష్ట్రాలను ప్రభుత్వ పునర్విభజన ప్రణాళిక శిక్షిస్తుందని ఆయన హెచ్చరించారు. దక్షిణ భారత రాష్ట్రాలు, ఈశాన్య రాష్ట్రాలు, ప్రగతిశీల రాష్ట్రాల ప్రజాస్వామ్య హక్కులను హరించాలనేది వారి ఉద్దేశమని, ఈ రాష్ట్రాలు సాధించిన ప్రగతికి మోదీ, షా వాటిని శిక్షించాలని చూస్తున్నారని మండిపడ్డారు. డిఎంకె–కాంగ్రెస్ కూటమి బలాన్ని పునరుద్ఘాటిస్తూ, ఖర్గే, వేణుగోపాల్ ఇద్దరూ రాహుల్ గాంధీ, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ల మధ్య విభేదాలున్నాయన్న వార్తలను తోసిపుచ్చారు. వారిద్దరినీ 'సోదరుల వంటివారు'గా అభివర్ణించారు. మహిళలు, వయోవృద్ధులకు నెలకు రూ. 2,000 సహాయం, కుటుంబాలకు ఆహార భద్రత కోసం నెలకు రూ. 2,500, అలాగే 300 రోజుల్లోగా అన్ని ప్రభుత్వ ఖాళీలను భర్తీ చేస్తామన్న హామీతో సహా, రాష్ట్రానికి కూటమి ఇచ్చిన కీలక హామీలను ఖర్గే పునరుద్ఘాటించారు. ప్రధానమంత్రి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పేర్కొంటూ, దానిని గమనించడంలో విఫలమైన ఎన్నికల సంఘాన్ని ఆయన విమర్శించారు. ఆ సంఘం బిజెపి కార్యాలయానికి పొడిగింపులా వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.


## 'మహిళా కోటా' బిల్లు డిమాండ్‌పై...
# మోదీ ప్రభుత్వం ఇన్నాళ్లూ నిద్రపోయింది

- కాంగ్రెస్ ఎద్దేవా • గతంలో ప్రధాని మోదీకి సోనియాగాంధీ, రాహుల్ రాసిన లేఖలను గుర్తుచేసుకున్న జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ :** మహిళా రిజర్వేషన్ల చట్టాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సోనియాగాంధీ, రాహుల్ గాంధీ గతంలో రాసిన లేఖలను కాంగ్రెస్ మంగళవారం జ్ఞప్తికి తెచ్చుకుంది. ఈ డిమాండ్‌పై మోదీ ప్రభుత్వం ఇన్నాళ్లూ 'నిద్రపోయింది' అని, ఇప్పుడు నియోజకవర్గాల పునర్విభజనకు ముడిపెట్టి ఆలస్యం చేసిందని ధ్వజమెత్తింది. 2017లో అప్పటి కాంగ్రెస్ అధ్యక్షురాలి హోదాలో సోనియాగాంధీ మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసం ప్రధాని నరేంద్రమోదీకి ఒక లేఖ రాశారని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ గుర్తుచేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వైఖరి దృఢంగా, మార్పులేనిదిగా ఉందని, మోదీ ప్రభుత్వమే ఈ డిమాండ్‌పై 'నిద్రపోయి' ఆ తర్వాత డీలిమిటేషన్‌కు ముడిపెట్టి ఆలస్యం చేయడానికి ప్రయత్నించిందని ప్రధానికి గాంధీ రాసిన లేఖను తన 'ఎక్స్' పోస్ట్‌లో జైరామ్ రమేశ్ పేర్కొంటూ ప్రధానికి గాంధీ రాసిన లేఖను పంచుకున్నారు. 'లోక్‌సభలో మీకున్న మెజార్టీని సద్వినియోగం చేసుకుని, ఇప్పుడు దిగువసభలో కూడా మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదింపజేయాలని మీకు సిఫార్సు చేస్తూ ఈ లేఖను రాస్తున్నాను. మహిళా సాధికారత దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు కానున్న ఈ చట్టానికి కాంగ్రెస్‌పార్టీ ఎల్లప్పుడూ మద్దతు ఇచ్చింది. ఇకపైనా ఇస్తూనే ఉంటుంది. 'నిజానికి పంచాయతీలు, నగర పాలికలలో మహిళలకు హక్కులు కల్పించాలనే నిబంధనను రాజ్యాంగ సవరణ బిల్లులలో తొలుత ప్రతిపాదించింది కాంగ్రెస్ పార్టీ దివంగత నాయకుడు రాజీవ్‌గాంధీనే అని మీకు గుర్తుండే ఉంటుంది. అయితే 1989లో రాజ్యసభలో ప్రతిపక్ష పార్టీలు దీనిని అడ్డుకున్నప్పటికీ, ఆ తర్వాత 1993లో పార్లమెంట్ ఉభయసభలు దీనిని ఆమోదించి 74వ సవరణగా ఆమోదించాయి' అని సోనియాగాంధీ అన్నారు. మరో పోస్టులో మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాహుల్‌గాంధీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా 2018 జులై 16న ప్రధానమంత్రికి లేఖ రాశారని జైరామ్ రమేశ్ పేర్కొన్నారు. 'ఎనిమిదేళ్ల తర్వాత కూడా డీలిమిటేషన్‌కు ముడిపెట్టి రిజర్వేషన్ల అమలును ఆలస్యం చేయాలని ఉవ్విళ్లూరుతున్న ప్రధానమంత్రి ఈ డిమాండ్‌పై ఇంకా స్పందించలేదు' అని జైరామ్ రమేశ్ అన్నారు.2018లో రాహుల్ గాంధీ ప్రధానమంత్రికి రాసిన లేఖను కూడా జైరామ్ రమేశ్ పంచుకున్నారు. ఆ లేఖలో, అప్పటి పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందేందుకు మద్దతు ఇవ్వాలని ఆయన కోరారు. మీకు తెలిసినట్లుగా 2010 మార్చి 9న రాజ్యసభ ఆమోదించిన మహిళా రిజర్వేషన్ బిల్లు గత ఎనిమిదేళ్లుగాఏదో ఒక సాకుతో నిలిచిపోయింది. బిజెపి మద్దతుతో ఈ బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందినప్పుడు అప్పటి ప్రతిపక్షనేత అరుణ్ జైట్లీ ఈ బిల్లు ఆమోదాన్ని 'చరిత్రాత్మకమైనది', 'మహత్తరమైనది' అని ఆయన అభివర్ణించారు. 'అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లు పట్ల తన నిబద్ధతలో స్థిరంగా ఉండగా, 2014 మేనిఫెస్టోలో ఇది తమ కీలక వాగ్దానాలలో ఒకటి అయినప్పటికీ బిజెపి పునరాలోచనలో పడినట్లు కనిపిస్తోంది' అని రాహుల్‌గాంధీ అన్నారు. 'ప్రధానమంత్రి గారూ మీ అనేక బహిరంగ సభలలో మహిళా సాధికారత పట్ల, ప్రజా జీవితంలో వారిని మరింత అర్థవంతంగా, భాగస్వాములను చేయడంపట్ల మీకున్న అభిరుచి గురించి మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి బేషరతుగా మద్దతు ఇవ్వడం కంటే మహిళల అభ్యున్నతి పట్ల మీ నిబద్ధతను ప్రదర్శించడానికి ఇంతకంటే మంచి సమయం ఏముంటుంది?. ఇంక ఏమాత్రం ఆలస్యంజరిగినా, వచ్చే సార్వత్రిక ఎన్నికలకు ముందు దీనిని అమలు చేయడం అసాధ్యం అవుతుంది. మన మహిళలకు సాధికారత కల్పించే విషయంలో మనందరం ఐక్యంగా నిలబడదాం. పార్టీ రాజకీయాలకు అతీతంగా ఎదుగుదాం. మార్పునకు సమయం ఆసన్నమైందని భారతదేశానికి సందేశం పంపుదాం' అని రాహుల్‌గాంధీ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మహిళా కోటా ముసుగులో నరేంద్రమోదీ ప్రభుత్వం చేపట్టిన నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనను కొట్టేవేయడం బుల్డోజరు రాజకీయాల ఓటమి అని , కేంద్రం అజెండా మహిళా రిజర్వేషన్ కాదని, ప్రధానమంత్రి నరేంద్రమోదీనేనని కాంగ్రెస్ సోమవారం పేర్కొంది.పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో లేదా, మే నెలలో ఒక బిల్లును ప్రవేశపెట్టి , ప్రస్తుత లోక్‌సభ సభ్యుల సంఖ్యలో మహిళా కోటాను కేంద్రం తక్షణమే అమలుచేయాలని ప్రతిపక్ష పార్టీ డిమాండ్ చేసింది. మహిళా కోటాను అమలుచేయడానికి, లోక్‌సభ సీట్లను 816కు పెంచడానికి ఉద్దేశించిన ప్రభుత్వ రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు శుక్రవారం లోక్‌సభలో ఓడిపోయిన కొద్ది రోజుల తర్వాత కాంగ్రెస్ ఈ ప్రకటనలు చేసింది.



## ఈశాన్యంలో భూ ప్రకంపనలు



**ఇంఫాల్/ షిల్లాంగ్ :** భూకంపం ఈశాన్య రాష్ట్రాలను వణికించింది. మంగళవారం ఉదయం మణిపూర్ కేంద్రంగా 5.2 తీవ్రతతో సంభవించిన భూకంపం సంభవించింది. ఆ భూకంపం ప్రభావంతో మణిపూర్‌తోపాటు నాగాలాండ్, అసోం, మేఘాలయ, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాల్లోనూ భూమి కంపించింది. తెల్లవారుజామున ప్రజలంతా నిద్రలో ఉండగా ఈ ఘటన జరగడంతో జనం భయాందోళనలకు గురై ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సిఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. మంగళవారం ఉదయం 5:59 గంటలకు ఈ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 5.2గా నమోదైంది. భూకంప కేంద్రం మణిపూర్‌లోని కామ్‌జాంగ్ జిల్లాలో భూమికి 62 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఈ భూకంపం కారణంగా ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరిగినట్లు సమాచారం లేదని స్థానిక అధికారులు వెల్లడించారు. దాంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలావుంటే ఈశాన్య ప్రాంతంలో తరచూ భూకంపాలు సంభవిస్తుండటంతో స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిస్థితిని సమీక్షిస్తూ సహాయక బృందాలను అప్రమత్తం చేశారు.

## తమిళనాడు ద్రోహులకు స్టాలిన్ హెచ్చరిక



**చెన్నై :** తమిళనాడుకు ద్రోహం చేసేవారికి, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవాలని చూసేవారికి తాను ఒక 'ప్రమాదం' అవుతానని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ అన్నారు. అలాగే, నియోజకవర్గాల పునర్విభజన కోసం కేంద్రం చేస్తున్న తీవ్ర ప్రయత్నాలు తమిళనాడు వంటి అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రాలను శిక్షించడానికే అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు కేవలం రెండు రోజుల సమయం మిగిలి ఉండగా, డిఎంకె అధ్యక్షుడైన స్టాలిన్... ప్రతిపక్షాలు తనపై చేసిన ఒక వ్యాఖ్యను గుర్తుచేశారు. తాను 'కలైంజర్ (దివంగత ముఖ్యమంత్రి ఎం. కరుణానిధి) కంటే ఎక్కువ ప్రమాదకారిని' అని ప్రతిపక్షాలు ఆరోపించాయని ప్రస్తావిస్తూ, కరుణానిధితో తనను ఎప్పటికీ పోల్చలేమన్నారు. కరుణానిధి తనకు కేవలం తండ్రి మాత్రమే కాదని, ఒక స్ఫూర్తిదాయక నాయకుడని ఆయన పేర్కొన్నారు. '2021 అసెంబ్లీ ఎన్నికల సమయంలో, ప్రజలు 'స్టాలిన్ కలైంజర్ కంటే ఎక్కువ ప్రమాదకారి' అని అన్నారు. నన్ను ఆయనతో ఎప్పటికీ పోల్చలేరు. నేను ఆయన్ను 'తండ్రి' అని పిలవడం కంటే, 'నాయకుడు' అని సంబోధించడమే ఎక్కువ సార్లు చేశాను. వారు అలా అన్నప్పుడు నాకు ఒక విషయం గుర్తుకు వస్తుంది. తమిళనాడును మోసం చేయాలని, దాని అభివృద్ధిని అడ్డుకోవాలని చూసేవారికి నేను ఎల్లప్పుడూ ఒక ప్రమాదంగానే ఉంటాను' అని ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో పోస్ట్ చేసిన ఒక వీడియో సందేశంలో తెలిపారు. ఈ విషయంలో తాను కలైంజర్ కంటే ఒక అడుగు ముందే ఉంటే, అది నాకు గర్వకారణం కాదా? అని ఆయన ప్రశ్నించారు. 'గత ఐదేళ్లుగా, ప్రజలు ముఖ్యమంత్రిగా నాపై నమ్మకం ఉంచారు. సంక్షేమ సహాయాన్ని అందించడం ద్వారా, అలాగే రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటం ద్వారా నేను ఆ బాధ్యతకు తగినట్లుగా నిలిచాను' అని స్టాలిన్ అన్నారు. అన్నింటికంటే ముఖ్యంగా, తమిళనాడుకు ఎప్పుడూ ద్రోహం చేసే కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నేను తమిళ ప్రజల పక్షాన పోరాడానని ఇప్పటికీ గర్వంగా చెప్పగలనన్నారు. సామాజిక న్యాయంతో కూడిన అభివృద్ధియే నా ప్రధాన లక్ష్యం ఆయన పేర్కొన్నారు. తన డిఎంకె ప్రభుత్వం ప్రారంభించిన అనేక సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. పరిశ్రమలు, వ్యవసాయం, విద్యుత్‌తో సహా వివిధ రంగాలలో తమిళనాడును అనేక ఇతర రాష్ట్రాల కంటే ఉన్నత స్థానంలో నిలిపానని ఆయన తెలిపారు. ఫలితంగా, తమిళనాడు ఆర్థిక వృద్ధి 11.19 శాతమనే రెండంకెల స్థాయిని తాకింది; ఈ స్థాయిని మరే ఇతర రాష్ట్రం చేరుకోలేకపోయిందని చెప్పారు. తాము మరింత ఉన్నత శిఖరాలను అధిరోహిస్తామనే నమ్మకం ఉందని స్పష్టం చేశారు. పార్లమెంటులో వీగిపోయిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై స్పందిస్తూ 'పారిశ్రామిక అభివృద్ధిలో అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రంగా మమ్మల్ని శిక్షించడానికి, అలాగే జనాభా పెరుగుదలను సమర్థవంతంగా నియంత్రిస్తున్న మమ్మల్ని దెబ్బతీయడానికి ఉద్దేశపూర్వకంగానే ఈ బిల్లును తీసుకువచ్చారు. ఎఐఎడిఎంకె నేతృత్వంలోని ఎన్‌డిఎ కూటమి ఎన్నికల్లో గెలిస్తే, 'ఘోరకృత్యాలు' చోటుచేసుకుంటాయని ఆయన హెచ్చరించారు. జిఎంకెను 'హిందూ వ్యతిరేక పార్టీ'గా ముద్రవేయడంపై స్టాలిన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు; తన పార్టీ ఎప్పుడూ హిందువులకు వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. 'ఇటువంటి అసత్య ప్రచారాన్ని వ్యాప్తి చేసేవారికి నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే: గత 60 ఏళ్లుగా ద్రవిడ పార్టీల పాలనలో ఉన్న తమిళనాడు రాష్ట్రంలోనే, భారతదేశంలోనే అత్యధిక సంఖ్యలో దేవాలయాలు ఉన్నాయి. నేడు, ఎఐఎడిఎంకె అనే బానిస పార్టీకి యజమానిగా బిజెపి వ్యవహరిస్తోంది అని ఆయన పేర్కొన్నారు. డిఎంకె ఉనికిలో ఉన్నంత కాలం, తమిళనాడులో బిజెపి గానీ, వారి 'క్రూరమైన, ప్రజా వ్యతిరేక సిద్ధాంతం' గానీ విజయం సాధించలేకపోయాయని చరిత్ర చెబుతుందని ఆయన అన్నారు. తమిళనాడును ఒక సుసంపన్న రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు, రాబోయే ఐదేళ్ల పాటు డిఎంకె చేస్తున్న పనులు నిరాటంకంగా కొనసాగాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బిజెపిని ఎవరూ కోరుకోవడం లేదు

**నాలుగోసారి టిఎంసి అధికారంలోకి వస్తది : మమతా బెనర్జీ**



**హల్దియా :** రాష్ట్రంలో టిఎంసి వరుసగా నాలుగోసారి అధికారంలోకి వస్తుందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. బిజెపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడాన్ని ఎవరూ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. పూర్వ మేదినీపూర్ జిల్లాలోని హల్దియాలో మంగళవారం జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రసంగిస్తూ, కేంద్రంలోని బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకం కావాలని బెనర్జీ పిలుపునిచ్చారు. 'ఈసారి కూడా పశ్చిమ బెంగాల్‌లో బిజెపి ఎన్నికల్లో గెలవదు. తృణమూల్ కాంగ్రెస్ మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది. 2026లోనే ఢిల్లీ నుంచి కూడా బిజెపిని గద్దె దింపుతాం' అని బెనర్జీ స్పష్టం చేశారు. గత నెల రోజులుగా తాను పశ్చిమ బెంగాల్‌లో విస్తృతంగా పర్యటిస్తున్నానని, ఈ సమయంలో ప్రజలు ఏమి కోరుకుంటున్నారో నేను అర్థం చేసుకున్నాను; బిజెపిని ఎవరూ కోరుకోవడం లేదనేది స్పష్టమైంది' అని టిఎంసి అధినేత్రి అన్నారు. ఆర్థిక అవకతవకలు, ఇతర సమస్యలపై టిఎంసి ప్రభుత్వంపై బిజెపి ఛార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా విమర్శిస్తూ, హల్దియా డాక్ కాంప్లెక్స్, దానికి ఆనుకుని ఉన్న పారిశ్రామిక ప్రాంతంలో 'కట్‌మనీ (కమీషన్) తీసుకున్నందుకు' తాను కూడా కాషాయ పార్టీపై చార్జ్‌షీట్ దాఖలు చేస్తున్నానని ముఖ్యమంత్రి అన్నారు. 'మీరు టిఎంసిపై చార్జ్‌షీట్ ఇచ్చారు; నేను కూడా బిజెపిపై ఒకటి దాఖలు చేస్తున్నాను''అని బెనర్జీ అన్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా మార్చి 28న టిఎంసి ప్రభుత్వంపై అవినీతి, శాంతిభద్రతల క్షీణత, చొరబాట్లకు సహకరిస్తోందంటూ ఒక చార్జ్‌షీట్‌ను ఆవిష్కరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికలు జరగనున్న మొత్తం 294 స్థానాల్లో తానే బిజెపి అభ్యర్థినని ఇటీవల ఒక ర్యాలీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పడాన్ని కూడా బెనర్జీ విమర్శించారు. అలా జరగాలంటే మీరు ముందు ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేయాలని చురకలంటించారు. అసెంబ్లీ ఎన్నికలు ఏప్రిల్ 23, ఏప్రిల్ 29 తేదీలలో రెండు దశల్లో జరగనున్నాయి. మే 4న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

## జెడియు శాసనసభాపక్ష నేతగా శ్రావణ్‌కుమార్



**పాట్నా:** బిహార్ మాజీ మంత్రి శ్రా వణ్ కుమార్ జెడి యు శాసన సభ పక్ష నాయకుడిగా నియమితులయ్యా రు. ఈ మేరకు రా ష్ట్ర శాసనసభ సచివాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. శాసనసభాపక్ష నాయకుడి విషయమై నిర్ణయం తీసుకునే అధికారాన్ని పార్టీ శాసనసభ్యులు, జాతీయ అధ్యక్షుడు నితీష్ కుమార్‌కు అప్పగించిన మరిసటి రోజే శ్రావణ్‌కుమార్ నియామకం జరిగింది. జెడియు అధినేత, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలలతో బిహార్ ముఖ్యమంత్రి అధికారిక నివాసమైన 1, అన్నీ మార్గ్ వద్ద సమావేశం నిర్వహించారు. జెడియు అధినేతకు అత్యంత సన్నిహితుడైన శ్రావణ్ కుమార్, నలంద నియోజకవర్గం నుండి ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఈ నియోజకవర్గం, మాజీ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ స్వస్థలమైన నలంద జిల్లా పరిధిలోనే ఉంది. ప్రభావవంతమైన ఒబిసి వర్గమైన 'కుర్మీ' సామాజిక వర్గానికి చెందిన ఈ 68 ఏళ్ల నాయకుడు— ప్రస్తుతం రాజ్యసభకు వెళ్లిన తన రాజకీయ గురువు (నితీష్ కుమార్) నేతృత్వంలోని ప్రభుత్వాలలో గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, రవాణా వంటి కీలక శాఖలను నిర్వహించారు.

## 26 మందికి 100% ఎన్‌టిఎ స్కోర్




**న్యూఢిల్లీ :** ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష జెఇఇ మెయిన్ 2026 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) సోమవారం రాత్రి విడుదల చేసింది. ఫలితాల్లో 26 మంది అభ్యర్థులు వందకు వంద మార్కులు సాధించారు. 2025లో ఇరవైనాలుగు మంది అభ్యర్థులు ఈ ఘనతను సాధించారు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఈ కీలక పరీక్ష మొదటి ఎడిషన్‌లో 13 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు కాగా, ఏప్రిల్‌లో జరిగిన రెండవ ఎడిషన్‌లో 10 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలోనూ ఎనిమిది లక్షలకు పైగా ఉమ్మడి అభ్యర్థులు హాజరయ్యారు. 100 ఎన్‌టిఎ స్కోరు సాధించిన అభ్యర్థులలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుండి ఐదుగురు చొప్పున, ఆ తర్వాత రాజస్థాన్ నుండి నలుగురు, ఢిల్లీ నుండి ముగ్గురు, మహారాష్ట్ర, హర్యానా నుండి ఇద్దరు చొప్పున ఉన్నారని అధికారులు సోమవారం తెలిపారు. చండీగఢ్, బిహార్, తమిళనాడు, ఒడిశా, గుజరాత్ నుండి ఒక్కొక్క అభ్యర్థి ఈ ఘనతను సాధించారు. ఈ 26 మంది అభ్యర్థులూ పురుషులే. అధికారుల తెలిపిన వివరాల ప్రకారం... ఎన్‌టిఎ స్కోరు అనేది పొందిన మార్కుల శాతం కాదు, అది సాధారణీకరించిన స్కోర్లు. 'ఎన్‌టిఎ స్కోర్‌లు అనేవి బహుళషిఫ్ట్ పేపర్లలోని సాధారణీకరించబడిన స్కోర్‌లు. ఒక షిఫ్ట్‌లో పరీక్షకు హాజరైన వారందరి సాపేక్ష పనితీరుపై ఆధారపడి ఉంటాయి. పొందిన మార్కులను ప్రతి షిఫ్ట్ పరీక్షార్థులకు 100 నుండి 0 వరకు ఉండే స్కేల్‌లోకి మార్చబడతాయి' అని ఒక సీనియర్ అధికారి వివరించారు. గత సంవత్సరాలలో కనిపించిన సరళిని కొనసాగిస్తూ, 100 పర్సంటైల్ స్కోరర్లలో షెడ్యూల్డ్ కులాలు (ఎస్‌సి) లేదా షెడ్యూల్డ్ తెగల (ఎస్‌టి) వర్గాల నుండి ఏ అభ్యర్థి కూడా లేరు. ఈ సంవత్సరం, జనరల్ కేటగిరీ నుండి 96,873 మంది అభ్యర్థులు జెఇఇ (అడ్వాన్స్‌డ్)కి అర్హత సాధించగా, ఆ తర్వాత 67,597 మంది ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) అభ్యర్థులు, 37,522 మంది ఎస్‌సి, 25,009 మంది ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్), 18,790 మంది ఎస్‌టి అభ్యర్థులు అర్హత సాధించారు. దీంతో మొత్తం 2,50,182 మందికి చేరింది. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్ అనేది భారతదేశంలోనే అతిపెద్ద ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్ష. అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లకు ముఖద్వారంగా పనిచేస్తుంది.

### ఉత్తర బెంగాల్‌లో పూర్తి ఆధిక్యంకోసం..
## బిజెపి, టిఎంసి వ్యూహ ప్రతివ్యూహాలు

**కోల్‌కతా :** పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో రేపు (ఏప్రిల్ 23న) 54 స్థానాలు కలిగిన ఉత్తర బెంగాల్ మొదటి దశ పోలింగ్ కీలక పోరాట క్షేత్రంగా మారనుంది. మొదటి దశ పోలింగ్‌లోని 54 అసెంబ్లీ స్థానాలలో పూర్తి ఆధిక్యాన్ని నిలబెట్టుకోవాలని భారతీయ జనతాపార్టీ (బిజెపి) ఒకవైపు, అధికార తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) మరోవైపు అమీతుమీ తేల్చుకునేందుకు సర్వశక్తులు ఒడ్డుతూ వ్యూహప్రతివ్యూహాలు రచిస్తున్నాయి. రాష్ట్రంలో తమ ఎదుగుదలకు దోహదపడిన ఈ ప్రాంతాన్ని నిలబెట్టుకోవాలని బిజెపి శతవిధాలుగా ప్రయత్నిస్తుండగా, మారుతున్న రాజకీయ సమీకరణాల మధ్య కోల్పోయిన పట్టును తిరిగి నిలబెట్టుకోవాలని తృణమూల్ కాంగ్రెస్ తహతహలాడుతోంది. మొత్తం 54 స్థానాలకు ఏప్రిల్ 23న (గురువారం) మొదటి దశ పోలింగ్ జరుగబోతోంది. దక్షిణ బెంగాల్‌లో టిఎంసి ఆధిపత్యాన్ని ఎదుర్కోవడానికి బిజెపికి ఉత్తర బెంగాల్ అత్యంత ఆచరణీయమైన మార్గంగా మిగిలింది. కాషాయ ప్రభంజనాన్ని అడ్డుకోవాలన్నా, ప్రతిపక్షందూకుడును నిరాకరించాలన్నా అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి ఇక్కడ కోలుకోవడం అనివార్యం అవుతోంది. ఈ ప్రాంతం ఒక సంక్లిష్టమైన ఎన్నికల చిత్రాన్ని ఆవిష్కరిస్తోంది. ఇక్కడ పాత విధేయతలు ఒత్తిడికి గరవుతుండగా, కొత్త విభేదాలు తలెత్తుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉత్తర బెంగాల్‌ను తన బలమైన కంచుకోటగా మార్చుకుని 2021 అసెంబ్లీ ఎన్నికలలో ఆ ఆధిక్యాన్ని మరింత పటిష్ఠం చేసుకున్న బిజెపి, ఇప్పుడు ప్రభుత్వ వ్యతిరేకత, స్థానిక అసమ్మతి, అభ్యర్థుల ఎంపికపై నెలకొన్న అసంతృప్తి వంటి కారకాలతో పోరాడుతోంది. ఇదిలా ఉంటే టిఎంసి మాత్రం తమ సంస్థను చక్కదిద్దుకున్నామని, సామాజిక వర్గాలతో సంబంధాలను పునరుద్ధరించుకున్నామని, అలాగే తాము కోల్పోయిన పట్టును తిరిగి పొందామని విశ్వసిస్తోంది. తాజాగా మారుతున్న పోటీ ఈ ప్రాంతంలోని 8 జిల్లాలైన డార్జిలింగ్, కాలింపాంగ్, జల్పాయ్‌గురి, అలీపూర్‌దువర్, కూచ్ బెహార్, నార్త్ దినాజ్‌పూర్, సౌత్ దినాజ్‌పూర్, మాల్దాలలో విభిన్నంగా వ్యక్తం అవుతున్నది. కొండ ప్రాంతాలు, తేయాకు తోటల నుండి రాజబన్షీ ప్రాంతం, మైనారిటీలు అధికంగా ఉన్న మైదాన ప్రాంతాల వరకూ ప్రతీ జిల్లా దాని సొంత గుర్తింపు, సంక్షేమం, స్థానిక సమస్యలు, రాజకీయ జ్ఞాపకాల మిళితంగా రూపుదిద్దుకుంది. 'ఉత్తర బెంగాల్ ఇకపై ఏకపక్ష ప్రాంతం కాదు. బిజెపికి ఇప్పటికీ నిర్మాణాత్మక ఆధిపత్యం ఉన్నప్పటికీ 2021తో పోలిస్తే పోటీ చాలా హోరాహోరీగా ఉంది' అని రాజకీయ విశ్లేషకుడు సుబోమోయి మైత్రా తెలియజేశారు.2019 లోక్‌సభ ఎన్నికలలో ఉత్తరబెంగాల్‌ను బిజెపి మెజార్టీ కైవసం చేసుకుంది. 8 పార్లమెంట్ స్థానాలలో ఏడింటిని గెలుచుకుంది. 2021లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన 24 స్థానాలకు వ్యతిరేకంగా 54అసెంబ్లీ స్థానాలకు గాను 30స్థానాలను కైవసం చేసుకుని ఆపట్టును మరింత పటిష్ఠం చేసుకుంది. 2019 నాటి గరిష్ఠ స్థాయి నుంచి కాస్త వెనకబడినప్పటికీ , 2024లో కాషాయ శిబిరం తన ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. 8 లోక్‌సభ స్థానాలకుగాను ఆరింటిని గెలుచుకుని , 31అసెంబ్లీ నియోజకవర్గాలలో ఆధిక్యంలో నిలిచింది. ఆ ఎన్నికల జ్ఞాపకం ఈ ప్రాంతాన్ని తీవ్రమైన పోటీకి కేంద్ర బిందువుగా మార్చింది. కూచ్ బెహార్, జల్పాయ్‌గురిలోని రాజ్‌బన్షీ ప్రాంతం దూయర్స్, తెరాయిలోని తేయాకు తోటలు, అలాగే డార్జిలింగ్, కాలింపాంగ్ కొండ ప్రాంతాలపై తనకున్న పట్టును ఆధారంగా చేసుకుని 54 స్థానాలకుగాను 48స్థానాలను గెలుచుకోవాలని బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది. ప్రాంతీయ నిర్లక్ష్యంపై పార్టీ తన ప్రచారాన్ని ముమ్మరం చేసింది. ఎయిమ్స్, ఐఐటి, ఐఐఎం, కేన్సర్ హాస్పిటల్, తేయాకు తోట కార్మికులకు భూ హక్కులు, స్థానిక భాషలకు గుర్తింపు ఇస్తామని హామీలు ఇచ్చింది. అయినప్పటికీ బిజెపి ఆత్మవిశ్వా సం వెనక అసంతృప్తి సంకేతాలు కనిపిస్తున్నాయి. మరితం ముఖ్యంగా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) రాజకీయ పరిస్థితులను మార్చగలదని బిజెపి, టిఎంసి రెండూ భావిస్తున్నాయి.

## బెంగాల్‌లో 23 శాతం మంది అభ్యర్థులు నేరస్తులు

**22 శాతం మంది కోటీశ్వరులు : ఎడిఆర్**



**న్యూఢిల్లీ :** పశ్చిమ బెంగాల్‌లో రెండవ విడత అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులలో 23 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 22 శాతం మంది అభ్యర్థులు కోటీశ్వరులు. ఈ మేరకు అసోసియేషన్ ఫర్ డెమాక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) ఒక నివేదికలో వెల్లడించింది. ఎన్నికల బరిలో ఉన్న 1,445 మంది అభ్యర్థుల అఫిడవిట్లను విశ్లేషించగా, 338 మంది (23 శాతం) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. 295 మంది (20 శాతం) తమపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు వెల్లడించారని ఎడిఆర్ నివేదిక తెలిపింది. 16 మంది అభ్యర్థులు హత్యకు సంబంధించిన కేసులు ఉన్నట్లు ప్రకటించగా, 80 మంది హత్యాయత్నం ఆరోపణలను ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు. ప్రధాన పార్టీల విషయానికి వస్తే, బిజెపి నుండి విశ్లేషించిన 141 మంది అభ్యర్థులలో 102 మంది (72 శాతం), టిఎంసి (టిఎంసి) నుండి 142 మందిలో 49 మంది (35 శాతం), సిపిఐ(ఎం) నుండి 100 మందిలో 51 మంది (51 శాతం), కాంగ్రెస్ నుండి విశ్లేషించిన 142 మందిలో 37 మంది (26 శాతం) తమ ఎన్నికల అఫిడవిట్‌లలో తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారని ఎడిఆర్ నివేదిక వెల్లడించింది. మొత్తం 142 నియోజకవర్గాలలో, 63 నియోజకవర్గాలు (44 శాతం) 'రెడ్ అలర్ట్' నియోజకవర్గాలని, అంటే ఈ నియోజకవర్గాలలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది అభ్యర్థులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది. 1,445 మంది అభ్యర్థులలో, 321 మంది (22 శాతం) రూ. 1 కోటి కంటే ఎక్కువ విలువైన ఆస్తులను కలిగి ఉన్నారు. ప్రధాన పార్టీల పరంగా చూస్తే, టిఎంసి నుండి విశ్లేషించిన 142 మంది అభ్యర్థులలో 103 మంది (73 శాతం), బిజెపి నుండి విశ్లేషించిన 141 మందిలో 73 మంది (52 శాతం), కాంగ్రెస్ నుండి 142 మందిలో 36 మంది (25 శాతం), సిపిఐ(ఎం) నుండి విశ్లేషించిన 100 మందిలో 33 మంది (33 శాతం) రూ. 1 కోటి కంటే ఎక్కువ విలువైన ఆస్తులను ప్రకటించారని ఎడిఆర్ తెలిపింది. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల 2026 రెండో దశలో పోటీ చేస్తున్న ఒక్కో అభ్యర్థి సగటు ఆస్తుల విలువ రూ. 1.21 కోట్లు అని ఆ నివేదిక అదనంగా పేర్కొంది. ప్రధాన పార్టీలలో, విశ్లేషించిన 142 మంది టిఎంసి అభ్యర్థులకు సగటు ఆస్తులు రూ. 5.05 కోట్లుగా, 141 మంది బిజెపి అభ్యర్థులకు రూ. 3.28 కోట్లుగా, 100 మంది సిపిఐ(ఎం) అభ్యర్థులకు రూ. 1.22 కోట్లుగా, 142 మంది కాంగ్రెస్ అభ్యర్థులకు రూ. 1.04 కోట్లుగా ఉన్నాయని ఆ నివేదిక పేర్కొంది.

## ప్రతీ రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

### రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి ఉష



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులంతా తప్పక రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, తద్వారా రిజిస్ట్రేషన్ ఐడి నంబరు పొందాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి డి.ఉష సూచించారు. రిజిస్ట్రేషన్‌తో రైతు బీమా, సబ్సిడీలు, ఇతర పథకాలు రావడానికి ఉపయోగంగా ఉంటున్నారు. ప్రభుత్వ పథకాలలో పారదర్శకత కోసం, ప్రత్తి, వరి కొనుగోలు, పంట రుణాలకు ఇది కీలకం అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల లబ్ధి నేరుగా పొందవచ్చునన్నారు. వరి కొనుగోలు, పంట రుణాల కోసం. ప్రభుత్వ పథకాలలో పారదర్శకత పెరుగుతుందని తెలిపారు. ఇందుకు అవసరమైన పత్రాలు ముఖ్యంగా ఆధార్ కార్డు, భూమి పట్టా పాసు బుక్కు, ఆధార్ లింకు మొబైల్ నంబర్, అవసరం ఉంటుందని వివరించారు. నమోదు గ్రామపరిధిలోని రైతు వేదికలో వ్యవసాయ విస్తరణ అధికారి(ఎఇఒ) వద్ద, లేదా దగ్గరలోని అన్ని మీసేవ కేంద్రాలలో చేయబడుతుందన్నారు. రిజిస్ట్రేషన్ ఏప్రిల్ 22 నుండి 30వరకు ప్రత్యేక డ్రైవ్ జిల్లా మొత్తం అమలు చేయబడుతుందని డిఎఒ ఉష పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం పరచుకోవాలని ఆమె కోరారు.

## అనాథ, పేద మహిళా అభ్యర్థులు డిప్లొమా కోర్సులకు దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** అనాథ, పేద మహిళా అభ్యర్థుల నుంచి డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారిణి ఎల్.శ్రీలత తెలిపారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడ, మధురానగర్ లోని మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ప్రధాన కార్యాలయం సమీపంలోని పాలిటెక్నిక్ కళశాలలోని పలు డిప్లొమా కోర్సులను అందివ్వనున్న నేపథ్యంలో అర్హులయినవారు వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కోరారు. తెలంగాణ పాలిసెట్ పరీక్ష రాయకపోయిన 10వతరగతి ఉత్తీర్ణత పొందినవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి కోరారు. దరఖాస్తులు మే 25 వరకు సంబంధిత సర్టిఫికెట్స్‌తో జతచేసి బాలరక్ష భవన్, రంగారెడ్డి జిల్లా, అమీర్‌పేట్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె సూచించారు.

## ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై చర్యలకు డిమాండ్



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ పరిధిలో ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురవుతున్నాయని జీహెచ్‌ఎంసీ 53, 56 డివిజన్ బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహా రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం బిజెపి నాయకులు, కార్యకర్తలు, స్థానికుల తో కలిసి అబ్దుల్లాపూర్ మెట్టు తాసిల్దార్ కు ఫిర్యాదు చేసారు. తుర్కయంజాల్ పరిధిలోని ప్రభుత్వ భూముల విషయంలో కబ్జాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. దీనిపై వెంటనే సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ ఆస్తులను కాపాడాలని కోరుతూ ప్రభుత్వ భూముల ఆక్రమణలకు పాల్పడుతున్న కబ్జాదారులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని.. ఈ విషయంలో భారతీయ జనతా పార్టీ తరపున మా వంతు పోరాటం ఉంటుందని వారు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొత్త రామ్ రెడ్డి,బచ్చిగళ్ళ రమేష్,సనేం అర్జున్ గౌడ్, నందగిరి సురేష్, కోలన్ రవీందర్ రెడ్డి, గుండా కృష్ణ, ఎటెల్లి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## రక్తదాన శిబిరాలు అభినందనీయం

### కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి




**ప్రజాపక్షం/కడ్తాల్ :** రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలో లయన్ పిఅంజి రెడ్డి 150వ బ్లడ్ క్యాంప్‌ను పెద్దూరు గ్రామ సమీపంలో లక్ష్మీ నరసింహ గార్డెన్‌లో లయన్స్ క్లబ్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం బ్లడ్ క్యాంప్ ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి యువకులు పెద్దఎత్తున హాజరై బ్లడ్ డొనేట్ చేశారు. సమావేశం సందర్భంగా అంజిరెడ్డికి కావలి రాములు అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ మహేందర్‌రెడ్డి, లయన్స్ క్లబ్ చైర్మన్ కె .గోవర్ధన్ రెడ్డి, పొల్యూషన్ బోర్డ్ మెంబర్ బాలాసిన్, ఆమనగల్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాట గీత నరసింహ, మాజీ పిఎసిఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, లింగారావుపల్లి సర్పంచ్ కాసు శ్రీనివాసరెడ్డి, అజీమ్, మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, రవీందర్ యాదవ్, రఘుపతి యాదవ్, శ్రీశైలం యాదవ్, కాడమోని శ్రీశైలం, కానుగుల మల్లేష్, కుమ్మరి శంకర్, బిఎస్‌ఎన్‌ఎల్, కెకె రెడ్డి, హెడ్మాస్టర్ జంగయ్య, డి.రఘురాములు, జోగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## హనుమాన్ దేవాలయంలో పూజలు



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** సినీ నటుడు.. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ త్వరగా కొలుకోవాలని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో అభిమానులు ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం షాద్‌నగర్ పట్టణ సమీపంలోని చౌడమ్మ గుట్ట శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు, షాద్‌నగక్ జనసేన పార్టీ ఇన్‌చార్జి జర్పుల రాజునాయక్ ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజునాయక్ మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆరోగ్య రీత్య త్వరగా కొలుకోవాలని, ప్రజా సేవ కార్యక్రమాలను నిర్వహించాలని పేర్కొన్నారు. జనసేన మహేందర్ రెడ్డి, శంకర్ గౌడ్‌ల స్ఫూర్తితో జనసేన పార్టీకి ప్రతి గ్రామంలో బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు శ్రీనివాస్ గౌడ్, బాలరాజు, లింగం నాయక్, ప్రభు, బాబు, రవి, రాజేష్‌నాయక్, శ్రీశైలం, శంకర్ యాదవ్‌లు పాల్గొన్నారు.

## వాణిజ్యసంస్థలకు ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి

### ఎంఎంసి కమిషనర్ టి. వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వాణిజ్య సంస్థలు మున్సిపల్ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి.వినయ్ కృష్ణారెడ్డి అన్నారు. హబ్సీగూడ, రామంతాపూర్ ప్రాంతాల్లో మంగళవారం ఆయన విస్తృతంగా పర్యటించారు. హబ్సిగూడలోని స్నేహ నగర్ పార్క్‌ను సందర్శించిన కమిషనర్, అక్కడ సీనియర్ సిటిజన్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పార్కు నిర్వహణ నిధులను పెంచి, సమయానికి విడుదల చేయాలని కోరారు. జిమ్ రిపేర్లు, వాకింగ్ ట్రాక్ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌ను సందర్శించిన కమిషనర్, గదులకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించి, ఆ ప్రదేశాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు. పార్క్ నిర్వహణ నిధులు పెంచాలని, సమయానికి విడుదల చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. అలాగే పార్క్‌లో పెండింగ్‌లో ఉన్న జిమ్ మరమ్మతులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ ఏరియాల అభివృద్ధి చేపట్టాలని కోరారు. స్నేహ నగర్‌లో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) సభ్యులతో కమిషనర్ చర్చించారు. సభ్యుల బదిలీ, తొలగింపు ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. నిబంధనల ప్రకారం కొత్త గ్రూపుల్లో సభ్యుల చేరిక సాఫీగా జరిగేలా ప్రక్రియను సరళీకరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. హబ్సిగూడ స్ట్రీట్ నెంబర్ 8లోని వాణిజ్య సముదాయాలను కమిషనర్ తనిఖీ చేశారు. వ్యాపారులు మున్సిపల్ నిబంధనల ప్రకారం లైసెన్సులు కలిగి ఉన్నారా లేదా అని పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, రికార్డులన్ని పక్కాగా నిర్వహించాలని వ్యాపారులకు సూచించారు.



### రామంతపూర్ చెరువులో లార్వా నివారణ

రామంతపూర్ చిన్న చెరువును సందర్శించిన కమిషనర్, అక్కడ లార్వా పెరుగుదలను పరిశీలించారు. గాంబూసియా చేపలు, ఆయిల్ బాల్స్ వినియోగించాలని ఎంటమాలజీ సిబ్బందికి సూచించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డితో పాటు ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, పారిశుద్ధ్య, ఎంటమలాజి విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు 'ఆసరా' అండ

### కార్డుల పంపిణీలో సిఎంసి కమిషనర్ శృజన

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సామాజిక భద్రతే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ శృజన అన్నారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో వృద్ధులకు ఆసరా కార్డులను పంపిణీ చేశారు. కార్డుల పంపిణీలో వృద్ధులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన వృద్ధులతో కమిషనర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలు పొందే క్రమంలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ శృజన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ఎటువంటి జాప్యం జరగకూడదని, పారదర్శకతతో అర్హులకు లబ్ధి చేకూర్చాలని అధికారులను ఆదేశించారు. బలహీన వర్గాలకు, వృద్ధులకు గౌరవప్రదమైన జీవనాన్ని అందించడమే కార్పొరేషన్ ధ్యేయమని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ప్రభుత్వ ఫలాలు సకాలంలో అందినప్పుడే సంక్షేమానికి నిజమైన అర్థం లభిస్తుందన్నారు. వృద్ధులకు నిరంతర మద్దతు, సంరక్షణ అందించడానికి తాము కట్టుబడి ఉన్నామని తెలిపారు. సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత సులభతరం చేసేందుకు భవిష్యత్తులో మరిన్ని చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (యుసిడి)తో పాటు కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



## సీనియర్ సిటిజన్ కార్డుల జారీకి ప్రత్యేక శిబిరాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యాచరణలో మంగవారం మలాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) పరిధిలో అర్హులైన వృద్ధులకు సీనియర్ సిటిజన్ కార్డులు జారీ చేశారు. పారిశుద్ధ్య అదనపు కమిషనర్ సి.ఎన్.రఘుప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేషన్ వ్యాప్తంగా మొత్తం 17 ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి 168 దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వం సీనియర్ సిటిజన్‌ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపడుతోందని, వారికిసేవలు సులభంగా అందించేందుకు ఈ కార్డుల జారీ చేపట్టినట్లు ఆయన తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల ద్వారా వృద్ధులకు ఉచిత ఆరోగ్య పరీక్షలు, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు, ఔషధాల కొనుగోలులో సడలింపులు వంటి ప్రయోజనాలు లభిస్తాయన్నారు.

### హెచ్‌సిఎలో రాజకీయ జోక్యం కుంభకోణాలపై

## సిబిఐ విచారణకు టిసిఎ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)లో కొనసాగుతున్న రాజకీయ జోక్యం, అవినీతిపై సిబిఐ విచారణ చేపట్టాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) డిమాండ్ చేసింది. హైదరాబాద్‌లో మంగళవారం మీడియా సమావేశంలో టిసిఎ ప్రధాన కార్యదర్శి ధరం గురువారెడ్డి మాట్లాడుతూ హెచ్‌సిఎ మాజీ అధికారులు, మాజీ క్రికెటర్ల తాజా వాఖ్యలు వారి అవినీతికి పరాకాష్ట అని ఆయన పేర్కొన్నారు. హెచ్‌సిఎ అవినీతి అక్రమాలు, కుంభకోణాలపై సిబిఐతో పాటు ఎస్‌ఎఫ్‌ఐఒలతో విచారణ జరిపించాలన్నారు. మాజీ అంతర్జాతీయ క్రికెటర్ అర్షద్ అయూబ్‌తో పాటు హెచ్‌సిఎ మాజీ కార్యదర్శులు చేసిన బహిరంగ ప్రకటనలు గత కొన్నేళ్లుగా టిసిఎ ప్రస్తావిస్తున్న హెచ్‌సి అక్రమాలను నిర్ధారిస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సిఎంఒ) జోక్యంతోనే హెచ్‌సిఎలో పదవులు కేటాయించబడ్డాయని వచ్చిన ఆరోపణలు ఆందోళనకరమని పేర్కొన్నారు. హెచ్‌సిఎ వ్యవహారాల్లో రాజకీయ జోక్యం ఎందుకు జరుగుతోందని ఆయన ప్రశ్నించారు. క్రికెట్ పరిపాలన రాజ్యాంగబద్ధంగా సాగాల్సినప్పటికీ రాజకీయ ప్రభావంతో నడుస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి పేరు ఉపయోగించి కొందరు అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఫిర్యాదులను అణచివేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే టిసిఎ ఇచ్చిన ఫిర్యాదులపై చర్యలు లేకపోవడం, సిఐడి దర్యాప్తుకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వకపోవడం పట్ల ఆయన అనుమానం వ్యక్తం చేశారు. హెచ్‌సిఎలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాల్సిన చోట కొందరు అధికారులు, మంత్రులు నిందితులను కాపాడుతున్నారనే ఆరోపణలు కూడా చేసింది. హెచ్‌సిఎపై హైకోర్టులు, సుప్రీంకోర్టులో 20కి పైగా కేసులు కొనసాగుతున్నప్పటికీ లిటిగేషన్ లేదు అనే ప్రచారం తప్పుడు సమాచారమని ఆయన ఖండించారు. అలాగే బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియా ఆదేశాలను హెచ్‌సిఎ నిర్లక్ష్యం చేస్తోందన్నారు.




### మహిళా స్వయం సహాయక సంఘాలకు

## ఎన్ఐటిహెచ్‌ఎంలో శిక్షణ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మరియు స్వయం ఉపాధి రంగంలో రాణించేందుకు గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (ఎన్ఐటిహెచ్‌ఎం) వేదికైంది. ఎంఎంసి యుసిడి విభాగం ఆధ్వర్యంలో 30 మంది స్వయం సహాయక సంఘాల మహిళలకు ఉద్దేశించిన 5 రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు శిక్షణలో భాగంగా నిపుణులు వివిధ కీలక అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. వంటలో నాణ్యతా ప్రమాణాలను ఎలా పాటించాలి?, భారీ స్థాయిలో ఆహారాన్ని రుచికరంగా, తక్కువ సమయంలో తయారు చేసే పద్ధతులు, అతిథి సత్కార రంగంలో మెళకువలు, ఆహార తయారీలో శుభ్రత పాటించడం, తయారు చేసిన ఉత్పత్తులకు బ్రాండింగ్ ఎలా కల్పించాలనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవడంతో పాటు, హాస్పిటాలిటీ రంగంలో వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఎన్ఐటిహెచ్‌ఎం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యుసిడి ప్రాజెక్ట్ డైరెక్టర్, ఎన్ఐటిహెచ్‌ఎం ప్రొఫెసర్లు, యుసిడి సిబ్బంది పాల్గొన్నారు. ఈ 5 రోజుల శిక్షణ ముగిసే సమయానికి మహిళలు తమ సొంతంగా కేటరింగ్ లేదా హాస్పిటాలిటీ వ్యాపారాలను ప్రారంభించే స్థాయికి చేరుకుంటారని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు.



## కేటాయించిన ఇండ్లలోనే ఉండాలి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండా నివసించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి హౌసింగ్ అధికారులు, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ ఇండ్లు పూర్తి అయిన, నిర్మాణ దశలో ఉన్న ఇండ్లను లబ్దిదారులకు కేటాయించాలని, 2 బిహెచ్‌కె ఇండ్లు తీసుకున్నా, ఇంకా వాటిల్లో నివసించని వారికి కేటాయించిన ఇండ్లను గుర్తించి నోటీస్ ఇచ్చి రద్దు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పూర్తి అయిన, నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించుటకు ఎంపిక చేసిన లబ్దిదారులకు కేటాయించాలని తెలిపారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్ 2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని, లబ్దిదారులందరు వెంటనే తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే చెప్పాలన్నారు. లేని యెడల వారికి కేటాయించిన ఇండ్లను రద్దు (కాన్సల్ ) చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. సంబంధిత అధికారులందరూ పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపుకలెక్టర్ (స్థానికసంస్థలు) కె.శ్రీనివాస్, జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, వివిధ డివిజన్‌ల రెవిన్యూ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుపై బిజెపి కుట్ర




### ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** మహిళా రిజర్వేషన్ బిల్లుపై కేంద్రంలోని బిజెపి కుట్ర చేసిందని తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దేవునిబండ తండాలో సర్పంచ్ శ్రీనునాయక్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు పేరుతో డిలిమిటేషన్‌ను ముందుకు తీసుకురావడంతోనే కాంగ్రెస్ పార్టీ అడ్డుకుంటుందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు ప్రధాన మంత్రులను, మంత్రులను సైతం చేశారని గుర్తు చేశారు. మహిళలకు సముచిత గౌరవాన్ని అంధించడంతోపాటు మొదటి ప్రాధాన్యత ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. దేవునిబండ తండాలో మిషన్ భగీరథ నీటి సంప్‌తోపాటు పైపులైన్ పనులకు రూ.10లక్షలు మంజూరు చేశారు. సర్పంచ్ శ్రీనునాయక్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ప్రజల తరుపున ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాదావత్ శ్యామ్‌లాల్, పంచాయతీ కార్యదర్శి గీత, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాదావత్ శంకర్, వార్డు సభ్యుడు జాను సుధాకర్, ఈశ్వర్ నాయక్, సుమన్‌నాయక్, పవన్ చౌహాన్, బాదావత్ వీరేష్, రమేష్, చందు నాయక్, శంకర్, మారువాలిబాయి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హైదరాబాద్‌లోని వనస్థలిపురం కినేరా గ్రాండ్‌లో నల్లగొండ నాగార్జున డిగ్రీ కాలేజ్‌కు చెందిన 1975–1978 బిఎ(ఇపిపి) బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. దాదాపు 48 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు ఒకేచోట కలుసుకుని, తమ విద్యార్థి దశ జ్ఞాపకాలను స్మరించుకుంటూ ఆనందభరిత వాతావరణంలో పాల్గొన్నారు. ఈ సమావేశం అందరిలోనూ అపూర్వమైన స్నేహబంధాన్ని మరింత బలపరిచింది. కార్యక్రమానికి తెలంగాణ పెన్షనర్స్ జెఎసి చైర్మన్ కొలిశెట్టి లక్ష్మయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశాన్ని అభినందిస్తూ, పాత స్నేహితులు తిరిగి కలుసుకోవడం ఒక గొప్ప అనుభూతి అని పేర్కొన్నారు. సమాజంలో అనుబంధాలను బలపరచడానికి ఇలాంటి సమావేశాలు ఎంతో అవసరమని తెలిపారు. సమ్మేళనంలో వెంకట్ నర్సయ్య, కర్ణం శ్రీకాంత్, పి.వెంకటరెడ్డి, ప్రేమకుమారి, సుశీల, సుధాకర్‌రెడ్డి, సత్తయ్య, జనార్ధన్ రెడ్డి, ఎంఎ మస్తాన్, రామస్వామి తదితరులు వున్నారు.




## అరవింద్‌కుమార్‌కు నివాళులర్పించిన హరీష్‌రావు, పల్లా వెంకట్‌రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి :** బిఆర్‌ఎస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ సోదరుడి కుమారుడు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు, బిఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కర్నె అరవింద్‌కుమార్ దశదినకర్మ కార్యక్రమం ఇబ్రహీంపట్నం మండలం బొంగులూరు గేట్ సమీపంలోని వైఎస్‌ఆర్ గార్డెన్‌లో మంగళవారం జరిగింది. దశదినకర్మ కార్యక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి పాల్గొని అరవింద్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, రంగారెడ్డి జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మాజీ ఎంపిలు బూర నర్సయ్యగౌడ్, గడ్డం రంజిత్‌రెడ్డి, గీత పారిశ్రామిక సహకార సంఘం మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్, బిఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి, ఉప్పు కృష్ణ, కప్పల శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# సొంతగడ్డపై సన్‌రైజర్స్ హ్యాట్రిక్!



సొంతగడ్డపై వరసగా మూడో మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్) సుడిగాలి శతకంతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై మానసికంగా పైచేయి సాధించిన హైదరాబాద్.. ఇషాన్ మలింగ(4—32) విజృంభణతో ఘన విజయం సాధించింది. పవర్ హిట్టర్లతో నిండిన ఢిల్లీలో నితీశ్ రానా(57) అర్ధ శకతంతో పోరాడినా.. మిడిలార్డర్ మెరవలేదు. ఆఖర్లో హర్ష్ దూబే(3—12) తిప్పేయగా 195కే ఢిల్లీ పరిమితమవ్వగా.. ఇషాన్ సేన హ్యాట్రిక్ విజయం, ఎనిమిది పాయింట్లతో ప్లే ఆఫ్స్ బరిలో నిలిచింది. ఐపిఎల్—19లో సన్‌రైజర్స్ హైదరాబాద్ హ్యాట్రిక్ విజయంతో సొంత ప్రేక్షకులను అలరించింది. ఉప్పల్ స్టేడియంలో ఓపెనర్ అభిషేక్ శర్మ (135 నాటౌట్) ఊచకోతతో భారీ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్‌ను బౌలర్లు మళ్లీ నిలబెట్టారు. తొలి మ్యాచ్ ఆడుతున్న మధుషంక ఓపెనర్ పథుమ్ నిశాంక(8)ను ఔట్ చేసి బ్రేకిచ్చాడు. కానీ, నితీశ్ రానా(57), కేఎల్ రాహుల్(37) దూకుడుగా ఆడి కీలక భాగస్వామ్యం నెలకొల్పారు. స్పిన్నర్లు, పేసర్లను దీటుగా ఎదుర్కొన్న రానా బౌండరీలతో భయపెట్టాడు. శివాంగ్ ఓవర్లో రెచ్చిపోయిన అతడు అర్ధ శతకంతో ఆశలు రేపినా. ఇషాన్ మలింగ(4—34) ఢిల్లీకి 11వ ఓవర్లో షాకిచ్చాడు. వరస బంతుల్లో రానాను, సూపర్ డెలివరీతో డేవిడ్ మిల్లర్(0)ను బౌల్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. హ్యాట్రిక్ బంతికి వికెట్ కాపాడుకున్న ట్రిస్టన్ స్టబ్స్(27).. సమీర్ రిజ్వీ()తో.. అప్పటికే అవసరమైన నెట్ రన్‌రేట్ 15 దాటింది. రివర్స్ స్కూప్ షాట్లు ఆడుతూ బౌండరీలు సాధిస్తున్న స్టబ్స్‌ను మలింగ బోల్తా కొట్టించాడు. దాంతో, ఐదో వికెట్‌కు 59 రన్స్ భాగస్వామ్యానికి తెరపడింది. 18 బంతుల్లో 66 రన్స్ అవసరమవ్వగా.. మలింగ ఓవర్లో అనికేత్ క్యాచ్‌తో ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ శర్మ(14) పెవిలియన్ చేరాడు. అక్షర్ పటేల్ (2)సైతం విఫలమవ్వగా సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై జయభేరి మోగించింది.

## అభిషేక్ సునామీ

ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మ(135 నాటౌట్: 68 బంతుల్లో 10 ఫోర్లు, 10 సిక్సర్లు) శివాలెత్తిపోయాడు. ఆరంభం నుంచి వీరకొట్టుడు ఆటతో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ల భరతం పట్టిన ఈ చిచ్చరపిడుగు ఐపిఎల్‌లో రెండో శతకంతో మెరిశాడు. ట్రావిస్ హెడ్(37) విఫలమైనా జోరు చూపిన అభిషేక్.. తన మార్క్ విధ్వంసంతో చెడుగుడు ఆడుకున్నాడు.

ఆఖర్లో క్లాసెన్(37 నాటౌట్) దంచేశాడు. ముకేశ్ కుమార్ వేసిన చివరి ఓవర్లో 4, 6, 4, 4తో సన్‌రైజర్స్‌కు భారీ స్కోరందించాడు. అభిషేక్ మెరుపులకు ఇషాన్, క్లాసెన్ దూకుడు తోడవ్వగా సన్‌రైజర్స్ నిర్ణీత ఓవర్లలో 2 వికెట్ల నష్టానికే 242 రన్స్ కొట్టింది.

# ముంబయి ఇండియన్స్‌కు గుడ్‌న్యూస్

పంతొమ్మిదో సీజన్‌లో రెండో విజయంతో మురిసిన ముంబై ఇండియన్స్‌కు గుడ్ న్యూస్. సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ముందే ఆ జట్టుకు మరింత బలాన్నిచ్చే ఆల్‌రౌండర్ వచ్చేశాడు. టోర్నీ ఆరంభ నుంచి జట్టుతో కలవని విల్ జాక్స్ మంగళవారం భారత్‌లో అడుగుపెట్టాడు. వస్తూ వస్తూనే స్క్వాడ్లో కలిసిన ఈ విధ్వంసక హిట్టర్ సహచరులతో కలిసి ప్రాక్టీస్ మొదలెట్టాడు. ఐపిఎల్—19లో రెండే విజయాలతో ప్లే ఆఫ్స్‌లో వెనకబడిన ముంబై ఇండియన్స్ ఆట ఇకపై అదరనుంది. మిడిలార్డర్ బ్యాటింగ్ కష్టాలను దూరం చేసేందుకు విల్ జాక్స్ సిద్ధమవుతున్నాడు. ఇటీవలే భారత్, శ్రీలంక ఆతిథ్యమిచ్చిన పొట్టి ప్రపంచకప్‌లో వికెట్ల(8 మ్యాచుల్లో 9 వికెట్లు) వేటతో రెచ్చిపోయిన జాక్స్ మంగళవారం ముంబై స్క్వాడ్‌తో కలిశాడు.

## నాలుగు మ్యాచ్‌ల్లో...

అటు బ్యాటుతో, ఇటు బంతితో ప్రత్యర్థిని భయపెట్టగల జాక్స్ రాకతో ముంబై మరింత పటిష్టంగా కనిపిస్తోంది. ఇప్పటికే శాంట్నర్, గజన్ఫర్ రూపంలో నాణ్యమైన స్పిన్నర్లు ఉండగా.. జాక్స్ ఎంట్రీతో ముంబై స్పిన్ దళం మరింత దుర్భేధ్యంగా మారనుంది. ప్రపంచకప్‌లో తిప్పేసిన జాక్స్ నాలుగు మ్యాచుల్లో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుపొందిన ఈ ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ ఈసారి ముంబై విజయాల్లో భాగం కానున్నాడు. గత మ్యాచ్‌లో తిలక్ వర్మ(101 నాటౌట్) సూపర్ సెంచరీతో గుజరాత్‌ను చిత్తు చేసిన ముంబై వాంఖడేలో బుధవారం సీఎస్కేతో తలపడనుంది.



మహిళ

# సంప్రదాయ పాత్రల నుంచి ఆధునిక నాయకత్వం వరకూ..

మానవ సమాజ చరిత్రను పరిశీలిస్తే మహిళల స్థానం కాలానుగుణంగా మారుతూ వచ్చినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఒకప్పుడు మహిళలను ప్రధానంగా గృహపనులు, పిల్లల సంరక్షణ వంటి సంప్రదాయ పాత్రలకు మాత్రమే పరిమితం చేశారు. అయితే కాలక్రమేణా విద్యా అవకాశాలు, సామాజిక సంస్కరణలు, రాజకీయ ఉద్యమాలు, ఆర్థిక మార్పులు మహిళల జీవితాన్ని గణనీయంగా మార్చాయి. ఈ మార్పుల ఫలితంగా మహిళలు సంప్రదాయ పాత్రల నుండి బయటపడి ఆధునిక వృత్తి ప్రపంచంలో నాయకత్వ స్థానాలకు ఎదిగారు. ప్రాచీన కాలంలో కొన్ని సమాజాలలో మహిళలకు గౌరవం ఉన్నప్పటికీ, చాలా కాలం పాటు పితృస్వామ్య వ్యవస్థ ప్రభావం ఎక్కువగా ఉండేది. ఈ వ్యవస్థలో కుటుంబంలో మరియు సమాజంలో ప్రధాన నిర్ణయాలు పురుషుల చేతుల్లో ఉండేవి. మహిళలకు విద్యా అవకాశాలు తక్కువగా ఉండేవి. వారి జీవితం ఎక్కువగా కుటుంబ బాధ్యతలకే పరిమితం అయ్యేది. సమాజం కూడా మహిళలను బలహీనంగా భావించి వారి సామర్థ్యాన్ని పూర్తిగా గుర్తించలేదు. మధ్యయుగ కాలంలో పరిస్థితి మరింత కఠినంగా మారింది. అనేక ప్రాంతాల్లో మహిళలకు విద్య, ఆస్తిహక్కులు, రాజకీయహక్కులు వంటి ప్రాథమిక అవకాశాలు లభించలేదు. వారు సామాజిక నియమాలు, సంప్రదాయాల సంకెళ్లలో ఉండిపోయారు. ఈ పరిస్థితి అనేక శతాబ్దాల పాటు కొనసాగింది. అయితే ఈ కాలంలో కూడా కొన్ని మహిళలు తమ ప్రతిభతో గుర్తింపుపొందారు. వారు సమాజంలో మార్పు కోసం మొదటి అడుగులు వేసినవారిగా నిలిచారు. 19, 20వ శతాబ్దాలలో మహి



ళల హక్కుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమాలు ముఖ్యంగా మహిళలకు విద్యా హక్కు, ఓటు హక్కు, సమాన అవకాశాల కోసం కొనసాగాయి. ఈ కాలంలో అనేకమంది సామాజిక సంస్కర్తలు, మహిళా నాయకులు ఉద్యమాల్లో కీలకపాత్ర పోషించారు. వారి కృషి వల్ల మహిళలు రాజకీయ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ఓటుహక్కు పొందడం మహిళల హక్కుల చరిత్రలో ఒక కీలక మలుపుగా పేర్కోవాలి. విద్య మహిళలసాధికారతలో అత్యంత ముఖ్యమైన అంశంగా మారింది. మహిళలు చదువుకోవడం ప్రారంభించిన తరువాత వారి జీవితాల్లో పెద్ద మార్పులు వచ్చాయి. విద్య ద్వారా వారు తమహక్కులను అర్థం చేసుకున్నారు. ఆర్థిక స్వాతంత్ర్యం సాధించే మార్గాలను కనుగొన్నారు. ఉద్యోగ అవకాశాలు పెరగడంతో మహిళలు కుటుంబ ఆర్థిక వ్యవస్థలో కూడా ముఖ్యమైన పాత్ర పోషించడం ప్రారంభించారు. ఆర్థిక స్వాతంత్ర్యం మహిళలకు కొత్త అవకాశాలను తెచ్చింది. వారు కేవలం ఉద్యోగులు మాత్రమే కాకుండా వ్యాపారవేత్తలు, శాస్త్రవేత్తలు, రాజకీయ నాయకులు, పరిపాలనా అధికారులు వంటి అనేక రంగాల్లో నాయకత్వ స్థానాలను సంపాదించారు. ఈమార్పు సమాజ నిర్మాణాన్ని కూడా ప్రభావితం చేసింది. కుటుంబాలలో మహిళల అభిప్రాయాలకు కూడా ప్రాధాన్యం పెరిగింది. అయితే మహిళల హక్కుల పరిణామం ఒక సూటిగా జరిగిన ప్రక్రియ కాదు. ఇది అనేక అడ్డంకులు, ప్రతిబంధకాలను ఎదుర్కొంటూ సాగింది. ఇప్పటికీ కొన్ని సమాజాల్లో లింగ అసమానత, వేతన అసమానత, సామాజిక పక్షపాతాలు కొనసాగుతున్నాయి. ఉద్యోగరంగంలో మహిళలు పురుషులతో సమానంగా పనిచేసినా కొన్నిసార్లు సమాన గుర్తింపు పొందడం కష్టం అవుతుంది. నాయకత్వ స్థానాలకు చేరుకోవడంలో కూడా వారు సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఇటీవల మహిళలు అనేకరంగాల్లో విశేష విజయాలు సాధిస్తున్నారు. రాజకీయాలలో, వ్యాపారరంగంలో, శాస్త్రసాంకేతిక రంగంలో విద్యారంగంలో మహిళలు కీలక స్థానాలను చేపడుతున్నారు. ఈపరిణామం సమాజంలో మహిళల సామర్థ్యాన్ని స్పష్టంగా చూపిస్తుంది. ఆధునికకాలంలో మహిళలను కేవలం గృహపాత్రలతో మాత్రమే పరిమితం చేయడం సరైనది కాదని సమాజం క్రమంగా అంగీకరిస్తోంది. మహిళల నాయకత్వం సమాజ అభివృద్ధికి కూడా ముఖ్యమైనదనే భావన పెరుగుతున్నది. పరిశోధనలు చూపుతున్నట్లు మహిళలు నాయకత్వస్థానాల్లో ఉన్నప్పుడు సంస్థలు, సమాజం సమతుల్యంగా అభివృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయి. మహిళలు సాధారణంగా సహకారం, సహానుభూతి, సమగ్రత వంటి విలువలను ప్రోత్సహిస్తారు. ఈ లక్షణాలు ఆధునిక నాయకత్వంలో కీలకంగా మారాయి. మొత్తంగా చూస్తే మహిళల హక్కుల పరిణామం ఒక దీర్ఘకాలిక సామాజిక మార్పు ప్రక్రియ. సంప్రదాయగృహపాత్రల నుండి ప్రారంభమైన ఈ ప్రయాణం నేడు ప్రపంచస్థాయి నాయకత్వానికి చేరుకుంది. మహిళల హక్కుల అభివృద్ధి భవిష్యత్తు సమాజ నిర్మాణంలో ఒక ముఖ్యమైన భాగంగా కొనసాగుతుంది.


ఒడిశాలో క్రైమ్ ఎగైనెస్ట్ ఉమెన్ అండ్ చిల్డ్రెన్ వింగ్ (సిఎడబ్ల్యు అండ్ సి డబ్ల్యు), ఐయుసిఎడబ్ల్యు యూనిట్లు, ఐఎహెచ్‌టియు యూనిట్లు వంటి ప్రత్యేక దళాలు పనిచేస్తున్నాయి. మహిళా, శిశు డెస్కులు, సిసి టివి కెమెరాలు, ప్రత్యేక ప్రజా అభియోజకుల నియామకం వంటి చర్యలు చేపట్టబడ్డాయి. ఇవి అవసరమైన చర్యలే అయినప్పటికీ, కేసుల సంఖ్య తగ్గడంలో ఎంతవరకు ప్రభావవంతంగా ఉన్నాయనే అంశం సమగ్రం గా విశ్లేషించాలి. దేశవ్యాప్తంగా న్యాయవ్యవస్థలో కేసుల పెండింగ్ సమస్య కూడా తీవ్రంగా ఉంది. అత్యాచార కేసులలో దోష నిర్ధారణ శాతం సుమారు 25—30 శాతం మధ్యలోనే ఉంది. దీర్ఘకాల విచారణ, సాక్ష్యాల లోపం, బాధితులపై ఒత్తిళ్లు వంటి అంశాలు న్యాయం ఆలస్యమవడానికి కారణం అవుతున్నాయి. మహిళలపై నేరాల సమస్యను




చట్టపరమైన అంశంగానే చూడడం సరి కాదు. ఇది సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలకు అనుసంధానమై ఉంది. లింగ అసమానత, మద్యపానం, నిరుద్యోగం, పితృస్వామ్య దృక్పథం వంటి మూలకారణాలను పరిష్కరించకుండా కేవలం పోలీసు చర్యలతో సమస్య పూర్తిగా తగ్గదు. ఒడిశా గణాంకాలు దేశ పరిస్థితికి ఒక ప్రతిబింబం మాత్రమే. మహిళలపై నేరాలు సంఖ్యలో మాత్ర మే కాక, ప్రభావంలో కూడా తీవ్రంగా ఉన్నాయి. ప్రతి కేసు ఒక కుటుంబాన్ని, ఒక సమాజాన్ని ప్రభావితం చేస్తుంది. చట్టాల కఠిన అమలు, వేగవంతమైన విచారణ, బాధితులకు సహాయం, సామాజిక అవగాహన కార్యక్రమాలు సమాంతరంగా అమలైతేనే స్థిరమైన మార్పు సాధ్యమవుతుంది. ఒక రాష్ట్రంలో నమోదైన 33,021 కేసులు దేశవ్యాప్తంగా ఉన్న సమస్య తీవ్రతను సూచించే హెచ్చరికగా చూడాలి. మహిళల భద్రతను కేవలం గణాంకాలుగా కాక, జాతీయ ప్రాధాన్యతగా పరిగణించి బహుముఖ చర్యలు చేపట్టడం అత్యవసరం.

## కార్మిక హక్కులు హరిస్తున్న కేంద్రం

ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు



**ప్రజాపక్షం/మంచిర్యాల :** కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హరిస్తుందని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు ఆరోపించారు. మంచిర్యాలలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు మిట్టపల్లి పౌలు, ముస్కె సమ్మయ్య అధ్యక్షతన జిల్లా సమితి సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే వేడుకలను జిల్లాలోని కార్మిక వర్గమంతా ఐక్యంగా విజయవంతం చేయాలని కోరారు. నవంబర్ 21 నుండి 26 వరకు బెంగళూరులో ఎఐటియుసి జాతీయ మహాసభలు, ఆగస్టు 29 నుండి 31 వరకు కరీంనగర్‌లో రాష్ట్ర మహాసభలు జరగనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, కలిందర్ ఖాన్, దాగం మల్లేష్, ఇప్పకాయల లింగయ్య, ఎస్కె బాజీ సైదా, కొట్టే కిషన్ రావు, జాడి పోషం, నేషనల్ హెల్త్ స్కీమ్ నాయకులు బాపు, మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులు మధు, రాయమల్లు, సివిల్ సప్లయ్ హమాలీ నాయకులు బైరి రాజన్న, సత్తన్న పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు




**ప్రజాపక్షం/కోరుట్ల :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జిల్లాలో కార్మికలోకం విజయవంతం చేయాలని ఎఐటియుసి జగిత్యాల జిల్లా అధ్యక్షులు సుతారి రాములు పిలుపునిచ్చారు. మంగళవారం జగిత్యాల జిల్లా కోరుట్ల డివిజన్ కేంద్రంలోని ఎఐటియుసి సి.ప్రభాకర్ భవన్‌లో ఎఐటియుసి జిల్లా కమిటీ సమావేశం జరిగింది. సమావేశానికి ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి సమ్మయ్య పాల్గొన్నారు. సమావేశంలో సుతారి రాములు మాట్లాడుతూ ఆగస్టు నెలలో ఎఐటియుసి రాష్ట్ర మహాసభలు జరుగుతున్న సందర్భంగా ఉమ్మడి జిల్లాలో ఎఐటియుసి జిల్లా మహాసభలు జూలై చివరి వరకు జరపాలని కోరారు. వచ్చేనెల మే 1న కార్మిక దినోత్సవం మేడేను కార్మిక అడ్డాలో పట్టణ మండల జిల్లా కేంద్రంలో అరుణ పతాకాలు ఎగురవేసి ఘనంగా అమర వీరులను స్మరించుకుంటూ కార్యక్రమం నిర్వహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, కనీస పెన్షన్ 5000 రూపాయలు అమలు చేయాలని, ఎన్నికలకు ముందు కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముక్రం, ములుగురి హనుమంతు, పిడుగురాళ్ల భూమేశ్వర్, ఎండి ఉస్మాన్, కొంక భాగ్యల, సంగం పద్మ, సరస్వతి, కిరణ్, తదితరులు పాల్గొని మే డే పోస్టర్ ఆవిష్కరించారు.

# ప్రజావ్యతిరేక విధానాలతో కేంద్రం నయవంచన

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గత ప్రధానులు అలీన విధానాన్ని అనుసరిస్తే, పదేళ్ల పైబడి ప్రధానిగా కొనసాగుతున్న నరేంద్రమోదీ ప్రభుత్వం దేశభక్తి పేరిట కొత్త నాటకాన్ని తెరపైకి తీసుకొని వచ్చి ప్రజలను నయవంచన చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్.బోస్ తీవ్రంగా విమర్శించారు. మంగళవారం మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో టి.యాదయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన సిపిఐ మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసి బోస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ విదేశాల నుండి ఆయిల్ ఉత్పాదనల కొనుగోళ్లకు సైతం అమెరికా అనుమతి తీసుకోవాల్సిన దౌర్భాగ్యం వచ్చిందన్నారు. బిజెపి పాలనలో కార్పొరేట్ వ్యవస్థ, పెట్టుబడిదారులు మినహా అన్నిరంగాల ప్రజలు నష్టపోతూ ఆర్థిక వెనుకబాటుకు గురవుతున్నారన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్న ప్రజాపాలన పేరిట ప్రజలకు ఇబ్బందులు కల్గించే పనులు చేస్తున్నారే తప్ప మేలు జరిగేది ఏమీ కనపడటం లేదన్నారు. దురాక్రమణల తొలగింపు పేరిట కుటుంబాలను పోషించుకొనే వీధి వ్యాపారులకు ఆటంకాలు కల్గిస్తూ జీవనాలు దెబ్బ తీస్తున్నారన్నారు. వీరి వ్యాపారాలకు ప్రత్యామ్నాయాలు ఏర్పాటు చేయకపోతే ఆందోళనలు తప్పవన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు, నాయకులు డిజి సాయిలుగౌడ్, కాసర్ల నాగరాజు, కె.అశోక్, రాములు, సత్యనారాయణ, యాదగిరి, అజీజ్, సయ్యద్ హుస్సేన్, సయ్యద యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

**మండల కార్యదర్శిగా కాసర్ల నాగరాజు...** మల్కాజిగిరి మండల సిపిఐ కార్యదర్శిగా కాసర్ల నాగరాజును సమావేశంలో ఎన్నుకొన్నారు. ఇప్పటివరకు ఈబాధ్యత కొనసాగిస్తున్న టి.యాదయ్యగౌడ్ ఆరోగ్యం సహకరించక పోవటంతో పదవి నుంచి తప్పుకొన్న నాగరాజుకు అరుణపతాకాన్ని అందించి బాధ్యతలు అప్పచెప్పారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మండలంలో పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు.

## చిరువ్యాపారుల పొట్టగొట్టడం అన్యాయం

సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్డు పక్కన చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న నిరుపేదలను జిహెచ్‌ఎంసి అధికారులు తొలగించడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డు పక్క వ్యాపారుల పొట్టగొట్టడం అన్యాయమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ అన్నారు. సైబరాబాద్ మున్సిపల్ ప్రాంతాల్లో జీవనోపాధి కోసం రోడ్డుపై వ్యాపారం చేస్తున్న చిరు వ్యాపారులను సుందరీకరణ పేరుతో తొలగించడం అన్యాయమన్నారు. 99రోజుల పాలన పేరిట ప్రజా పాలన అంటూ చెప్పుకుంటూ, వాస్తవానికి బుల్డోజర్ పాలన కొనసాగుతోందని విమర్శించారు. పేదల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తోందని ఆరోపించారు. ఇలాంటి చర్యలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తెలియక జరుగుతున్నాయా లేదా ఆయన ఆదేశాల మేరకే జరుగుతున్నాయా అని ప్రశ్నించారు. పేద ప్రజల పొట్ట కొట్టే విధానాలను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. చిరు వ్యాపారుల సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ తరపున రాబోయే రోజుల్లో వారిని సమీకరించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంతో కాలంగా వారు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నవారిని అకస్మాత్తుగా తొలగించడం అన్యాయమన్నారు. మానవీయ కోణంలో ఆలోచించి వారికి తిరిగి వ్యాపారాలు చేసుకునేలా అనుమతులు కల్పించాలని ఉమామహేష్ కోరారు.

## కార్మిక చట్టాలు సవరించేందుకు కుట్ర చేస్తున్న కేంద్రం

బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధానకార్యదర్శి జంగయ్య

**ప్రజాపక్షం/కొందుర్గు:** కార్మిక చట్టాలను సవరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని, వాటిని తిప్పికొట్టేందుకు కార్మికలోకం ఏకం కావాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బుద్దుల జంగయ్య అన్నారు. మంగళవారం కొందుర్గు మండల కేంద్రంలో మేడే దినోత్సవ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ 40కార్మిక చట్టాలను తీసివేసి వాటి స్థానంలో నాలుగు కార్మిక చట్టాలను తీసుకువచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం కార్మిక చట్టాలకు తుంగలో తొక్కితే ఉపేక్షించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి గాంధీ పేరు తొలగించి రాంజీ పేరు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. భవన నిర్మాణ కార్మికులకు 60ఏళ్ళ నుంచి రూ.10వేల పెన్షన్ ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మే 1న కార్మిక దినోత్సవం మేడేను కార్మిక అడ్డాలో పట్టణ మండల జిల్లా కేంద్రంలో అరుణ పతాకాలు ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో చౌదరిగూడ మండల కార్యదర్శి వీరేశం, చోటమియా, షబ్బీర్, గోపాల్ పాల్గొన్నారు.



## యాదగిరిగుట్ట బ్రహ్మోత్సవాలలో ప్రజానాట్యమండలి కళాకారులకు అవకాశం కల్పించాలి

సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి దామోదర్‌రెడ్డి వినతి

**ప్రజాపక్షం/ఆలేరు :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలలో స్థానిక తెలంగాణ ప్రజా నాట్యమండలి కళాకారులకు ప్రదర్శన అవకాశం కల్పించాలని సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యాని కోరారు. కళాకారుల, చిరు వ్యాపారుల, స్థానిక సమస్యలపై సిపిఐ ప్రతినిధి బృందం విప్ అయిలయ్యాను మంగళవారం కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజానాట్యమండలి కళాకారులు సమాజ సమస్యలను ప్రతిబింబిస్తూ ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారని తెలిపారు. అలాంటి కళాకారులకు బ్రహ్మోత్సవాల వంటి మహత్తర వేదికల్లో ప్రదర్శనలకు అవకాశం కల్పించడం ద్వారా సంప్రదాయ కళలకు ప్రోత్సాహం లభిస్తుందన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, యాదగిరిగుట్ట దేవస్థానంలో కళాకారులకు అవకాశాలను కల్పించాలని, కోలాట, జానపద కళాబృందాలకు సబ్సిడీతో కూడిన రుణాలు, నెలకు రూ.6వేలు పెన్షన్, ఇంటిస్థలాలు, హెల్త్‌కార్డులు ఇవ్వాల ని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెక్కా వెంకటేష్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, కళ్లెం కృష్ణ, ఎండి.ఇమ్రాన్, పేరబోయిన మహేందర్, కల్లేపల్లి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.





### లేబర్ కోడ్ల రద్దుకు కార్మికుల ఉద్యమించాలి

**భువనగిరి :** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పిలుపునిచ్చారు. భువనగిరి పట్టణంలో ఎఐటియుసి జిల్లా కౌన్సిల్ సమావేశం గోరేటి రాములు అధ్యక్షతన జరిగింది. సమావేశానికి యానాల హాజరై మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్లపై కార్మికులు, శ్రామికులు, ఉద్యోగులు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మే 1న జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో వాడవాడనా మేడేను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం లో ఎఐటియుసి జిల్లా గౌరవ అధ్యక్షులు బోలగాని సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఇమ్రాన్, ఉపాధ్యక్షులు పిల్లి శంకర్, సహాయ కార్యదర్శి గోపగాని రాజు, కార్యవర్గ సభ్యులు సామల శోభన్‌బాబు, నాయకులు జంగ నరసయ్య, ముంతాజ్‌బేగం, బాగుల వసంత, కళ్లెం సిద్దులు, రవి, సైదులు, రాజు, కృష్ణ, నరసింహ, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజ నిర్మాణంలో భాగస్వాములమవుదాం

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఇది ఒక్కరో ఇద్దరి వల్లనో అయ్యేది కాదని ఏదైనా ప్రశ్నించే తత్వం ప్రతి ఒక్కరూ అవలంబించుకోవాలని, అడిగనిదే అమ్మ అయినా అన్నం పెట్టదనే చందంగా ఉంది ప్రస్తుత సమాజం, ఇందుకు స్వచ్ఛంద సంస్థలు పుట్టుకు రావాలని. అప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని ఎక్కడ చూసినా అవినీతి, ఎటుచూసిన స్వార్థ రాజకీయాలు కాబట్టి ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలను చైతన్యం చేయడమే లక్ష్యంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ వనపర్తి జిల్లా అధ్యక్షుడిగా డి. రవిప్రసాద్ పై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పజెప్పిన మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ కు హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ ఈ బాధ్యతతో సమాజ శ్రేయస్సు కోసం మందుకు సాగుతామని చట్టాలపై అవగాహన కల్పించే క్రమంలో అడుగు ముందును వేస్తామని త్వరలోనే మండల జిల్లా కమిటీలను ఏర్పాటు చేసి సంస్థ బలోపేతానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా మీడియాతో ఒక ప్రకటనలో అధ్యక్షులు డి రవి ప్రసాద్ అన్నారు.

## ఉపాధి కూలీలకు వసతులు కల్పించాలి



**ప్రజాపక్షం/పెబ్బేరు:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పెబ్బేరు మండలం తిపాయిపల్లి గ్రామ ఉపాధి పనిప్రదేశాన్ని జిల్లా కార్యదర్శి ఎం ఆంజనేయులు జిల్లా కమిటీ సభ్యులు బోరెల్లి బాను సందర్శించి, కూలీల సమస్యలను తెలుసుకుని, నేరుగా గ్రామపంచాయతీ కార్యాలయానికి తట్ట బుట్ట గంపలతో చేరుకుని, మూడు నెలల నుంచి పని చేసిన కూలి డబ్బులు ఇప్పటికి ఇవ్వలేదు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లకు, ఈసీలకు తదితర ఈజీఎస్ సిబ్బందికి పెండింగ్‌లో పెట్టిన మూడు నెలల వేతనాలు ఇవ్వాలని, కంటి ఫోటోను రద్దు చేయాలని, గ్రామంలో నుంచి పని ప్రదేశానికి ఆటో సౌకర్యం కల్పించాలని ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఉపాధిలో కూలి రేట్లు 300 నుంచి 800 రూపాయలకు పెంచాలని, వ్యవసాయంలో పని దినాలు పడిపోయిన మూలంగా కూలీలలకు వ్యవసాయంతో పనులు దొరకడం లేదా కాబట్టి వంద రోజుల నుంచి 200 రోజులు దినాలు కల్పించాలని కూలీలతో గ్రామపంచాయతీ కార్యాలయం ముందు ధర్నా చేశారు.అనంతరం గ్రామ పంచాయతీ సర్పంచ్ రాములు, గ్రామపంచాయతీ కార్యదర్శులకు వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ ధర్నాలో పాల్గొన్నవారు. కురువ గోవిందమ్మ, హోటల్ గోవిందమ్మ, మద్దమ్మ, మనమ్మ, పెద్దకిష్టన్న, గొల్ల లక్ష్మీ, మన్యం, బాలకిష్టమ్మ, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ తవ్వకాలు జరిపితే వాహనాల సీజ్

### తహసీల్దార్ మల్లారెడ్డి హెచ్చరిక

**ప్రజాపక్షం/ నర్వ :** మండలంలో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక, మట్టి తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్వ తహసీల్దార్ మల్లారెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అనుమతి లేకుండా ఇసుక లేదా మట్టిని తరలిస్తూ పట్టుబడితే ఏమాత్రం ఉపేక్షించకుండా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. కేవలం వాహనాల జప్తు మాత్రమే కాకుండా అక్రమ తవ్వకాలకు పాల్పడే వారి పై సంబంధిత చట్టాల కింద క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. మండలంలో సహజ వనరుల దోపిడీ జరగకుండా రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతుందని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ఎవరైనా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని తహసీల్దార్ మల్లారెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.


## పేదల కడుపు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం: పల్లెపాగు ప్రశాంత్



**ప్రజాపక్షం/కొత్తకోట:** కొత్తకోట మండలం అమడబాకుల గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ పల్లెపాగు శ్రీకాంత్, మండల అధ్యక్షుడు నాగారావు బీచుపల్లి వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, రైతు దళారులను నమ్మి మోసపోవద్దు అని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. పేదలకు కడుపు నిండా అన్నం పెట్టడమే లక్ష్యంగా కాంగ్రెస్ కృషి చేస్తోందని రైతు దళారులను నమ్మి మోసపోవద్దు అని, కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ బాలరాజు, సత్యరెడ్డి, రంగారెడ్డి, మన్నెం, ఉపసర్పంచు బాలరాజు, నాటవెల్లి సర్పంచు బొందల ప్రశాంత్, రానా, సింగిల్ విండో డైరెక్టర్ పావని, కొల్లంపల్లి యాదవ్, శ్రీనివాసులు, వెంకటయ్య, ఏ.కృష్ణయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం

### పామిరెడ్డి పల్లెల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/అమరచింత:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు ఐదు ఎకరాల వరకు రైతు భరోసా పథకం ద్వారా డబ్బులను వేసినందుకు రైతులు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం అమరచింత మండల పరిధిలోని పామిరెడ్డి పల్లెలో ఐకెపి ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన శాఖ మంత్రి వాకిటి శ్రీహరి చిత్రపటాలకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామలక్ష్మారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అరుణ్ కుమార్‌లు పాలాభిషేకం చేశారు. రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేజీ మహేందర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్ ముదిరాజ్, మార్కెట్ యార్డ్ కమిటీ సభ్యులు కమలాకర్ గౌడ్, రవికాంత్ కాంగ్రెస్ నాయకులు జింక రవి యాదవ్ కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీ కాంత్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటయ్య, వెంకటరెడ్డి, తిరుమల్‌రెడ్డి, శివారెడ్డి, కృష్ణ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# చివరిగింజ వరకూ కొంటాం

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని హన్వాడ మండలంలో ఐకెపి ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి నాయనోని పల్లి, హన్వాడ గ్రామాల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చివరి గింజ వరకూ కొంటాం అంటూ రైతులకు భరోసా ఇచ్చారు. రైతే రాజు అని, రైతుల అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. రైతులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన, రైతులు తమ పంటలను నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. మధ్యవర్తుల మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. వరి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు గిట్టుబాటు ధర అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు సంతోషంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతు సంక్షేమానికి ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఎమ్ఎస్‌పి అందించడంపై ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రైతుల ఆర్థిక భారం తగ్గించేందుకు రూ.2లక్షల వరకు రుణమాఫీ అమలు చేసి ఉపశమనం కల్పించామని తెలిపారు. రైతు బంధు పథకం ద్వారా పెట్టుబడి సహాయం అందిస్తున్నామని, కౌలు రైతుల కోసం ఇందిరమ్మ ఆత్మీయ రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తున్నామని పేర్కొనానరు. ప్రతి రైతుకు తీసుకుంటున్నామని చెప్పారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి రైతు సంక్షేమ చర్యలు కీలకమని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రతి రైతు కుటుంబ అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వ పనిచేస్తోందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు వి శ్రాం తి సదుపాయాలు ఏర్పాటు చేయాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గన్నీ బస్తాలు సమృద్ధిగా సిద్ధంగా ఉంచాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుం డా ముందుస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. రైతులు సులభంగా తమ ధాన్యం విక్రయించుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జి ల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వి.మహేందర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, నవనీత, యాదిరెడ్డి, సర్పంచ్లు బొట్టు శ్రీను నాయక్, ఇస్నాతి సుధాకర్, నాయకులు టంకర కృష్ణ య్య యాదవ్, తిరుపతయ్య, షబ్బీర్ హుస్సేన్, మోహన్, క్రిష్ణ, ఎం.నర్సింహులు, వెంకటయ్య, బొక్కి రాములు తదితరులు పాల్గొన్నారు.

## ఎసిబికి పట్టుబడ్డ నారాయణపేట్ ఆర్డీఓ

### లేట్ బర్త్ సర్టిఫికెట్ల కోసం రూ.25 వేలు లంచం

### వివరాలు వెల్లడించిన ఎసిబి డిఎస్‌పి బాలకృష్ణ



**ప్రజాపక్షం/నారాయణపేట్:** నారాయణపేట్ ఆర్డీఓ రామచందర్ నాయక్ మంగళవారం ఎసిబికి పట్టుబడారు. లేట్ బర్త్ సర్టిఫికెట్ల కోసం లంచం డిమాండ్ చేయగా ఒక్కో బర్త్ సర్టిఫికెట్‌కు రూ.5వేల చొప్పున రూ.25 వేల లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడారు. ఈ సందర్భంగా ఎసిబిబీ డిఎస్‌పి బాల కృష్ణ మాట్లాడుతూ గత సంవత్సరం జులైలో ఓ వ్యక్తి బర్త్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేయకోగా తాహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయానికి ఫైల్ ఫార్వర్డ్ అయిందని బర్త్ సర్టిఫికెట్ల కోసం ఆర్డీఓ లంచం డిమాండ్ చేయగా డబ్బులు తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నట్లు తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఎసిబిని ఆశ్రయించవచ్చని ఎసిబిఆశ్రయించిన వ్యక్తుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. నారాయణపేట్ ఆర్డీఓ ఎసిబికి పట్టుపడడం జిల్లా కేంద్రంలో హాట్ టాపిక్ గా మారింది.

## ఎనిమిది మంది జూదరులు అరెస్ట్

**ప్రజాపక్షం/ మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన బూత్‌పూర్ అంజప్ప పశువుల షెడ్డు వద్ద పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్, మక్తల్ పోలీసులు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదారులను పట్టుకొని రూ. 22,000 నగదు, 52 పేకాట కార్డులు, 7 మొబైల్ ఫోన్లు, 1 మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకొని, వారిపై గేమింగ్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మక్తల్ ఎస్ఐ భాగ్యలక్ష్మి రెడ్డి తెలిపారు

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** రాజాపూర్ మండలంలోని కుత్నేపల్లి గ్రామ పంచాయితీకి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉప సర్పంచ్ మణెమ్మ బంద్యా నాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు రూప్ సింగ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్ అధ్యక్షుడు తిరుమలేష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీను నాయక్, వెంకటేష్, దూల్యా నాయక్ అందరికీ బిఆర్ఎస్ పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి గులాబీ కండువా కప్పి బిఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సేవ్యనాయక్, మాజీ వార్డు మెంబెర్స్, రామ్‌సింగ్, శేఖర్, ప్రవీణ్, శంకర్ పాల్గొన్నారు.

# సమర్థవంతంగా సంక్షేమ వారోత్సవాలు

### మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందాలి

### విద్యార్థులతో కలిసి కలెక్టర్ ప్రతీక్ జైన్ సహపంక్తి భోజనం



**ప్రజాపక్షం/నారాయణపేట:** జిల్లాలో ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో సంక్షేమ వారోత్సవాలు విజయవంతంగా కొనసాగాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 24వ తేదీ వరకు నిర్వహించే సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా మరికల్ పిఎంశ్రీ సోషల్ వెల్ఫేర్ పాఠశాల, రెసిడెన్సియల్ జూనియర్ కళాశాల కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలలు అలాగే జూనియర్ కళాశాలలో సంక్షేమ వారోత్సవాలు సమర్థవంతంగా నిర్వహించాలని, కిచెన్ తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంటగది, స్టోర్ రూమ్ , రైస్ రూమ్‌లో బియ్యం చూశారు. డైనింగ్ హాల్ తో పాటు పరిసరాలను పరిశీలించారు. ఫ్యాన్స్ లైట్స్ అన్ని ఉన్నాయా అని ప్రిన్సిపాల్‌ని అడిగి తెలుసుకున్నారు. బిల్డింగ్ మొత్తం తిరిగి చూశారు. ఈ సందర్భంగా విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించి విద్యార్థులతో కలిసి కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, ప్రిన్సిపాల్, తాహసీల్దార్ ,పిఆర్ఈఈ, ఎంపీడీవో, టీచర్లు, సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బకాయిలు వెంటనే విడుదల చేయాలి

### ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్



**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు గత పది నెలలుగా కట్ చేసిన వేతన ఏరియర్స్ బడ్జెట్‌ను తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆసుపత్రి పారిశుద్ధ్య సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ వైద్య విధాన పరిషత్ టీవీవీపీ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వం ఆసుపత్రిలో పడకల సామర్థ్యాన్ని 30 నుండి 23కు తగించిన కారణంగా కార్మికులు వేతనాలు భారీగా కోతకు గురయ్యాయని పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ 60 ప్రకారం పూర్తి వేతనం అందించాల్సి ఉన్నప్పటికీ పడకల సంఖ్య తగ్గిందనే కారణంతో గత పది నెలలుగా కార్మికులకు కేవలం రూ.7,500 మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. వెంటనే ఆసుపత్రి పడకల సామర్థ్యాన్ని తిరిగి 30కి పెంచడంతో పాటు, పడకల సంఖ్యతో సంబంధం లేకుండా కార్మికులకు పూర్తి వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే, గత పది నెలలుగా కట్ చేసిన వేతనాల ఏరియర్స్ ను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ ఆసుపత్రి కార్మికులు వరలక్ష్మి , లింగమ్మ, పార్వతమ్మ, అలివేల, బాలేశ్వరమ్మ, పొన్నమ్మ, నాగమ్మ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



**ప్రజాపక్షం/అడ్డాకుల:** అడ్డాకుల మండలం లో పిఎసిఎస్, ఐకెపి ఆధ్వర్యంలో రాచాలా, పొన్నకల్, గుడిబండ, పెద్దమునగల్ చెడు, చిన్న మునగాల్ చెడు, తిమ్మాయపల్లి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఆయాగ్రామాల సర్పంచ్‌లు ఉప సర్పంచ్ లు వార్డు సభ్యులతో కలిసి జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కందూరు నాగిరెడ్డి ప్రారంభించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులు వారి ఖాతాల్లో జమ అవుతాయని అని అన్నారు.గ్రేడ్ ఏ రకం(సన్నాలు) ధాన్యం క్వింటాకు రూ.2,389 సాధారణ రకం క్వింటాల్ కు రూ.2,350 మద్దతు ధర ఇస్తామని, సన్న రకం ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని పేర్కొన్నారు. రైతులు ఇబ్బందులు పడవద్దనే ఉద్దేశ్యంతో ముందస్తుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దశరథ్ రెడ్డి, రాజు శ్రీనివాసులు, మన్యం, తిరుపతయ్య, నాగార్జునరెడ్డి, విజయమోహన్ రెడ్డి, వేగనాథ్, శేఖర్‌రెడ్డి, సంజీవ రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహావీర్ రాఘవేందర్ , శకుంతల, జగదీష్, రాజు, తదితర నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

# ప్రతికేసులో పారదర్శకంగా విచారణ

### జిల్లా ఎస్‌పి డాక్టర్ వినీత్




**ప్రజాపక్షం/నారాయణపేట:** జిల్లాలో నమోదు అవుతున్న ఆయా కేసులలో అధికారులు పకడ్బందీగా పారదర్శకంగా విచారణ చేపట్టాలని, అందుకు క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌ను పెంపొందించుకోవాలని, ప్రతి కేసును లోతుగా విచారణ చేపట్టి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలని జిల్లా ఎస్‌పి డా.వినీత్ పోలీస్ అధికారులకు తెలియజేశారు. మంగళవారం జిల్లా పోలీస్ అధికారులు, డీఎస్పీలు, సీఐలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలతో జిల్లా ఎస్పీ కార్యాలయంలో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. అందులో భాగంగా ముందుగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, యుఐ కేసులను అడిగి పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగులో ఉన్న కేసులను సత్వరమే పరిష్కారానికి కృషి చేయాలని, ప్రాపర్టీ నేరాలను లోతుగా విచారణ చేపట్టి నేరస్తులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని, తెలిపారు. నేరాల నియంత్రణలో చేతనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డిఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, సిఐలు శివశంకర్, రామ్‌లాల్, భగవంత్‌రెడ్డి, సైదులు, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, విజయ్ కుమార్, బాలరాజు, వెంకటేశ్ గౌడ్, రమేష్, భాగ్యలక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, ఎస్‌యం నవీద్, నరేష్, విజయ్, భాస్కర్, పురుషోత్తం, శ్రీనివాసులు, సునీత, గాయత్రి, రేవతి, మహేశ్వరి, స్టేషన్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఈత సరదా విషాదంగా మారొద్దు

### జిల్లా ఎస్‌పి డి.జానకి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** పాఠశాలలు, కళాశాలలకు, వేసవి సెలవులు రావడంతో పిల్లలు, యువకులు చెరువులు , కాలువలు, కుంటల వద్దకు ఈతకు వెళ్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, ఈ సందర్భంలో ప్రమాదాలు జరిగి నీటిలో మునిగి ప్రాణ నష్టం జరుగుతున్న సంఘటనలు నమోదవుతున్నాయని జిల్లా ఎస్‌పి డి.జానకితెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈత రానివారు బావులు, చెరువుల వద్దకు ఒంటరిగా వెళ్లకూడదని, ఈత నేర్చుకునే వారు తప్పనిసరిగా తల్లిదండ్రుల సమక్షంలోనే నేర్చుకోవాలని తెలిపారు. పిల్లలు చెరువులు, కాలువలు, కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు వారి కదలికలను గమనిస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణ నష్టానికి దారితీయవచ్చని హెచ్చరించారు.

# దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలి



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** రాష్ట్రపతి ఉత్తర్వులు వెంటనే రద్దుచేసి దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని ఎమ్మార్పీఎస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షులు రాజన్న డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని పరిణయం ఫంక్షన్ హాల్లో మంగళవారం దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు గుమ్మకొండ రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గ దళిత క్రైస్తవుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మార్పీస్ అధ్యక్షులు పి. రాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్ట్ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా వర్తించదని తీర్పు వెలువరిస్తే అన్ని రాజీయ పార్టీలు మౌనం వహించిన ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ దళిత క్రైస్తవులకు అండగా ఉండి పోరాడుతానని పిలుపునిచ్చారని పేర్కొన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపుతో జిల్లాలో ఉన్న ఎమ్మార్పీఎస్ నాయకులు కూడా మీకు అండగా ఉంటామని తెలిపారు. దళిత సిక్కు, బౌద్ధులకు మినహాయింపు ఇచ్చినట్టే దళిత క్రైస్తవులకు న్యాయం చేయాలని అన్నారు. దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షుడు గుమ్మ కొండ రాజు మాట్లాడుతూ.. దేశంలో క్రైస్తవం రాకముందు ఏ విధమైన వివక్ష ఉన్నదో నేటికీ అదే వివక్ష కొనసాగుతుందన్నారు. బ్రాహ్మణ, రెడ్డి, కమ్మ, వైశ్య కులస్తులు క్రైస్తవ మతంలోకి వెళ్తే సామాజిక హోదా మారినప్పుడు కేవలం దళితులకు మాత్రమే ఎందుకు హోదా మారుతుందని ప్రశ్నించారు. అందుకే దళిత క్రైస్తవులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పోరాడి ఎస్సీ హోదా సాధించుకుందామని పిలుపునిచ్చారు. దళిత క్రైస్తవుల పై అమలులో ఉనన 1950 రాష్ట్రపతి ఉత్తర్వులను తక్షణమే రద్దు చేయాలని లేదా వాటి పరిధి నుండి దళితులను మినహాయించాలని ఈ ఉత్తర్వులు దళితులకు రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛకు ఆర్టికల్ 14,15, 25 లకు పూర్తిగా విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు తమ ఇష్టానుసారంగా మతాన్ని ఎంచుకునే హక్కు కలిగి ఉండాలని, ఇతర వర్గాలైన ఓసి, బిసి, ఎస్టీ లకు లేని మత పరిమితులు కేవలం ఎస్సీలకే ఎందుకు విధిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు. ఏ మతంలో ఉండాలనేది వ్యక్తిగత నిర్ణయం అని దాని పై ఆంక్షలు విధించే హక్కు ఎవరికీ లేదన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత క్రైస్తవుల హక్కుల పోరాట సమితి సభ్యులు, ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షులు పర్శ పాకుల శేఖర్, అరుణ్ కుమార్, యోహాన్, నందు, శ్రీకాంత్, శేఖర్, ఆనంద్, జ్యోతి ప్రసాద్, శివరామ్ ప్రసాద్, పాస్టర్లు లూకాస్, రామస్వామి, జెబి రాజు, సృజన్ వివిధ మండలాల పాస్టర్స్ సంఘ పెద్దలు యూత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత చదువులతో గొప్ప స్థాయి

### ఇంచార్జీ కలెక్టర్ ఆదర్శ్ సురభి

**ప్రజాపక్షం/ గద్వాల రూరల్ :** చదువుతోనే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని, విద్యార్థులు చక్కగా చదువుకొని తాము అనుకున్న రంగాల్లో రాణించాలని జిల్లా ఇంచార్జి కలెక్టర్ ఆదర్శ్ సురభి పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల రెండో రోజు మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రంలోని అన్ని సంక్షేమ వసతి గృహాల్లో వారోత్సవాలను ఘనంగా నిర్వహిస్తోందన్నారు. విద్యార్థి దశలో చక్కగా చదువుకొని మంచి ఫలితాలు సాధిస్తే వారి భావి జీవితమంతా సంతోషంగా ఉంటుందన్నారు. చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విద్యార్థులు రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. నృత్య, నాటక ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను అభినందించారు., బాల్యవివాహాలు వంటి సామాజిక రుగ్మతలను నివారించేందుకు విద్యార్థులు తమ వంతుగా కృషి చేయాలన్నారు. సంక్షేమ వసతి గృహాల్లో ఉండే సమస్యల పరిష్కారానికి ఈ వారోత్సవాల సందర్భంగా చేపట్టబోయే పనులకు సంబంధించిన ప్రతిపాదనలు చేయాలన్నారు. అంతకు ముందు పలువురు విద్యార్థులు చేసిన నృత్య, నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం కలెక్టర్, ఇతర అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ప్రత్యేక అధికారి నూకరాజు, గద్వాల తహసిల్దార్ హరికృష్ణ, స్థానిక కౌన్సిలర్ వేదవతి, మహనీయుల ఉత్సవ కమిటీ చైర్మన్ నాగరాజు, ఇతర అధికారులు, వార్డెన్ తదితరులు పాల్గొన్నారు.

## బండి సంజయ్ ఏ గ్రహం? పెండింగ్ సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ?

### ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి ధ్వజం

**ప్రజాపక్షం/యాదాద్రి** : కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను రాహు, కేతు గ్రహాలతో పోల్చిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలను భువనగిరి లోక్ సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తప్పుబట్టారు. మంగళవారం మీడియాతో మాట్లాడిన ఆయన అసలు బండి సంజయ్ నవగ్రహాల్లో ఏ గ్రహమో చెప్పాలని ఎద్దేవా చేశారు. బండి సంజయ్ కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమయ్యారని, రాష్ట్ర ప్రయోజనాలపై ఆయనకు పట్టింపు లేదని విమర్శించారు. ముఖ్యంగా తెలంగాణలో మెట్రో ఫేజ్2, రీజినల్ రింగ్ రోడ్, మూసీ ప్రక్షాళన వంటి కీలక ప్రాజెక్టులపై కేంద్ర మంత్రి తన వైఖరి ఏంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలోకి కేంద్ర నిధులు తీసుకువచ్చేలా బండి సంజయ్, కిషన్ రెడ్డి కలిసి ఒక బహిరంగ సభ పెట్టాలని, రాజకీయాలకు అతీతంగా ప్రజలను సమీకరించే బాధ్యతను తాము తీసుకుంటామని చామల సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టులో బీఆర్ఎస్ లక్ష కోట్లు దోచుకుందని, అది వారికి ఏటీఎం అని విమర్శించిన బీజేపీ, గత పదేళ్లుగా అధికారంలో ఉండి కూడా ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎంపీ ప్రశ్నించారు. జీవన్ రెడ్డి ఎటువంటి ఆలోచన లేకుండా నిర్ణయం తీసుకున్నారని, నిన్నటితో ఆయన పండుగ అయిపోయిందని వ్యాఖ్యానించారు.

## రైతులకు ఇబ్బందులు రావొద్దు

### నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశించారు. మంగళవారం దామరచర్ల మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. తేమశాతం వచ్చిన ధాన్యానికి ఎప్పటికప్పుడు కాంటాలు వేసి కొనుగోలు చేసి తరలించాలన్నారు. గన్ని బ్యాగ్‌లు, లారీలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్, తహసీల్దార్ జవహర్‌లాల్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, ఏవో రుషేంద్రమణి, ఏఈవో పార్వతి, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

## భువనగిరిలో బెల్లి లలితక్క విగ్రహం ఏర్పాటు సంతోషదాయకం

### ఎమ్మెల్యేను కలిసిన బెల్లి లలితక్క విగ్రహ కమిటీ సభ్యులు



**ప్రజాపక్షం/భువనగిరి** : తెలంగాణ సంస్కృతిని, ఉద్యమ స్ఫూర్తిని చాటిచెప్పిన బెల్లి లలితక్క విగ్రహాన్ని భువనగిరిలో ఏర్పాటు చేయడం సంతోషదాయకం అని భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. తెలంగాణ గాన కోకిల,ప్రజా గాయని, ఉద్యమ గళం బెల్లి లలితక్క విగ్రహాన్ని భువనగిరి పట్టణంలో ఏర్పాటు చేసేందుకు స్థానిక శాసన సభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి సానుకూలంగా స్పందిం చారు. నేడు భువనగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బెల్లి లలితక్క కుమారుడు, విగ్రహ కమిటీ సమన్వయ కర్తలు సూర్య ప్రకాష్, జన్ని వెన్నెల విగ్రహ ఏర్పాటు కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా భువనగిరిలో విగ్రహ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని, తగిన సహకారం అందించాలని వారు ఎమ్మెల్యేకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ స్థల సేకరణ విగ్రహ ప్రతిష్టాపన పనులకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు భట్టురామచంద్రయ్య, సామ మల్లారెడ్డి, పోత్నక్ ప్రమోద్ కుమార్, పోతంశెట్టి మంజుల వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, గుర్రాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మేడేను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/దేవరకొండ:** ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను జయప్రదం చేయాలని ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి అన్నారు. మంగళవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో మేడే పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886మే 01న అమెరికా దేశంలోని చికాగో నగరంలో కార్మికుల రక్తంతో తడిసిన ఎర్రజెండా నేటికి ప్రపంచ వ్యాప్తంగా మేడే పండుగను జరుపుకుంటున్నారని కార్మికులు తమకు 8 గంటల పని విధానం కావాలని పోరాటం చేసి ఆ పోరాటంలో పోలీసుల కాల్పుల్లో తడిచిన ఎర్రజెండా నేటికి ప్రపంచ వ్యాప్తంగా ఎగురుతుందని ఆనాటి కార్మికులు పోరాడి కార్మిక చట్టాలను నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి పెట్టుబడిదారులకు అనుకూలంగా మారుస్తున్నారన్నారు. కార్మికుల అడ్డాల వద్ద మేడేను ఘనంగా జరుపుకోవాలని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, డివిజన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వెంకట్రాములు, మైనోద్దీన్, వెంకటయ్య, మల్లయ్య, బోజ్యా, దేవరాజ్, అంజమ్మ, శ్రీను పాల్గొన్నారు.

## మొదటి బస్సు నుంచే సమ్మెలోకి వెళ్తాం



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆర్‌టిసి కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే సమ్మెకు సిద్ధం కావాలని రాష్ట్ర జేఏసీ నాయకులు బి. నరేందర్,యారచంద్రయ్య,జిల్లా నాయకులు టిజె రావు,ఎన్ఆర్సీ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని బస్ డిపోలో నల్లగొండ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జేఏసీతో చర్చించి కార్మికుల సమస్యలను పరిష్కరించని యెడల రేపు ఉదయం మొదటి బస్సు నుంచే సమ్మెలో పాల్గొంటామని హెచ్చరించారు.కార్మిక వర్గం అంతా ఐక్యంగా సమ్మెకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.అనంతరం నల్లగొండ జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు.జేఏసీ ఛైర్మన్‌గా టీజే రావు, వైస్ ఛైర్మన్‌గా ఎన్ఆర్సీ రాజు,కన్వీనర్‌గా యార చంద్రయ్య, కోశాధికారిగా కేఎల్ నాయక్,కోకన్వీనర్లుగా ఈఎస్ రెడ్డి,ఏఎల్ స్వామి, వీఎస్ రెడ్డి, ఎండీ అన్వర్,ఎండీ తయ్యబ్‌లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొర్ర లింగా నాయక్, డిపో జేఏసీ నాయకులు ఏ. శేఖరయ్య, బి. వెంకటేశం, ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

# రాత్రీ పగలు ధాన్యం సేకరణ

### యుద్ధ ప్రాతిపదికన యాసంగి ధాన్యం పూర్తి చేయాలి

### అధికారులతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సమీక్ష



**ప్రజాపక్షం/నల్లగొండ:** నల్లగొండ జిల్లాలో యాసంగి వరి ధాన్యం సేకరణను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అధికారులను ఆదేశించారు.మంగళవారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయం ఇందిరా భవన్‌లో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి పౌరసరఫరాలు,మార్కెటింగ్,డిఆర్‌డిఏ, రవాణా,కోఆపరేటివ్ తదితర శాఖల అధికారులు,రైస్ మిల్లర్లతో యాసంగి దాన్యం సేకరణ పై సమీక్ష నిర్వహించారు.రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం సేకరణ వేగవంతం చేయాలని,అన్ని కొనుగోలు కేంద్రాలకు పూర్తిస్థాయిలో లారీలను పంపించి రాత్రి,పగలు ధాన్యం కొనుగోలు చేసి అవసరమైతే లైట్లు ఏర్పాటు చేసి ధాన్యాన్ని సేకరణ సేకరించాలని,రానున్న వారం,పది రోజుల్లో ధాన్యం సేకరణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకొని అన్ని కొనుగోలు కేంద్రాలలో తప్పనిసరిగా నీడ తాగునీరు ఏర్పాటు చేయాలని,రైతులకు ఎలాం టి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని,లారీలు,హమాలీల కొరత లేకుండా చూడాలన్నారు.జిల్లా వ్యాప్తంగా ధాన్యం పరిశీలించినట్లయితే నల్లగొండ నియోజకవర్గంలోనే 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని, అందువల్ల నియోజకవర్గంలోని అన్ని కొనుగోలు కేంద్రాలకు వీలైనన్ని ఎక్కువ లారీలు ఏర్పాటు చేయాలని ,ప్రతిరోజు 10, 000 మెట్రిక్ టన్నులకు పైగా కొనుగోలు చేయాలని చెప్పారు. షెడ్యూల్ ప్రకారం ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, జిల్లాలో 6 మిల్లులు సీజ్ చేయడం వల్ల వచ్చిన మిల్లులకే ధాన్యం ఎక్కువగా వస్తున్నదని తెలిపారు.ఏఎంఆర్‌పి లైనింగ్ పూర్తి కావడం వల్ల నీటి సౌకర్యం పెరిగిందని,దీంతో రైతులందరూ బత్తాయి నిమ్మ తోటలను తీసేసి ధాన్యాన్ని పండిస్తున్నారని తెలిపారు. ఏది ఏమైనప్పటికీ రానున్న వారం,10 రోజుల్లో 90 ధాన్యం కొనుగోలు పూర్తి చేస్తామన్నారు.నల్లగొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, రెవెన్యూ కలెక్టర్ జె. శ్రీనివాస్,స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేశం, మార్కెటింగ్ ఏడి ఛాయాదేవి,డిసిఓ పత్యా నాయక్, డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్,ఆర్‌టిఏ లావణ్య, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు హాజరయ్యారు.

# ఎస్‌బిఐ ఎసిబి దేవరకొండ బ్రాంచ్‌లో భారీ మోసం

### నలుగురు నిందితుల అరెస్ట్.. రూ.2.42 కోట్లు,ల్యాప్‌టాప్, మొబైల్స్ స్వాధీనం

### జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ వెల్లడి




**ప్రజాపక్షం/నల్లగొండ:** దేవరకొండ పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) ఏసీబీ బ్రాంచ్‌లో జరిగిన భారీ ఆర్థిక మోసం కేసును దేవరకొండ పోలీసులు ఛేదించి, నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.వారి వద్ద నుంచి రూ.2 కోట్ల 42 లక్షల 10 వేల నగదు, 6 స్మార్ట్ మొబైల్ ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.మంగళవారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి మాట్లాడుతూ ఈ నెల 13న ఎస్‌బిఐ ఏసీబీ బ్రాంచ్ మేనేజర్ ఫణీంద్ర నీలకంఠ వెంకట రాఘవపూడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.బ్యాంక్‌లో కాంట్రాక్ట్ హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న లెండల చక్రపాణి,ఇనాక్టివ్ ఖాతాల వివరాలను దుర్వినియోగం చేసి, నాన్‌బ్రాంచ్ కేవైసీ అప్‌డేట్ ద్వారా రూ.2.65 కోట్లకు పైగా మోసపూరితంగా బదిలీ చేసినట్లు గుర్తించినట్లు తెలిపారు.ఈ కేసులో లెండల చక్రపాణి,పుట్ట వెంకట రామాంజనేయులు,కేతవత్ రాంలాల్, మారేపల్లి శివలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.నకిలీ ఆధార్,పాన్ కార్డులు తయారు చేసి,ఖాతాల్లో మొబైల్ నంబర్లు మార్చి, యోనో యాప్ ద్వారా డబ్బులు బదిలీ చేసినట్లు దర్యాప్తులో బయటపడిందన్నారు.ఈ కేసును దేవరకొండ డిఎస్‌పి ఆధ్వర్యంలో పి.వెంకట్ రెడ్డి,ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్,పర్యవేక్షణలో బి.రాజు,వీరబాబు,పోలీస్ కానిస్టేబుల్ ఎండీ .ఫయాజ్,చాంద్ పాషా,వి.సింహాద్రి, సోమ్లాను జిల్లా ఎస్పీ అభినందించారు.

# ‘అమ్మ’ అనే బంధానికే మచ్చ!

### హత్యాయత్నానికి దిగిన కూతురు, మనవళ్లు

### మానవత్వాన్ని మంటగలిపిన కుటుంబ కలహాలు



**ప్రజాపక్షం/కోదాడ రూరల్** : కన్నతల్లినే కడతేర్చేందుకు ప్రయత్నించిన ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని పాతగుడిబండ గ్రామంలో సోమవారం అర్థరాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సంబంధాలు, మానవత్వాన్ని మంటగలిపే ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కుక్కడపు గురవమ్మ అనే వృద్ధ మహిళకు నలుగురు కుమారులు, ముగ్గురు కూతుర్లు ఉన్నారు. కుటుంబంలో ఆస్తి, వ్యక్తిగత సమస్యల కారణంగా తరచూ గొడవలు జరుగుతూ ఉండేవి. ముఖ్యంగా చిన్న కూతురు గుడిద లక్ష్మి కుటుంబంలో వివాదాలు మరింత పెరిగాయి. లక్ష్మి కుమారుల్లో ఒకరికి ఆరోగ్య సమస్యలు ఉండడంతో, ఈ విషయంపై తరచూ కుటుంబ సభ్యుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ వివాదాల్లో గురవమ్మ తరచూ జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నించేది. అయితే, ఇదే విషయం చిన్న కూతురు కుటుంబానికి ఆగ్రహానికి కారణమైంది. ఈ క్రమంలోనే సోమవారం అర్థరాత్రి సమయంలో లక్ష్మి , ఆమె కుమారులు కలిసి గురవమ్మపై దాడి చేసి హత్య చేయాలని ప్రయత్నించినట్లు సమాచారం. వృద్ధురాలు తీవ్రంగా గాయపడగా, స్థానికులు గమనించి వెంటనే అడ్డుకున్నారు. అనంతరం ఆమెను చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ కలహాలు ఎంతటి దారుణానికి దారి తీసాయో ఈ ఘటన స్పష్టంగా చూపిస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న కోదాడ రూరల్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళను వివరాలు అడిగి తెలుసుకొని కేసు నమోదు చేశారు.

## సంక్షేమ వసతి గృహాలలో సమస్యలపై నివేదికలు అందజేయాలి

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సంక్షేమ వసతి గృహాలలో నెలకొన్న సమస్యలపై సత్వరమే నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల సందర్భంగా సూర్యాపేటలోని కెజిబివిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెస్ కమిటీలు సక్రమంగా రిజిస్టర్ మెయింటన్ చేయాలన్నారు. రోజువారీగా స్టాక్ వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచడం జరిగిందని, మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాలలో వసతి గృహాలలో నెలకొన్న సమస్యలతోపాటు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న వసతి గృహాలలో రిపేర్లను గుర్తించి నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. రిపేర్ల కోసం నివేదికను అందించాలని తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి పెట్టి రెగ్యూలర్‌గా మానిటరింగ్ చేస్తున్నామని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో వసతి గృహాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వసతి గృహాలలో రెగ్యులర్‌గా పేరెంట్స్, టీచర్ మీటింగ్ ఏర్పాటు చేసుకొని విద్యార్థుల సమస్యలపై చర్చించుకోవాలన్నారు. అనంతరం వంటశాల, స్టోర్ గదులను, లివింగ్ రూమ్‌లను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మెనూపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. కెజిబివిలో ఫ్యాన్లు, మైనర్ రిపేర్ల కోసం కలెక్టర్ అవైలబుల్ నిధుల నుండి రూ. 50 వేలు అందించారు. అనంతరం సాంఘీక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి డిబేట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఎంఈఓ శ్రీనివాస్ గౌడ్, ఎస్‌ఓ నారాయణమ్మ, జిసిడిఓ పులమ్మ పాల్గొన్నారు.

# డబ్బులిస్తేనే లారీ లోడింగ్..!

### తాలు,తరుగు పేరుతో క్వింటాకు 4నుంచి 5కిలోల కోత

### కాంటాలు వేసి వారం గడిచినా ఎత్తని ధాన్యం

### రైతుల ఆందోళన





**ప్రజాపక్షం/నకిరేకల్ :** రాష్ట్ర ప్రభుత్వం రైతు రాజ్యం అని చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అన్నదాతల సమస్యలు మాత్రం తగ్గడం లేదు. నకిరేకల్ నియోజకవర్గంలోని కట్టంగూరు,నకిరేకల్,కేతపల్లి మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ,కొనుగోళ్లు నెమ్మదిగా సాగడం,లారీల కొరత,అక్రమ వసూళ్లు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.అధికారుల పర్యవేక్షణ లోపం పరిస్థితిని మరింత విషమం చేస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు.

**55 కొనుగోలు కేంద్రాలు..** అయినా నెమ్మదైన కొనుగోళ్లు నకిరేకల్ నియోజకవర్గంలో కట్టంగూర్,కేతేపల్లి,నకిరేకల్ మొత్తం 55 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.కట్టంగూరు మండలంలో 24 కేంద్రాలు(ఐకేపీ8,హాకా2,పీఏసీఎస్6,ఎఫ్‌పీఓ4,ఎన్‌డీసీఎంఎస్3), నకిరేకల్ మండలంలో 17 కేంద్రాలు(ఐకేపీ1, ఎఫ్‌పీఓ 2,ఎన్‌డీసీఎంఎస్6,పీఏసీఎస్8),కేతేపల్లి మండలంలో 14 కేంద్రాలు (పీఏసీఎస్4, ఎన్‌డీసీఎంఎస్6, ఐకేపీ3) పనిచేస్తున్నాయి.అయితే ఎక్కడ చూసినా కొనుగోళ్లు నెమ్మదిగానే సాగుతున్నాయి. లారీల కొరత మిల్లుల్లోనూ నిలిచిపోయిన అన్‌లోడింగ్ లారీల కొరతతో పాటు లోడైన వాహనాలు కూడా రైస్ మిల్లుల వద్ద రోజులు తరబడి అన్లోడింగ్ కాకుండా నిలిచిపోతున్నాయి. దీంతో ధాన్యం రవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించిన పరిస్థితి నెలకొంది.లారీ డ్రైవర్లు ఒక్కో వాహనానికి ఒక బస్తాకు రెండు రూపాయల నుండి మూడు రూపాయలు లారీ మొత్తానికి రూ.2,000 నుంచి రూ.3,000 వరకు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.లారీల అడ్డగింపు రైతుల నిరసన ఈ పరిస్థితికి నిరసనగా రైతులు చెర్వుఅన్నారం శివసాయి రైస్ ఇండస్ట్రీస్ వద్ద లారీలను అడ్డుకుని ఆందోళన చేపట్టారు. కాంటాలు పూర్తయి వారం రోజులు గడిచినా మా ధాన్యం ఎందుకు తరలించడం లేదు?,డబ్బులు ఇచ్చిన వారికే ప్రాధాన్యం ఎందుకు? అంటూ ప్రశ్నించారు.

**కుమ్మక్కై దోపిడీ చేస్తున్నారన్న ఆరోపణలు**

రైస్ మిల్లర్లు,లారీ యజమానులు,కొనుగోలు కేంద్రాల సిబ్బంది కుమ్మక్కై రైతులను నిలువ దోపిడీ చేస్తున్నారని రైతులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ఈ పరిస్థితి ఒక్క గ్రామానికి పరిమితం కాకుండా నియోజకవర్గవ్యాప్తంగా కొనసాగుతోందని వాపోతున్నారు. పర్యవేక్షణ చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.




## జెఇఇ మెయిన్స్‌లో జయ జూనియర్ కళాశాల విద్యార్థుల విజయభేరి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : జెఇఇ మెయిన్ 2026 మంగళవారం విడుదలైన పరీక్షా ఫలితాలలో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించినట్లు కళాశాల కరస్పాండెంట్ జయవేణుగోపాల్ తెలిపారు. ఈ ఫలితాలలో 5గురు విద్యార్థులు 99 పైన పర్సంటైల్స్, 26గురు విద్యార్థులు 90 ఆ పైన, 74 మంది విద్యార్థులు జెఇఇ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత సాధించారన్నారు. ఎన్. సాయి రిత్విక్ 99.55, జి. శ్రీనిక 99.43, అశువర్ధన్ 99.36, ఎం. రితిన్‌షెట్టి 99.23, సి.హెచ్. శివకుమార్ 99.09, ఎస్.కె. నేహ 98.68, డి. సిరి 97.16, యం.డి. హాదియ 96.96, జి. వంశీ 96.09, జి. హర్షిత 95.92, వి. గౌతమ్ కుమార్ 95.71 పర్సంటైల్ సాధించారు. ఆల్ ఇండియా అన్ని కేటగిరిలలో 115, 563, 862, 963లతోపాటు 5000లోపు 10 ర్యాంకులు, 10000లోపు 18 ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభన కనపరిచిన విద్యార్థులను, కృషి చేసిన అధ్యాపక బృందాన్ని బొకెలతో అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు జెల్లా పద్మ, బింగి జ్యోతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘రేస్’ విద్యార్థుల ప్రభంజనం




**ప్రజాపక్షం/కోదాడ:** జెఈఈ మెయిన్స్ సెషన్ 2 ఫలితాలను సోమవారం ఎన్‌టిఏ విడుదల చేసింది. ఈ ఫలితాలలో కోదాడ పట్టణంలోని రేస్ ఐఐటి మెడికల్ అకాడమి విద్యార్థులు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి ర్యాంకులు సాధించినట్లు కళాశాల చైర్మన్ బాణాల వసంతారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన మొక్క చరణ్‌సాయి 99.56 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో 1583, చిలుకూరు భాను శంకర్ 98.76 పర్సంటైల్ 5225, ఐ.కృష్ణ చరణ్ 97.25 పర్సంటైల్ 6274 ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థులు వివిధ కేటగిరి విభాగాల్లో గుండ్లపల్లి రమ్యశ్రీ 431 ఈడబ్ల్యూఎస్, చింతకాయల కార్తీక్ 1489 ఓబిసి,బాణోతు గణేష్ 148, ఎం. సంజీవ్ 9132 లు జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించారు. దేశవ్యాప్తంగా ఐఎన్‌ఐటిల ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షల్లో తమ అకాడమి విద్యార్థులు ప్రతిభ కనబర్చడం వల్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ‘ఎన్ఆర్ఎస్’ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాపక్షం/కోదాడ:** సోమవారం ప్రకటించిన జెఈఈ మెయిన్స్ పలితాలలో కోదాడ పట్టణానికి చెందిన ఎన్ఆర్ఎస్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మన్ వడ్డె రాజేష్‌చౌదరి అన్నారు. తమ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు జాతీయ స్థాయిలో విద్యా సంస్థల్లో ప్రవేశాలకు అర్హత సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. జాతీయస్థాయిలో కళాశాలకు చెందిన తొండపు దీపిక 438, గాదె జస్వంత్ 540, బి. విజయ్ 2952, బి.రేవంత్ 8231, జె. సుధాకర్ 10843, ఆర్ కార్తీక్ 14410, యరబోలు శరణ్య 15220, బి.శిరిష 17337, పొందూరి అమృత సుధావర్షిణి 28547 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించి పుష్పగుచ్చాలు అందజేశారు. డైరెక్టర్ మనోహర్‌రెడ్డి, కరస్పాండెంట్ వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ జివి, వైస్ ప్రిన్సిపాల్ పిఎన్ఆర్‌లు, అధ్యాపకులు పాల్గొన్నారు.




ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
22-04-2026
www.prajapaksham.in

'కన్నడ చిత్ర పరిశ్రమలో ఘనవిజయం సాధించిన 'రాక్షసపుర' చిత్రాన్ని క్రియేటివ్ కమర్షియల్స్ అధినేత కె.ఎస్. రామారావు తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు. డాక్టర్ రవి దర్శకత్వంలో రాజ్ బి శెట్టి హీరోగా రూపొందిన ఈ చిత్రాన్ని తెలుగులో 'రాక్షసపురం' పేరుతో మే 1న విడుదల చేయనున్నారు.'

రీల్

## 'క్యాస్ట్'లో రంగరాజన్‌గా నాగబాబు



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎ.కె జంపన్న రచన దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'క్యాస్ట్'. ఈ చిత్రంలో నాగబాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని రంగరాజన్‌గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ని రిలీజ్ చేశారు. నల్ల దుస్తుల్లో, మెడలో రుద్రాక్షమాల, నుదుటిపై తిలకం ధరించి ఉన్న నాగబాబు లుక్ పవర్ ఫుల్ గా వుంది.ఈ గెటప్ ఆయన పాత్రలోని కమాండ్ అథారిటీ చూపిస్తోంది. ఇందులో ఆయన పాత్ర నిర్భయంగా, కులాలకు అతీతమైన మానవత్వంతో ఉండబోతుంది.ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన టీజర్ కు మంచి రెస్పాన్స్ వస్తోందని దర్శకుడు జంపన్న చెప్పారు. త్వరలోనే ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామన్నారు.

## 'సూర్య బి పాజిటివ్' టీజర్ లాంచ్



కాశీ క్రాఫ్ట్స్, నిర్మలం డ్రామాస్ బ్యానర్స్‌పై సుబ్బా మాధవరపు రచనా దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'సూర్య బి పాజిటివ్'. చరణ్ పీసర్ల హీరోగా, యానీ డయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్స్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి అరుణ్ కుమార్ పర్వతనేని డిఓపిగా గ్యాని సంగీతాన్ని అందిస్తున్నారు. దండోరా చిత్ర దర్శకుడు మురళికాంత్ దేవసోత్, కిష్కింధపురి చిత్ర దర్శకులు కౌశిక్ పెగల్లపాటి ముఖ్య అతిథులుగా హాజరైన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నటి సుజాత మాట్లాడుతూ సూర్య బి పాజిటివ్ చిత్ర తొలి వేడుకకు ముఖ్య అతిథులుగా వచ్చిన ఇద్దరు దర్శకులకు ధన్యవాదాలు. సాధారణంగా నేను చాలా గట్టిగా మాట్లాడే మనిషిని, కానీ ఈ చిత్రంలో నా పాత్ర చాలా సైలెంట్. నేను ఇప్పటివరకు నటించిన పాత్రలలో ఎక్కువ డైలాగులు ఉండేవి కాని ఈ సినిమాలో నా కళ్ళతో నటించేలా చేశారు. నా పాత్రకు, నాకు పూర్తిగా వ్యతిరేకం. సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు. సినిమా టీజర్ చాలా బావుంది. సినిమాలో చరణ్ చాలా బాగా నటించారు. మన చుట్టు పక్కల ప్రాంతాలలో మనం చూసే ఒక సాధారణ కథను సినిమాగా మీ ముందుకు తీసుకుని రాబోతున్నాము అన్నారు. నటి దివ్య విశ్వకర్మ మాట్లాడుతూ నేను ఈ రోజు ఒక తెలుగు సినిమాలో నటించి ఈ స్టేజిపై నిలబడడం అనేది ప్రత్యేకంగా అనిపిస్తుంది. నా భాష కానప్పటికీ నన్ను ఆదరించి, నాకు అవకాశం ఇచ్చినందుకుగాను ఆనందంతో పొంగిపోతున్నాను అని చెప్పారు. నటి యానీ డయానా మాట్లాడుతూ మా దర్శకునికి, నటినటులకు, సాంకేతిక బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను. ఇది నా తొలి సినిమా. నటుడు చరణ్, గేయ రచయిత రాంబాబు గోసాల, దండోరా చిత్ర దర్శకులు మురళికాంత్, కిష్కిందపురి చిత్ర దర్శకులు కౌశిక్ పెగల్లపాటి పాల్గొన్నారు.

## ఆద్యంతం వినోదాత్మక చిత్రం 'పురుష'



సరస్వతి బత్తుల సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు నిర్మించిన చిత్రం 'పురుష:'. ఈ సినిమాతో పవన్ కళ్యాణ్ బత్తుల తెరకు పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహిస్తున్నారు. అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే బయటకు వచ్చిన కంటెంట్ ట్రేడ్ వర్గాల్లో హైప్‌ను క్రియేట్ చేసింది. పాటలు అయి తే యూట్యూబ్‌లో ట్రెండింగ్‌గా నిలిచాయి. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు చివరి దశలో ఉన్నాయి. సమ్మర్ కానుకగా ఈ సినిమాని మే నెలలో రిలీజ్ చేయాలని ప్లాన్స్ చేస్తున్నారు. ఫ్యామిలీ అంతా కలిసి చూడ దగిన కామెడీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా 'పురుష:' రూపొందుతోంది. ఈ మూవీకి శ్రవణ్ భరద్వాజ్ సంగీతాన్ని అందిస్తున్నారు. సతీష్ ముత్యాల కెమెరా మెన్‌గా, కోటి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ప్రస్తుతానికి ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ బత్తుల, సప్తగిరి, కసిరెడ్డి రాజ్‌కుమార్, విషిక, హాసిని సుధీర్, శ్రీరామ్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్నారు.

## తొలిప్రేమ దర్శకుడితో బెల్లంకొండ గణేష్



బెల్లంకొండ గణేష్, ఎ.కరుణాకరన్, అనుదీప్ కె.వి, భీమ్స్ సిసిరోలియో, గోల్డెన్ టర్టిల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ న్యూఏజ్ రొమాంటిక్ కామెడీ మూవీ ఘనంగా ప్రారంభం అయింది. 'తొలి ప్రేమ', 'హ్యాపీ', 'ఉల్లాసంగా ఉత్సాహంగా', 'డార్లింగ్' వంటి యూత్‌ఫుల్ బ్లాక్‌బస్టర్ చిత్రాలతో పాపులరైన దర్శకుడు ఎ.కరుణాకరన్, హీరో బెల్లంకొండ గణేష్‌తో కలిసి గోల్డెన్ టర్టిల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై మౌనికా రెడ్డి నిర్మాణం లో ఒక న్యూఏజ్ రొమాంటిక్ కామెడీ చిత్రం చేస్తున్నారు. కరుణాకరన్ తనదైన శైలిలో సాఫ్ట్, ఎమోషనల్ లవ్ స్టోరీని అందిస్తుండగా, దర్శకుడు అనుదీప్ కెవీ తన యూనిక్ క్విర్కీ హ్యూమర్, షార్ప్ స్టైల్ డైలాగ్స్‌తో కథకు న్యూ కలర్ తెస్తున్నారు. ఆయన డైలాగ్ రైటర్‌గా పనిచేయడం ఫన్ ఫ్రెష్ నెస్ మరింత పెరగనుంది. స్టార్ కంపోజర్ భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. కరుణాకరన్, అనుదీప్, భీమ్స్.. ఈ ముగ్గురు కలయిక ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిస్తోంది. ప్రతి ఒక్కరూ తమదైన ప్రత్యేక శైలిని జోడించి ఒక ఫుల్ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకోస్తున్నారు. ఈ సినిమా గ్రాండ్ పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. దర్శకుడు వీవీ వినాయక్ తొలి క్లాప్ ఇవ్వగా, అనుదీప్ కెవి స్క్రిప్ట్ అందించి కెమెరా ఆన్ చేశారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుంది.

## కామెడీ చాలా ఫ్రెష్‌గా ఉంటుంది
## డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్

తరుణ్ భాస్కర్ హీరోగా రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'గాయపడ్డ సింహం'. మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2010లో కాలేజీలో ఉన్నప్పుడు షార్ట్ ఫిలిమ్స్ ట్రెండ మొదలైయింది. నాకు మొదట్లో యాక్టర్ అవ్వాలని ఉండేది. ఆడిషన్స్‌కు వెళ్లేవాడిని. కానీ రిజెక్ట్ అవ్వడం కామన్. నన్ను డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ కోసమా అని అడిగేవారు. తర్వాత షార్ట్ ఫిలిమ్స్ చేసి మనల్ని మనం ప్రూవ్ చేసుకోవాలని అనుకున్నాను. షార్ట్ ఫిలిమ్స్ చేసే ప్రాసెస్‌లో రైటింగ్, డైరెక్షన్, ఎడిటింగ్ అన్నిటిపై ఆసక్తి ఏర్పడింది. షార్ట్ ఫిలిమ్స్, వెబ్ సిరీస్ చేశాను. ఆ తర్వాత కొన్ని సినిమాలకు పని చేసే అవకాశం వచ్చింది. దర్శకుడిగా 'గాయపడ్డ సింహం'తో వస్తున్నాను. ఈ కథకి టిపికల్ హీరో అవసరం లేదు. ఇందులో హీరో క్యారెక్టర్.. హీరోగా ఫీల్ అయితే ఆడియన్స్‌కు నవ్వు రావాలి. అలాంటి కథ, క్యారెక్టర్ ఇది. ఈ క్యారెక్టర్ కు తరుణ్ భాస్కర్ యాప్ట్. ఇందులో క్యారెక్టర్లు అన్నీ కూడా వాళ్ల లైఫ్‌లో చాలా సీరియస్‌గా ఉంటాయి. వారిని చూస్తున్నపుడు ఆడియన్స్ పాయింట్ ఆఫ్ వ్యూలో నవ్వొస్తుంది.తరుణ్ భాస్కర్ తన ప్రేమ కోసం అమెరికా వెళ్లి, అక్కడ డిపోర్టేషన్‌కు గురై మళ్లీ ఇండియాకు వస్తాడు. ఏ కారణం చేత తిరిగి వచ్చాడో, ఆ ఫ్రస్ట్రేషన్‌తో తీసుకునే నిర్ణయాలు ఎంత ఫన్ క్రియేట్ చేశాయో అనేది చాలా ఆసక్తికరంగా ఉంటుంది. జేడీ చేసిన ధర్మ పాత్ర పూర్తిగా డిఫరెంట్. అక్రమ రవాణాలో ఉండే క్యారెక్టర్. తరుణ్, ధర్మ ఈ రెండు పాత్రలు ఎలా కలుస్తాయో అనేది కథ చాలా కొత్తగా ఉంటుంది. 'మనీ' సినిమాలో బ్రహ్మానందం క్యారెక్టర్ గుర్తుంటుంది. అందులో తనను తాను హీరోగా ఫీల్ అవుతాడు. ఈ సినిమాలో ప్రతి పాత్ర కూడా హీరోగానే ఫీల్ అవుతుంది. ఇందులో అందరూ ఖాన్ దాదాలే. శుభలేఖ సుధాకర్‌తో కెజిఎఫ్ స్టైల్ నరేషన్ చెప్పించాం. అది చాలా ఫన్‌గా వచ్చింది. ఈ సినిమాలో మొదటి సీన్ నుంచే మంచి కామెడీ ఉంటుంది. డైలాగ్, విజువల్, యాక్షన్, సిచ్యుయేషనల్.. ఇలా అన్ని రకాల కామెడీ ఉంటుంది. చిన్నప్పటి నుంచి నాకు ఇమిటేషన్ అలవాటు. అలాగే నా వెబ్ సిరీస్, షార్ట్ ఫిలిమ్స్‌లో స్పూఫ్స్ ట్రై చేశాను. అవి బాగా వైరల్ అయ్యాయి. ఆ అనుభవం మొత్తం ఈ సినిమాకు ఉపయోగపడింది. మానస వల్లనే తరుణ్‌కు ఒక సమస్య వస్తుంది. ప్రజెంట్ టైమ్‌లో ఫరియా పాత్ర ఉంటుంది.ఇందులో జేడీ చక్రవర్తి ధర్మ పాత్రలో ఒక ఇంట్రెస్టింగ్ ఇంటర్‌లింక్ ఉంటుంది. అది ఆడియన్స్ ఎంజాయ్ చేసేలా ఉంటుంది. ఈ కథకి సీక్వెల్ చేసే అవకాశం ఉంది.



## అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల అరెస్ట్



రూ.రెండున్నర కోట్ల విలువ చేసే హాష్ అయిల్ స్వాధీనం
వరంగల్ సిపి సన్ ప్రీత్ సింగ్ వెల్లడి

ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్

ఒడిశా నుండి ముంబయికి గంజాయి మొక్కల నుండి తీసిన రూ.రెండున్నర కోట్ల విలువ చేసే హాష్ ఆయిల్‌ను తరలిస్తున్న నలుగురు సభ్యులు గల అంతర్ రాష్ట్ర ముఠాను వరంగల్ కమీషనరేట్ పోలీసులు పట్టుకున్నారు. గతంలో ఎప్పుడు లేని విధంగా తొలిసారిగా భారీ స్థాయిలో హాష్ ఆయిల్ (గంజాయి మొక్కల నుండి తీసిన నూనె) స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముఠాను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వరంగల్ డ్రగ్ కంట్రోల్, క్యాట్ పార్టీ, ఇంతేజార్‌గంజ్ పోలీసులు సంయుక్తంగా కలసి అరెస్టు చేసారు. ఈ ముఠా నుండి పోలీసులు సుమారు రూ. 2 కోట్ల 50 లక్షల విలువ గల హాష్ ఆయిల్‌తో పాటు రెండు సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో హంటల్ సన్ను (23,సువ్వపల్లి గ్రా మం, చిత్రకొండ మం డలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషా), హంటల్ సన్యాసి (23, రేకపల్లి, చిత్రకొండ మండలం, మల్కాన్ గిరి జిల్లా,ఒడిషా) కండెల చిన్నబాబు(56,దారకొండ గ్రామం,గూడెం మండలం, అల్లూరి జిల్లా, ఆంధ్రప్రదేశ్), క ష్ణా హంటల్ (56,రేకపల్లి, చిత్రకొండ మండలం, మల్కాన్‌గిరి జిల్లా, ఒడిషా) చెందిన వారిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నిందితుడు కిలో పాండు ప్రస్తుతం పరారీ వున్నాడు. ఈ అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ వెల్లడించారు. పట్టుబడిన నిందితులందరు పరిచయస్తులు కాగా, ఇందులో ప్రధాన నిందితుడు హంటల్ సన్ను తన స్వగ్రామంలో గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని మిగితా నిందితుల ద్వారా విక్రయించి సోమ్ము చేసుకుని జల్సాలకు చేసేవారు. కాని నిందితులకు గంజాయి విక్రయాలలతో వచ్చే డబ్బు వారి జల్సాలకు సరిపోక పోవడంతో ప్రధాన నిందితుడు గంజాయి మొక్కల నుండి హాష్ అయిల్‌ను తయారు చేస్తే పెద్ద మొత్తంలో సంపాదించు కోవచ్చునని మరో నిందితుడు కిలో పాండు చెప్పాడు. పాండు ఇచ్చిన సూచనల మేరకు ప్రధాన నిందితుడు మిగితా నిందితులతో కలసి గంజాయి మొక్కలను పెంపకం చేపట్టిన అనంతరం, నిందితుడు పాండు తీసుకవచ్చిన పరికరం ద్వారా ఈ ముఠా సభ్యులు గంజాయి మొక్కలను ద్వారా 40 కిలోల హాష్ అయిల్‌ను సేకరించారు.ఈ విధంగాంగా తయారు చేసిన హాష్ అయిల్‌లో 20కిలోల హాష్ అయిల్‌ను పాండు తను తీసుకోగా, మిగితా 20 కిలోల హాష్ అయిల్‌ను కిలో చోప్పున ప్యాకెట్లలో భద్రపర్చి పట్టుబడిన నిందితదులందరు ఐదు కిలోల చోప్పున హాష్ అయిల్‌ను తీసుకోని ముంబాయిలో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లోని తుని రైల్వే స్టేషన్ నుండి ఈ నెల 19 తేది అర్ధరాత్రి కోనార్క్ రైలులో బయలుదేరారు. వరంగల్ రైల్వేలో పోలీసుల తనిఖీలు నిర్వహిస్తున్నట్లుగా ముఠా సభ్యులకు అనుమానం రావడంతో వారు వరంగల్ రైల్వే స్టేషన్‌లో సోమవారం రాత్రి దిగారు.మంగళవారం ఉదయం ముంబాయి వేళ్ళేందుకు ముఠా సభ్యులు వరంగల్ బస్టాండ్ వద్ద వున్న రైల్వే గూడ్స్ షెడ్ పరిసరాల్లో అనుమాస్పదంగా తిరుగున్నట్లుగా పోలీసులకు సమాచారం అందుకొన్నారు. పోలీసులు వెళ్ళి నిందితులను అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 20 కిలోల హాష్ అయిల్‌ను పోలీసులు గుర్తించారు.అంతర్ రాష్ట్ర గంజాయి స్మగ్లర్ల ముఠాను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన పోలీసులను పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ అభినందించారు.

## భూ హక్కులకు 'భూధార్' భరోసా!



కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్
భూవివాదాల పరిష్కారంలో కీలక అడుగు
భూమిపై హక్కు స్పష్టంగా ఉన్నప్పుడే
రైతు కుటుంబానికి భద్రత
మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : రైతు జీవితం భూమితోనే ముడిపడి ఉంటుందని, ఆ భూమిపై హక్కు స్పష్టంగా ఉన్నప్పుడే రైతు కుటుంబానికి భద్రత ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ, భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'ఇంటిగ్రేటెడ్ భూభారతి శాశ్వత పరిష్కారం అందించే దిశగా చర్యలు వేగవంతం చేసినట్లు చెప్పారు. ఈ క్రమంలో ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను సమన్వయం చేస్తూ రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా ఐదు మండలాల్లో పోర్టల్‌ను ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో సర్వే మ్యాప్‌తో తొలి భూ రిజిస్ట్రేషన్ నిర్వహించడం ద్వారా కొత్త విధానానికి శ్రీకారం చుట్టి ంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సర్వే మ్యాప్, భూధార్ నెంబర్ ద్వారా హక్కులను శాశ్వతంగా నిర్ధారించడం వల్ల రైతులకు ధైర్యం, కుటుంబాలకు భరోసా కలుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూ సమస్యలకు అమలు చేస్తున్నట్లు వివరించారు. రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అనే నిబంధనను భూభారతి చట్టంలో చేర్చినట్లు తెలిపారు. భూస్వాములు స్వచ్ఛందంగా తమ ఆస్తులకు సంబంధించిన సర్వే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించామన్నారు. కూసుమంచి మండలంలోని గట్టు సింగారం గ్రామంలో సర్వే నెంబర్ 156/ఇ/1లో ఉన్న ఒక ఎకరం నాలుగు గుంటల భూమిని రైతు భాగం కిషన్ రావు, కట్టా వెంకటేశ్వరరావుకు విక్రయించే సందర్భంలో సర్వే మ్యాప్ జతచేసి రిజిస్ట్రేషన్ చేశారు. ఈ లావాదేవీకి సంబంధించి భూ కమత పట్టా1, భూధార్ నెంబర్ కేటాయించారు. ఈ విధానాన్ని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. భూభారతి చట్టం ద్వారా భూ వ్యవహారాల్లో పారదర్శకత పెరిగి, యాజమాన్యంపై సందేహాలకు తావు ఉండదని తెలిపారు. అధునాతన సాంకేతికతను వినియోగిస్తూ ఖచ్చితమైన సర్వేలు నిర్వహిస్తున్నామని, పాత విధానాలకు ముగింపు పలుకుతున్నామన్నారు.

## హక్కుల ఉల్లంఘన నోటీసు

(మూడవ పేజీ తరువాయి)

ఆపాదించడం అనేది హక్కుల ఉల్లంఘన, సభ పట్ల అగౌరవం కిందకు వస్తుందని ఆయన ఆరోపించారు. ఈ విషయాన్ని లోక్‌సభ హక్కుల కమిటీకి నిశిత పరిశీలన కోసం పంపాలని స్పీకర్ ఓం బిర్లాను కోరారు. లోక్‌సభ కార్యకలాపాల నిర్వహణ నియమావళిలోని 222వ నిబంధన కింద సమర్పించిన తన నోటీసులో, ఏప్రిల్ 17, 2026న లోక్‌సభలో 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు, 2026' వీగిపోయిన తర్వాత, 18వ తేదీన ప్రధానమంత్రి జాతీయ దూరదర్శన్ ద్వారా జాతిని ఉద్దేశించి ప్రసంగించారని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 368వ నిబంధనల ప్రకారం ఆమోదం పొందడానికి అవసరమైన మూడింట రెండు వంతుల మెజారిటీని ఆ బిల్లు సాధించలేకపోయింది.
కేరళలోని అలప్పుజ లోక్‌సభ నియోజకవర్గ ఎంపి, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అయిన వేణుగోపాల్ మాట్లాడుతూ 'జాతినుద్దేశించి చేసిన ప్రసంగం'గా పేర్కొన్న ఆ 29 నిమిషాల ప్రసంగంలో, ప్రధానమంత్రి ప్రతిపక్ష పార్టీలు ఆ బిల్లును అడ్డుకున్నాయని విమర్శించారని, అలాగే ప్రతిపక్ష సభ్యులు ఓటు వేసిన తీరుపై ప్రత్యక్షంగా వ్యాఖ్యలు చేస్తూ, వారికి దురుద్దేశాలను ఆపాదించారని తెలిపారు. పార్లమెంటు సభ్యులు సభలో చేసిన ప్రసంగాలకు సంబంధించి వారిపై వ్యాఖ్యలు చేయడం, నిందారోపణలు చేయడం, దురుద్దేశాలు ఆపాదించడం అనేది తీవ్రమైన హక్కుల ఉల్లంఘన, సభ పట్ల అగౌరవం కిందకు వస్తుందని స్పష్టంగా నిర్ధారించబడిందని వేణుగోపాల్ పేర్కొన్నారు. కాబట్టి, ఈ తీవ్రమైన సంఘటనను స్పష్టమైన, ఉద్దేశపూర్వక హక్కుల ఉల్లంఘనగా, సభ పట్ల అగౌరవంగా పరిగణించి, దీనిపై సమగ్ర విచారణ జరిపేందుకు లోక్‌సభ హక్కుల కమిటీకి పంపాలని కోరుతూ, తాను ఈ హక్కుల ఉల్లంఘన నోటీసును మీ కార్యాలయానికి సమర్పిస్తున్నానని, తద్వారా ప్రధానమంత్రిపై హక్కుల ఉల్లంఘన చర్యలను ప్రారంభించవచ్చు అని వేణుగోపాల్ తన నోటీసులో పేర్కొన్నారు. తమ విధులను నిర్వర్తిస్తున్న ఒక ఎన్నికైన ప్రజాప్రతినిధిని ప్రశ్నించడం అనేది కేవలం వ్యక్తిగత దాడి మాత్రమే కాకుండా, పార్లమెంటు అధికారానికి, భారతదేశ ప్రజల ప్రజాస్వామ్య హక్కులకు ప్రత్యక్ష అవమానం అని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందని ఆ కాంగ్రెస్ నాయకుడు తెలిపారు. పార్లమెంటు పవిత్రతను, సభ్యులకు కల్పించబడిన రాజ్యాంగ రక్షణలను పరిరక్షించడానికి తక్షణమే, నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాలని వేణుగోపాల్ స్పీకర్‌ను కోరారు. తద్వారా ఇలాంటి ఉల్లంఘనలను విస్మరించకుండా, పునరావృతం చేయకుండా చూడాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. పార్లమెంటులో ప్రభుత్వానికి అవసరమైన మెజారిటీ లభించని తరుణంలో, ప్రతిపక్ష పార్టీలను విమర్శించడానికి ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించడం అనైతికం, అధికార దుర్వినియోగం అని వేణుగోపాల్ అన్నారు. దేశ అత్యున్నత కార్యనిర్వాహక అధికారి చేసే ఇటువంటి ప్రకటనలు సభ హక్కుల తీవ్ర ఉల్లంఘన, సభ ధిక్కారం కిందకు వస్తాయని ఆరోపించారు. వేణుగోపాల్ లేఖను ట్యాగ్ చేస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మాట్లాడుతూ, అధికారంలో ఉన్న ప్రధాని జాతిని ఉద్దేశించి చేసే ప్రసంగం ఎల్లప్పుడూ జాతీయ ఐక్యత, విశ్వాస నిర్మాణం అనే ప్రధాన ఉద్దేశ్యం కోసమే ఉద్దేశించబడిందన్నారు. 'ఈ ప్రసంగంలో ప్రధానమంత్రి కాంగ్రెస్ పార్టీపై 59 రకాల దాడులు చేస్తూ, సిగ్గులేకుండా పక్షపాత ధోరణితో చేసిన ప్రజాకర్షణ వాదం, ప్రధానమంత్రిగా ఆయన రికార్డుపై మరో శాశ్వత మచ్చగా మిగిలిపోతుంది అని రమేష్ ఆరోపించారు.

## యూనిట్‌లో పేలుడు

(మూడవ పేజీ తరువాయి)

జరిగింది. గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొనడం, గాయపడిన వారిని తరలించడం, ఘటనా స్థలం నుంచి శరీర భాగాలను వెలికితీయడం వంటి దృశ్యాలను టెలివిజన్ ప్రసారం చేసింది. నలుగురు మరణించినట్లు ఒక సీనియర్ పోలీసు అధికారి ధృవీకరించారు. గాయపడిన వారికి ప్రత్యేక చికిత్స అందేలా చూడాలని, త్రిస్సూర్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాల, త్రిస్సూర్ జనరల్ ఆసుపత్రిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ అధికారులను ఆదేశించారు. సమీపంలోని ఆసుపత్రులను కూడా అప్రమత్తం చేశారు. అత్యవసర సహాయక చర్యలు, రోగుల తరలింపు కోసం కనిష్ 108 సర్వీసు కింద ఉన్న అంబులెన్స్‌లతో సహా అదనపు అంబులెన్స్‌లను మోహరించాలని ఆమె పిలుపునిచ్చారు. స్థానికుల కథనం ప్రకారం, మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో ఈ పేలుడు సంభవించింది. ఆ ప్రాంతంలో అడపాదడపా పేలుళ్లు కొనసాగుతుండటంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. వరి పొలాల మధ్య ఏకాంతంగా ఉన్న ఒక ప్రాంతంలోని పలు తాత్కాలిక షెడ్లలో బాణసంచా తయారు చేస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఒక ప్రభుత్వ అధికారి మాట్లాడుతూ, సుమారు 40 మంది కార్మికులకు ఆహారం ఏర్పాటు చేసినట్లు సమాచారం అందిందని, ప్రమాదం జరిగినప్పుడు కనీసం అంత మంది కార్మికులు అక్కడ ఉండి ఉండవచ్చని తెలిపారు. కొందరు కార్మికులు స్వల్ప గాయాలతో బయటపడినట్లు భావిస్తున్నారు. అగ్నిమాపక, సహాయక సిబ్బంది పోలీసులతో కలిసి ఆపరేషన్లకు నాయకత్వం వహిస్తున్నారు, అయినప్పటికీ కొనసాగుతున్న పేలుళ్లు సహాయక చర్యలకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఘటనా స్థలం నుంచి పలువురు గాయపడిన వారిని ఆసుపత్రులకు తరలించినట్లు వర్గాలు తెలిపాయి.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com